ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-7-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 177 పేజీలు: 12 వెల: 6.50

**మానసా దేవి ఆలయంలో తొక్కిసలాట, ఆరుగురు మృతి**

**నేను మాట్లాడిన తర్వాతే థాయిలాండ్, కాంబోడియా కాల్పుల విరమణ: ట్రంప్**


5లో

# సింగపూర్ తరహాలో 'అమరావతి'

## నేరుగా ఎపికి విమాన సర్వీసులు

## ప్రతి దేశ రాజధానిలోనూ వెంకన్న ఆలయం

## తెలుగు డయాస్పోరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియాలో సిఎం చంద్రబాబు



ఆదివారం సింగపూర్‌లో తెలుగు డయాస్పోరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియాలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై 27,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచానికి సేవలందించే అవకాశం నాలెడ్జ్ ఎకానమీలో ఉందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. నాలెడ్జ్ ఎకానమీలో అవకాశాలు అందిపుచ్చుకుంటే ప్రపంచానికి ఉపయోగపడతామన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు చాలా మంది పేదరికంలో ఉన్నారు. తిరిగి సమాజానికి ఇచ్చే బాధ్యత మనందరిపై ఉంది. సమన్వయం చేసుకుని ముందుకెళ్తే తిరుగులేని విజయం సాధిస్తారు. ఏ దేశానికి వెళ్లినా తెలుగు ప్రజలకు సమయం వెచ్చించాకే వెళ్తా. తెలుగు ప్రజలు చేసే మంచి పనులకు చేయూతనివ్వాలి. అవసరమైతే కొన్ని దేశాలకు చెందినవారిని ఎన్‌ఆర్‌టీలుగా పెడతాన్నారు. చంద్రబాబు, ముఖ్యమంత్రి సింగపూర్‌లో తెలుగు డయాస్పోరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో సిఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ భేటీకి మలేషియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా నుంచి తెలుగు ప్రజలు హాజరయ్యారు. తొలుత మా తెలుగుతల్లి గీతంతో డయాస్పోరాను నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సమావేశంలో మంత్రులు నారాయణ, టిజి భరత్, తదితరులు పాల్గొన్నారు. సింగపూర్ ప్రజల ఉత్సాహం రాష్ట్రాభివృద్ధికి దోహదం కావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

టిడిపి హయాంలోనే మూడేళ్లలో 300 ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటైనట్లు చంద్రబాబు గుర్తుచేశారు. పెద్దఎత్తున ఇంజినీరింగ్ కాలేజీల ఏర్పాటుపై చాలా మంది విమర్శించారని తెలిపారు. 1991లో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ, రూపకల్పన చేసిన వ్యక్తి పీవీ అని పేర్కొన్నారు. భవిష్యత్ అంతా ఐటీ, నాలెడ్జ్ ఎకానమీకి ఉంటుందని తాను నమ్మినట్లు తెలియజేశారు. నాలెడ్జ్ ఎకానమీలో తెలుగుజాతి అగ్రగామిగా ఉండాలంటే ఐటీ ప్రమోట్ చేయాలని ఆలోచించానని చంద్రబాబు వెల్లడించారు. మీరు ఆశీర్వదిస్తే అమరావతిని సింగపూర్‌లా చేస్తానని హామీ ఇచ్చాను. తొలిసారి ముఖ్యమంత్రి అయ్యాక పరిశ్రమల కోసం అమెరికా వెళ్లాను. రెండోసారి సీఎం అయ్యాక నేరుగా సింగపూర్ వచ్చాను. రాజధానికి ఉచితంగా మాస్టర్‌ప్లాన్ కావాలని కోరాను. ఉచితంగా మాస్టర్ ప్లాన్ తయారీకి సింగపూర్ ప్రధాని అంగీకరించారు. 2019 తర్వాత సింగపూర్ ప్రభుత్వాన్ని తప్పుపట్టే పరిస్థితి తెచ్చారు. ప్రభుత్వ బ్రాండ్‌పోతే ఏపీ నష్టపోతుందని సింగపూర్ సర్కార్‌కి చెప్పాను. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన నష్టాన్ని సింగపూర్ ప్రభుత్వానికి చెప్పాను. గతంలో జరిగిన తప్పులు సరిదిద్దేందుకే ఇక్కడికి వచ్చానని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 2047 నాటికి ఎక్కువ యువత ఉండే దేశం భారత్ అని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి భారతీయులు నంబర్ వన్‌గా ఉంటారని చెప్పారు. అమెరికాలో 43 దేశాల సంపన్నులతో జాబితా తయారు చేశారని పేర్కొన్నారు. ఆ జాబితాలోని 125 మందిలో 12 మంది భారతీయుల్లో సత్య నాదెళ్ల ఉన్నారని వివరించారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొస్తే అందులో సత్య నాదెళ్లపనిచేశారని గుర్తుచేశారు. మైక్రోసాఫ్ట్ >>2

## అంతరిక్ష రంగంలో 200 స్టార్టప్‌లు



### చిన్నారుల్లో పెరుగుతున్న ఆసక్తి
### మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జూలై 27:** దేశమంతటా పిల్లల్లో అంతరిక్షం పట్ల కొత్త ఉత్సుకత పెరుగుతోందని నేడు అంతరిక్ష రంగంలో 200కి పైగా స్టార్టప్‌లు వచ్చాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ప్రతి నెలా చివరి ఆదివారం నిర్వహించే మన్‌కీ బాత్ 124వ ఎపిసోడ్‌లో ప్రసంగించిన ప్రధాని, ఇటీవల అంతరిక్షం నుంచి తిరిగి వచ్చిన భారత వ్యోమగామి శుభాంశుశుక్లాపై ప్రశంసలు కురిపించారు. ఆయన ప్రయాణం దేశ ప్రజలకు గర్వకారణమన్నారు. ఆగస్టు 23వ తేదీన నేషనల్ స్పేస్‌డేను దృష్టిలో పెట్టుకొని ప్రజలు సలహాలు, సూచనలు పంపాలని మోదీ పిలుపునిచ్చారు. ఇందుకు నమో యాప్‌ను వాడుకోవాలన్నారు. స్వావలంబన మార్గం ద్వారా వికసిత్ భారత్ పయనిస్తోందని చెప్పారు.

వోకల్ ఫర్ లోకల్ అనేది ఆత్మనిర్భర్ భారత్‌కు బలమైన పునాది అని ప్రధాని పునరుద్ఘాటించారు. గత కొన్ని వారాల్లో క్రీడలు, సైన్స్, సాంస్కృతిక రంగాల్లో భారతీయులు గర్వపడేలా చాలా జరిగాయి. ఇటీవల శుభాంశు శుక్లా అంతరిక్షం నుంచి తిరిగి రావడంపై దేశంలో చాలా చర్చ జరిగింది. శుభాంశు భూమిపై సురక్షితంగా దిగిన వెంటనే ప్రజలు ఆనందంతో గంతులు వేశారు. నాకు ఇంకా గుర్తుంది 2023 ఆగస్టులో చంద్రయాన్3 విజయవంతంగా జాబిల్లిపై ల్యాండ్ అయినప్పుడు దేశంలో ఒక కొత్త వాతావరణం ఏర్పడింది. పిల్లల్లో సైన్స్, అంతరిక్షం గురించి కొత్త ఉత్సుకత మేల్కొంది. మేము అంతరిక్షానికి వెళతాం, మేము చంద్రునిపై కాలు పెడతాం, మేము వ్యోమగాములు అవుతామని ఇవాళ చిన్న చిన్న పిల్లలు చెబుతున్నారు. దేశంలో అంతరిక్ష రంగంలో అంకుర సంస్థలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఐదేళ్ల క్రితం 50 అంకుర సంస్థలు ఉంటే ఇవాళ 200కి పైగా ఉన్నాయని నరేంద్ర మోడీ అన్నారు. మహారాష్ట్రలో 12 కోటలను ప్రపంచ వారసత్వ సంపదగా యూనెస్కో గుర్తించింది. కొన్నేళ్ల క్రితం రాయగఢ్‌కు వెళ్లాను. అది నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అస్సాంలోని కజిరంగా నేషనల్‌పార్క్‌లో గడ్డి భూమి పక్షులకు నిలయం. అక్కడ 40 రకాలు ఉన్నాయి. టెక్నాలజీ బృందాలు వాటి కూతలు, ఎఐ ఆధారంగా లెక్కించాయి. టెక్నాలజీ, సెన్సివిటీ కలిస్తే ప్రతిదీ తేలిక అవుతుందని మోడీ పేర్కొన్నారు.

## అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ మౌలిక సదుపాయాల కోసం రూ.1052 కోట్లు

### టెండర్లు పిలిచిన సిఆర్‌డిఎ

**రాజంపేట, జూలై 27, ప్రభాతవార్త:** రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ప్రభుత్వ కాంప్లెక్స్ లేఅవుట్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలో 32ఎకరాల విస్తీర్ణంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.1052.67 కోట్ల అంచనా వ్యయంతో ఆదివారం సిఆర్‌డిఎ టెండర్ ఉత్తర్వులను జారీ చేసింది. అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ ఆకృతిని ఇప్పటికే నార్మన్ ఫోస్టర్ రూపొందించిన విశయం తెలిసిందే. ఈ సమీకృత కాంప్లెక్స్‌లో 5 టవర్లను నిర్మించనున్నారు. 1,2 టవర్ల నిర్మాణానికి రూ.1423 కోట్లు, 3,4 టవర్ల నిర్మాణానికి రూ.1247కోట్లు అంచనాతో ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తిచేశారు. సమీకృత ప్రభుత్వ కాంప్లెక్స్‌ను నిర్మాణాన్ని 32 ఎకరాల విస్తీర్ణంలో 4.85లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఈ పనులను ఇప్పటికే 3 ప్యాకేజీలుగా విభజించి టెండర్ ప్రకియను కూడా పూర్తి చేసుకున్నారు. ఒక్కో టవర్‌కింది భాగంలో 1.05 లక్షల చదరపు మీటర్ల పార్కింగ్ >>2

## అనకాపల్లి వైద్యులపై మంత్రి సీరియస్

### 22 మంది డాక్టర్లు నర్సులపై వైద్యమంత్రి చర్యలకు ఆదేశం



**విజయవాడ,జూలై 27,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వాసుపత్రుల్లో పాలన మరియు పర్యవేక్షణ లోపాలు, అక్రమాలతో వైద్య సేవల నాణ్యత లోపించడంపై వైద్యారోగ్య శాఖా మంత్రి తరచుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని మర్చడానికి గత ఏడాది కాలంగా మంత్రి తరచుగా సమీక్షలు నిర్వహిస్తుండడంతో కొంతమేర మార్పు స్పష్టంగా కనిపించింది. ఆస్పత్రుల్లో అవినీతి సమస్యకు అద్దంపడుతూ గతంలో అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆసుపత్రిలో పలు అక్రమాలకు పాల్పడిన 22మంది వైద్యులు, నర్సులపై శీఘ్రగతిన విచారణ చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. వివరాల్లోకివెళ్తే.. అనకాపల్లి ఆసుపత్రిలో పలు అక్రమాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో ఫిబ్రవరి, 2020లో ఎసిబి ఆకస్మిక తనిఖీ చేపట్టి పలు అక్రమాలపై నివేదిక సమర్పించింది. ప్రభుత్వాసుపత్రుల్లో గత ప్రభుత్వ పాలనా కాలంలో నెలకొన్న పరిస్థికి అద్దంపట్టిన ఎసిబి నివేదిక మేరకు నియమాల ప్రకారం క్రమశిక్షణా చర్యల్ని చేపట్టేందుకు అప్పటి డిసిహెచ్ యస్(డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్), మరో తొమ్మిది మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సుల అక్రమాలపై శీఘ్ర గతిన విచారణ చేపట్టాలని మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ ఆదేశించారు. లైసెన్స్ లేకుండా క్యాంటీన్ నిర్వహణ, భోజనం అందించాల్సిన రోగుల వివరాల్ని తెలపకపోవడం, ఆహార సరఫరా నాణ్యత పట్ల నిర్లక్ష్యం, నియమాలకు భిన్నంగా సివిల్ పనుల్ని కట్టబెట్టడం, వైద్యులు, ఇతర సిబ్బంది హాజరును నియంత్రించకపోవడం, సరైన పర్యవేక్షణ చేయడంలో పూర్తిగా విఫలమైన అప్పటి డిసిహెచ్‌యస్‌పై మేజర్ పెనాల్టీ విధించేందుకు విచారణ చేపట్టాలని ఎసిబి అధికారులు ఈ ఏడాది జూన్‌లో ఇచ్చిన తమ నివేదికలో సూచించారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు తమ తమ విధుల నిర్వహణలో వైఫల్యం చెందిన మరో 9 మంది వైద్యులపై కూడా క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఎసిబి సిఫారసు చేసింది.

12 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులపై కూడా క్రమశిక్షణా చర్యల్ని చేపట్టాలని ఎసిబి కోరింది. ఇన్ పేషెంట్లను ఎక్కువగా చూపడంతో పాటు, రోగులకిచ్చే భోజనం నాణ్యతపై నిర్లక్ష్యం, >>2

# ఎపిలో పెట్టుబడులకు సింగపూర్ కంపెనీలు ఆసక్తి

## సిఎం చంద్రబాబు నాయుడుతో హైకమిషనర్




సింగపూర్‌లో భారత్ హైకమిషనర్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూలై 27,ప్రభాతవార్తప్రతినిధి:** పోర్టులు, గ్రీన్ ఎనర్జీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఎపిలో పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. సింగపూర్‌కు చెందిన కంపెనీలు ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ప్రోగ్రెసివ్ పాలసీలు అమల్లో ఉన్నాయని వెల్లడించారు. సింగపూర్ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబుతో సింగపూర్‌లో భారత హై కమిషనర్ శిల్పక్ ఆంబులే మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సింగపూర్ ప్రభుత్వంలో, పారిశ్రామిక వేత్తల్లో సిబిఎన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని భారత హై కమిషనర్ ముఖ్యమంత్రికి తెలిపారు. వివిధ రంగాల్లో సింగపూర్ సాధించిన ప్రగతి, వృద్ధి, ఆ దేశంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పాలసీలు, సింగపూర్‌లో భారతీయుల కార్యకలాపాల గురించి భారత హై కమిషనర్ సిఎంకు వివరించారు. ఆరోగ్య రంగం, గ్రీన్ హైడ్రోజన్, ఏవియేషన్, సెమి కండక్టర్స్, పోర్టులు, పారిశ్రామిక రంగాల్లో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలపై తెలియజేశారు.

భారత్‌తో సింగపూర్ ప్రభుత్వం మంచి సంబంధాలను కలిగి ఉందని శిల్పక్ అంబులే వివరించారు. భారత్‌లో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని భారత హైకమిషనర్ ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ గతంలో సింగపూర్‌తో కలిసి అమరావతి ప్రాజెక్టును చేపట్టామని.. కొన్ని కారణాల వల్ల రాజధాని ప్రాజెక్టు నుంచి సింగపూర్ వైదొలిగిందని అన్నారు. 2019-24 మధ్య జరిగిన పరిణామాలు దీనికి కారణమయ్యాయన్నారు. ప్రస్తుతం తన పర్యటనలో గతంలో జరిగిన అపోహల్ని తొలగించి రికార్డులను సరిచేసేందుకు ప్రయత్నిస్తానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అలాగే ఎపిలో వివిధ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త పాలసీలను, అవకాశాలను భారత హై కమిషనర్‌కు సిఎం వివరించారు. ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఇప్పటికే విశాఖలో ఎన్టీపిసి, కాకినాడలోనూ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు పట్టాలెక్కాయని సిఎం వివరించారు. అలాగే ఇండియా క్వాంటం మిషన్‌లో భాగంగా అమరావతిలో తొలి క్వాంటం వ్యాలీ ఏర్పాటు చేయనున్నట్టు తెలియజేశారు. విశాఖలో దిగ్గజ ఐటీకంపెనీ గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోందని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని వివిధప్రాంతాల్లో ప్రత్యేకించి రాయల >>2

## గులక రాయి కేసులో నిందితుడు అదృశ్యం

**విజయవాడ,జూలై 27,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ సిఎం జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆయనపె గులకరాయితో జరిగిన దాడి కేసులో నిందితుడిగా ఉన్న విజయవాడ అజిత్‌సింగ్ నగర్ వడ్డెర కాలనీకి చెందిన వేముల సతీష్ అదృశ్యమయ్యాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత ఏడాది ఏప్రిల్‌లో ఎన్నికల ప్రచారం చేస్తుండగా జగన్‌కు, పక్కనే ఉన్న అప్పటి సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాసరావుకు ఓ చిన్న రాయి తగిలింది. ఈ కేసులో వేముల సతీష్‌ను ఏ2గా నిర్ధారించి పోలీసులు అరెస్టుచేసి జైలుకు పంపారు. కొద్దిరోజుల క్రితం వరకు ఇంటి వద్ద ఉన్న సతీష్ వారంరోజులుగా కనిపించడం లేదు. ఓ బాలికతో ఉన్న ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు చెబు >>2

## ఐపిఎస్ అధికారిపై రౌడీషీటు వ్యాఖ్యలా?

### నిర్లక్ష్యం వల్లే ఎంఎల్‌ఎ గన్‌మెన్‌పై వేటు

**చిత్తూరు, జూలై 27 ప్రభాతవార్త:** పోలీసు శాఖ ప్రజల కోసమే విధులు నిర్వహిస్తోందని పోలీసు అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో ఆదివారం జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఖాదర్‌భాషా, కోశాధికారి పరంధాములు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పలుచోట్ల మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని, దీనిని దృష్టిలో వుంచుకుని ఆయన బంగారుపాళ్యం పర్యటనకువచ్చినపుడు 500మంది మామిడి రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాటుకు పోలీసుశాఖ అనుమతి ఇచ్చిందన్నారు. పోలీసు ఉత్తర్వులు పాటించకుండా వైఎస్సార్సీ నాయకులు అంబటి రాంబాబు ఐపిఎస్ అధికారిపై తాము అధికారంలోకి వస్తే రౌడీషీట్ ప్రారంభిస్తామని పేర్కొనడం దేనికి సంకేతమని వారుప్రశ్నించారు. అలాగే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గన్‌మెన్‌ను సస్పెండ్ చేయడంపై కొంతమంది ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తూ, ఎస్పీపై అనుచిత వాఖ్యలు చేస్తూ, రాజకీయ రగడకు దారితీసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి వ్యక్తిగత భద్రతను నిర్ధారించడమే గన్‌మెన్ ప్రధాన బాధ్యత అని, అలాగే మాజీ మంత్రి పెద్దిరెడ్డి అధికారిక ఫైళ్లతోపాటు కనీస అత్యవసర వస్తువులు తీసుకెళ్లడం సమంజసమన్నారు. అయితే మాజీ మంత్రి పెద్దిరెడ్డి భద్రతను పక్కన పెట్టి గన్‌మెన్ రెండు చేతులతో రిమాండ్‌లో వున్న ఖైదీకి అవసరమైన వస్తువులను మోసుకెళ్లడం విధుల్లో ఆలసత్వం ప్రదర్శించడంతోనే అతనిని సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.

ఎస్పీ బంగ్లాలో రెసిడెన్స్‌తో పాటు ఎస్‌బి ఆఫీసు, ఈగిల్ టాస్క్‌ఫోర్స్ ఆఫీసు, డాగ్ స్క్వాడ్, కమ్యూనికేషన్ ఆఫీసు, సోషల్ మీడియా సెల్, పాస్‌పోర్టు విచారణ కార్యాలయం తదితర విభాగాలు వున్నాయని, వీటిలో పలువురు పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారన్నారు. అలాగే ఎస్పీ బంగ్లాలో విధులు నిర్వర్తించడానికి ప్రభుత్వమే కానిస్టేబుల్, హోమ్ గార్డులతో పాటు సి కేటగిరి ఉద్యోగులైన వంటమనిషి, బార్బర్, దోభి, కార్పెంటర్, ఎలక్ట్రిషియన్, స్వీపర్, గార్డెనర్ వంటి సిబ్బందిని సైతం నియమించడం జరుగుతుందన్నారు. ఇది తెలుసుకోకుండా ఎస్పీ బంగ్లాలో విధులు నిర్వర్తించే సిబ్బందిపై ఏది పడితే అది వైఎస్సార్సీ నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడటం పద్ధతికాదన్నారు. అలాగే చిత్తూరు టుటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌పై కొంతమంది అనుచిత వాఖ్యలు చేశారని, చిత్తూరులో ఇటీవల రెండు వర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్న సందర్భంలో పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించారన్నారు. పోలీసు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య, ఎస్ఐ రమేష్‌లు >>2

## కడప స్టీలు ప్లాంట్‌కు ప్రభుత్వ ఆమోదం

### రూ. 4500 కోట్లతో తొలిదశ పనులు

**విజయవాడ,జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** కడప జిల్లా సున్నపురాళ్ల పల్లెలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ఫ్లాంట్ ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు జేఎస్‌డబ్ల్యూ ఎపి స్టీల్ లిమిటెడ్ ప్రతిపాదనలకు ఎపి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జేఎస్‌డబ్ల్యూ రాయలసీమ స్టీల్ ప్లాంట్ లిమిటెడ్‌కు ప్రోత్సాహకాలిస్తూ, ప్యాకేజీని విస్తరిస్తూ ఎపి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సంస్థకు ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ ప్రకారం ప్రోత్సాహకాలు ఇవ్వాలని తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్, జలవనరులు, పరిశ్రమలు, రెవెన్యూ, ఆర్థికశాఖ అధికారులని ప్రభుత్వం ఆదేశించింది. ఎపిఐఐసీ విసి అండ్ చైర్మన్, పరిశ్రమల శాఖ డైరెక్టర్‌కు ఎపి ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు పరిశ్ర >>2



## కొనసాగుతున్న వర్షాలు

**విజయవాడ,జూలై 27,ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో వివిధ ప్రాంతాల్లో సాధారణ స్థాయి నుంచి మోస్తరు వానలు పడుతున్నాయి, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరో వారం వరకు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర బంగాళాఖాతంలోని వాయుగుండం తీరం దాటినప్పటికి, మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 30-40 కి.మీ. వేగంతో >>2

## ఆపరేషన్ 'చిరుత'!

### అలిపిరి అటవీప్రాంతం పరిసరాల్లో మూడు అధునాతన బోన్లు ,15 సిసి కెమేరాలతో కదలికలపై నిఘా



చిరుతలను పట్టుకోవడానికి ఏర్పాటు చేస్తున్న బోన్లు

**తిరుపతి,జూలై 27, ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలం అటవీప్రాంతం విస్తరించిన తిరుపతిలోని అలిపిరి నడకమార్గానికి ఆనుకునే ఉన్న చెర్లోపల్లి బైపాస్‌మార్గం, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాల మార్గాల్లో చిరుతపులుల పట్టివేతకు అధునాతన బోన్లు ఏర్పాటయ్యాయి. అటవీశాఖ అధికారులు శనివారంరాత్రి అలిపిరి-జూపార్కుమార్గంలో అరవింద్ కంటి >>2

## సిఎం చంద్రబాబుతో 'సుర్బానా జురాంగ్' సిఇఒ భేటీ

**విజయవాడ, జూలై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్టు గ్లోబల్ అర్బన్ ఇన్ఫ్రా కంపెనీ సుర్బానా జురాంగ్ స్పష్టం చేసింది. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆ సంస్థ ప్రతినిధి చెర్‌ఎక్లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో గృహ నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు ముందుకు రావాలని సిఎం సుర్బానా సంస్థను ఆహ్వానించారు. ఎపిలో హౌసింగ్ ఫర్ ఆల్ ప్రాజెక్టులో భాగం కావాలని సిఎం సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతుల ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించామని ముఖ్యమంత్రి ఆ సంస్థ ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 20 పోర్టులు, 15 ఎయిర్ పోర్టులు అందుబాటులోకి వస్తున్నాయని.. లాజిస్టిక్ హబ్‌గా ఎపి తయారవుతుందని సిఎం చంద్రబాబు తెలిపారు. ఈ ప్రాంతాలను ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌లుగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ ఆలోచనలను వారి ముందుంచారు. మలేషియాకు చెందిన >>2



ముంబయిలో ఆదివారం శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాకరేకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంఎంఎస్ చీఫ్ రాజ్‌థాకరే

## కొనసాగుతున్న వర్షాలు

>> ఈదురు గాలులు వీస్తాయని వాతారణ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతోపాటు భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని సూచించింది. ఏలూరు జిల్లాకు భారీ వర్షాల అలర్ట్ ఇచ్చారు వాతావరణశాఖ అధికారులు. దీంతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి.. విశాఖ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. మరోవైపు గోదావరికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. లోతట్టు ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వాహణ అధికారులు హెచ్చరించారు. ఏలూరు జిల్లాలో కూడా భారీ వర్షాలకు అవకాశం ఉండగా... ఆంధ్రాలోని ఇతర జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించారు. ఈదురుగాలులతో పాటు భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఏపీకి వాయు గుండం ప్రభావం తప్పినప్పటికీ.. పలు జిల్లాల్లో వారం రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఏలూరు జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ కొనసాగుతోంది. ఈ క్రమంలోనే.. ఏలూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే చాన్స్ ఉంది. మిగతా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ముఖ్యంగా.. ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు.. కోస్తాంధ్రలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆయా జిల్లాల్లో 40నుంచి 50కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

## రూ.1052 కోట్లు

>> ఏరియాను కేటాయించారు. తాజాగా పిలిచిన టెండర్ల ప్రకారం రోడ్లు, డ్రైనేజి నిర్మాణం, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, వాటర్ లైన్, మొక్కల పెంపకం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ఈ పనులను రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. నేటి నుంచి టెండర్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం అవుతంది. టెండర్లు దాఖలు చేసేందుకు ఆగస్టు 12 చివరి గడువు. అదే రోజున టెక్నికల్ బిడ్‌ను కూడ ఓపెన్ చేస్తారు. పనులను చేజిక్కించుకునే గుత్తేదారు నిర్మాణం పనులకు రెండేళ్ల వరకు బాధ్యత వహించడంతో పాటు ఏడేళ్ల పాటు నిర్వహణ పనులను కూడ చేపట్టాల్సి ఉంటుందని టెండర్ షరతుల్లో సిఆర్‌డిఎ పేర్కొంది.

## నిందితుడు అదృశ్యం

>> తున్నారు. సతీష్ స్థానికంగా ఓ బాలికను ప్రేమించాడు. తల్లి దండ్రులు లేని బాలిక మేనత్త వద్ద ఉంటోంది. సతీష్ ప్రేమ వ్యవహారం తెలిసిన బాలిక మేనత్త, ఈ నెల 20వ తేదీన పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు సతీష్‌ను, అతడి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించారు. దీంతో అతడి ప్రేమ విషయం ఇంట్లో తెలిసిపోయింది. పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చిపంపారు. దీనిపై కుటుంబ సభ్యులు సతీష్‌ను మందలించారు. అప్పటి నుంచి అతడు కనిపించడంలేదు. ఇంట్లోనే ఫోన్ వదిలిపెట్టి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో అజిత్‌సింగ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఖమ్మంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లాడేమోనని అక్కడ గాలించినా సతీష్ ఆచూకీ లభించలేదు. పోలీసులు అతడి కోసం పది మంది సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సతీష్ అదృశ్యమైన విషయం ఇప్పుడు అనేక అనుమానాలకు దారి తీస్తోంది.

## ప్రభుత్వ ఆమోదం

>> మలు వాణిజ్య శాఖ కార్యదర్శి వై.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. రూ.4,500 కోట్ల పెట్టుబడితో స్టీల్ ప్లాంట్ మొదటిదశ, రూ.16350 కోట్లతో రెండో దశ పనులు చేపట్టే ప్రతిపాదనలకు ఎపి ప్రభుత్వం ఆమోదించింది. విద్యుత్, నీటి కేటాయింపులు, మౌలిక సదుపాయాల కల్పన చర్యలకి ఆమోదించింది. సున్నపురాళ్ల పల్లె పరిధిలో ఎకరా రూ. 5 లక్షల చొప్పున 1100 ఎకరాల భూములని కేటాయిస్తూ ఆదేశాలు జారీచేసింది. జనవరి 2026 నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పనులు ప్రారంభించాలని నిర్దేశించింది ఎపి ప్రభుత్వం. ఏప్రిల్ 2029 నాటికి స్టీల్‌ప్లాంట్ తొలిదశ పనులు పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్య నిర్దేశన చేసింది.జనవరి 2031 నాటికి స్టీల్ ప్లాంట్ రెండో దశ పనులు ప్రారంభిస్తామని ప్రతిపాదనల్లో తెలిపింది జేఎస్‌డబ్ల్యూ ఎపి స్టీల్ లిమిటెడ్ సంస్థ. ఏప్రిల్ 2034 నాటికి స్టీల్ ప్లాంట్ రెండో దశ పనులు పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభిస్తామని జెఎస్‌డబ్ల్యూ సంస్థ ప్రతిపాదించింది. ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఇచ్చిన ప్రతిపాదలనలను ఆమోదిస్తూ ఆదేశాలిచ్చింది ఎపి ప్రభుత్వం. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు సంస్థకు ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ పాలసీ ప్రకారం ప్రోత్సాహకాలు ఇవ్వాలని తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్, జలవనరులు, పరిశ్రమలు, రెవెన్యూ, ఆర్థికశాఖ అధికారులని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్లాంట్ కోసం సంస్థకు ఎకరా రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం సున్నపురాళ్లపల్లెలో 1,100 ఎకరాలు కేటాయించింది. 2026 జనవరి నాటికి తొలి దశ పనులు ప్రారంభించి, ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

# సింగపూర్ తరహాలో 'అమరావతి'

>> సిఇఒగా సత్య నాదెళ్ల ఎదిగారంటే అది ఆయన చూపిన చొరవ కారణమన్నారు. అమెరికా ప్రజల తలసరి ఆదాయం రూ.71,000లుగా ఉందని భారత ప్రజల తలసరి ఆదాయం రూ.1.51 లక్షలుగా ఉందన్నారు.ప్రపంచానికి సేవలందించే అవకాశం నాలెడ్జ్ ఎకానమీలో ఉంది.టీడీపీకి అనుబంధ సంస్థ ఎన్ఆర్ఐ ఉంది. తటస్థంగా ప్రభుత్వ వ్యవస్థగా ఎన్ఆర్‌టీని తీసుకువచ్చాం. నాన్ రెసిడెంట్ తెలుగు ప్రజల కోసం ఎన్ఆర్‌టీ తీసుకొచ్చాం. ప్రపంచానికి గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతి చేసే అవకాశాలు భారత్‌కు ఉంటాయి. అందులో ఏపీకి ఎక్కువ అవకాశాలున్నాయి. క్వాంటం వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రమోట్ చేస్తున్నా. రాష్ట్రంలో 20 పోర్టులు, మరో 15 విమానాశ్రయాలు వస్తాయి. దేశానికి లాజిస్టిక్స్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారుతుంది. 2019లో టీడీపీ అధికారంలో వచ్చిఉంటే అమరావతి, పోలవరం పూర్తయ్యేది. రాబోయే రోజుల్లో ఇలాంటి పొరపాటులు రాకుండా చూసుకోవాలిఖి అని చంద్రబాబు తెలిపారు. పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవేలు, హార్బర్లు, భూముల లభ్యత, కనెక్టివిటీ, 1053 కి.మీ తీర ప్రాంతం, నిపుణులైన మానవ వనరులు గురించి వివరించనున్నారు. పారిశ్రామిక వేత్తలను పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరతున్నా అన్నారు..సింగపూర్‌లో వేలాది తెలుగు ప్రజలు ఉండేందుకు నాటి ఆలోచనలే కారణం. ప్రపంచంలో 120కి పైగా దేశాల్లో తెలుగు ప్రజలు ఉన్నారు. ఒక వ్యక్తి ఫౌండేషన్ ద్వారా సింగపూర్ గౌరవప్రదమైన దేశంగా ఎదిగింది. సింగపూర్‌లో 40,000ల మంది తెలుగు ప్రజలున్నారంటే గర్వంగా ఉంది. దాదాపు 40- 50 లక్షల మంది తెలుగువారు వివిధ దేశాల్లో ఉన్నారు. ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చా. సింగపూర్ దేశం అంటే నాకు చాలా అభిమానం.. గౌరవం. నీతి, నిజాయితీలకు సింగపూర్ దేశం నిలువెత్తు నిదర్శనం. ఈ దేశంలో అవినీతి తక్కువ. సింగపూర్ రోడ్ల మీద ఒక్క కాగితం ముక్క కూడా కన్పించదు. చాలా కాలం క్రితమే చెత్తను కూడా ఎనర్జీగా కన్వర్ట్ చేసే విధానాన్ని సింగపూర్ ఆచరణలో పెట్టింది. అదే తరహా విధానాన్ని హైదరాబాద్ నగరంలో అమలు చేశాను. చాలా మంది రాజకీయ నేతలు సింగపూర్ వచ్చి ఎంజాయ్ చేసి వెళ్తారు.. కానీ ఏపీ సీఎం మాత్రం ఇక్కడికి వచ్చి తాను చేసిన మంచి పనులను అమలు చేస్తున్నారని సింగపూర్ దేశ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ చెప్పారు. ఇలాంటి సింగపూర్ ప్రభుత్వంతో ఏపీకి గ్యాప్ వచ్చింది. నేను అడిగిన వెంటనే ఉచితంగా అమరావతి కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేయడానికి సింగపూర్ ప్రభుత్వం అంగీకరించింది. సింగపూర్ ప్రభుత్వం చాలా దేశాల్లో టౌన్ షిప్ లు కట్టింది. కాబట్టి సీడ్ క్యాపిటల్ నిర్మాణం సింగపూర్ ప్రభుత్వానికే అప్పగించాను. కానీ 2019లో ప్రభుత్వం మారి సింగపూర్ ను తప్పు పట్టే పరిస్థితి తీసుకువచ్చారు. వాటిని సరిదిద్ది.. రికార్డులు సరి చేయడానికే సింగపూర్ వచ్చాను. ఏపీ బ్రాండును సింగపూర్ లో తిరిగి నెలకొల్పడానికే వచ్చాను.

**పి4కు సహకరించండి...పెట్టుబడులతో రండి..**

గతంతో పోల్చుకుంటే ఇప్పుడు సాంకేతికంగా చాలా అంశాలు అందుబాటులోకి వచ్చాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీని అభివృద్ధి చేస్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రకటించాం. సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. పోర్టులు ఎక్కువగా నిర్మించుకోవచ్చు. పోర్టు ఆధారిత పరిశ్రమలు పెద్ద ఎత్తున నెలకొల్పవచ్చు. ఏపీలో 20 పోర్టులు వస్తాయి..1520 ఎయిర్ పోర్టులకు అవకాశం ఉంది. అద్భుత అభివృద్ధికి ఆస్కారం ఉంది. భారత దేశానికే లాజిస్టిక్స్ హబ్ గా ఆంధ్రప్రదేశ్ ఉంటుంది. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్, టాటా సంస్థలతో కలిసి పని చేస్తున్నాం. చాలా మంది తెలుగు వాళ్లు విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. ఇలాంటి వారు తమ అనుభవాన్ని ఏపీకి అందించవచ్చు. పెట్టుబడులు పెట్టేలా ..సర్వీస్ ప్రొవైడర్లుగా ఉండొచ్చు.. మీరు ఏం చేయాలనుకున్నా.. పూర్తిగా సహకరించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉంటుంది.

ఎపిలో వెంకన్న ఉండడం మన అదృష్టం..బాలాజీ మన రాష్ట్రంలో ఉండడం అదృష్టం. ఎన్ని కష్టాలున్నా.. వేంకటేశ్వరస్వామిని తలుచుకుని సంకల్పం తీసుకుంటే సమస్య పరిష్కారమై పని అయిపోతుంది. ఎన్నార్టీలకు తిరుమల వెంకన్న దర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉండాలి. సింగపూర్ నుంచి ఏపీలోని విజయవాడ, విశాఖ, తిరుపతికి నేరుగా విమానాలు వచ్చేలా చేస్తాం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాం. సింగపూర్ లో బెంగాలీ, హిందీ, తమిళ్ రెండో భాషగా ఉన్నాయి. తెలుగు కూడా రెండో భాషగా పెట్టాలని కోరుతున్నాను. ఇక్కడే ఉన్న భారత హైకమిషనర్ ఈ మేరకు చొరవ తీసుకోవాలని కోరుతున్నాను." అని చంద్రబాబు చెప్పారు.

# సింగపూర్ కంపెనీలు ఆసక్తి

>> సీమలో డిఫెన్సు, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సంస్థలు ఏర్పాటు చేసేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. సింగపూర్ నుంచి భారత్‌కు పెట్టుబడులు రావాలని దీనికి ఏపీ గేట్ వేగా ఉంటుందని ముఖ్యమంత్రి తెలియజేశారు. ఏపీలో పెట్టుబడులకు అవసరమైన సహకారాన్ని అందించాలని సీఎం చంద్రబాబు కోరారు. మరోవైపు సింగపూర్‌లో 83 శాతం మేర పబ్లిక్ హౌసింగ్ ప్రాజెక్టులు ఉన్నాయని భారత హై కమిషనర్ వివరించారు. దీనిపై ఏపీలో చేపడుతున్న హౌసింగ్ ప్రాజెక్టుల గురించి మంత్రి నారాయణ వివరించారు. అలాగే విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, భవిష్యత్ ఆలోచనల్ని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ భారత హై కమిషనర్‌కు వివరించారు. ఏపీలో ఇప్పటికే ఏర్పాటు అవుతున్న ప్రముఖ విద్యా సంస్థల గురించి తెలిపిన మంత్రి ఏపీకి త్వరలో తరలివచ్చే ప్రతిష్టాత్మక విద్యా సంస్థల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

**ఎపి టెక్ నిపుణులకు ప్రత్యేక డిమాండ్..**

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టెక్ నిపుణులకు ఆగ్నేయాసియాలో ప్రత్యేకించి సింగపూర్‌లో డిమాండ్ ఉందని భారత హై కమిషనర్ సీఎంకు వివరించారు. అమెరికా తరహాలోనే ఆగ్నేసియాలోని సింగపూర్ లాంటి దేశాల విద్యార్థుల్ని, టెక్ నిపుణుల్ని ఆకర్షిస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ అంశంపై సింగపూర్‌లోని భారత రాయబార కార్యాలయం ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని ముఖ్యమంత్రికి తెలియచేశారు. సింగపూర్ నుంచి ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాల గురించి ఆయన వివరించారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్ల ఉత్పత్తి, షిప్ బిల్డింగ్, పోర్టు కార్యకలాపాల నిర్వహణ, డేటా సెంటర్ల ఏర్పాటు, ఫార్మా తదితర రంగాల్లో సింగపూర్ కంపెనీలు ఎపిలో పెట్టుబడి పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయని సిఎంకు వివరించారు. సింగపూర్ కేంద్రంగా పనిచేస్తున్న ఆసియా పసిఫిక్ దిగ్గజ కంపెనీలు ఎస్టీటీ, కెప్పెల్, కాపిటాల్యాండ్, ఈక్వినిక్స్, పిఎస్ఎ తదితర సంస్థల విస్తరణకు అవకాశాలు ఉన్నట్టు వెల్లడించారు. ఏఐ, స్టార్టప్‌లు, వైద్య పరికరాల రంగంలో పరిశోధన, ఏపీ, సింగపూర్ యూనివర్సిటీల మధ్య భాగస్వామ్యం కుదుర్చుకునే అంశంపైనా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టీజీ భరత్ సహా ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# గొప్ప దార్శనికుడు ఎపిజె అబ్దుల్‌కలాం

## వర్ధంతిరోజున ప్రధానిమోడీ నివాళులు

**న్యూఢిల్లీ,జూలై 27:** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కలాం ఒక స్ఫూర్తిదాయక దార్శనికుడని, గొప్ప శాస్త్రవేత్త అని, ఆదర్శవంతమైన దేశభక్తుడని ప్రధాని కొనియాడారు. దేశ యువతకు ఆయన ఆలోచనలు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. ఆదివారం కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని మోడీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా స్పందించారు. మన ప్రియతమ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఆయన వర్ధంతి నాడు నివాళులర్పిస్తున్నాను. దేశం పట్ల ఆయనకున్న అంకితభావం ఆదర్శప్రాయం. అభివృద్ధి చెందిన, బలమైన భారత్‌ను నిర్మించేందుకు ఆయన ఆలోచనలు దేశంలోని యువతను ప్రేరేపిస్తాయని మోడీ తన పోస్ట్‌లో రాశారు. రాష్ట్రపతి కాకముందే రాష్ట్ర రత్నగా ప్రజల మన్ననలు పొందిన అరుదైన వ్యక్తి కలాం అని గతంలో మోడీ ప్రశంసించిన విషయం తెలిసిందే. భారతదేశ 11వ రాష్ట్రపతిగా 2002 నుంచి 2007 వరకు సేవలందించిన డాక్టర్ కలాం, నిరాడంబర జీవితం, నిష్పక్షపాత వైఖరితో ప్రజలందరి గౌరవాన్ని పొందారు. మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన ఆయన, దేశ రక్షణ వ్యవస్థ బలోపేతానికి విశేష కృషి చేశారు.

ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నేతృత్వం వహించి అగ్ని, పృథ్వీ వంటి శక్తివంతమైన క్షిపణుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. 1998లో జరిగిన పోఖ్రాన్ అణు పరీక్షల్లోనూ ఆయన ముఖ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. కలాం వర్ధంతి సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా నివాళులర్పించారు. కలాం జీవితం అద్భుతమైన పోరాటానికి, విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత్‌ను అణుశక్తిగా నిలపడంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని నడ్డా అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ, కలాం జీవితంలోని నిరాడంబరత, దేశభక్తి యావత్ దేశానికే ప్రేరణ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు శాస్త్ర, విద్యా రంగాలకు ఎప్పటికీ వెలుగునిస్తాయని తెలిపారు. ప్రజల రాష్ట్రపతిగా గుర్తింపు పొందిన డాక్టర్ కలాం, యువతకు, విద్యార్థులకు స్ఫూర్తినివ్వడాన్ని ఎంతగానో ఇష్టపడేవారు. 2015 జులై 27న షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా గుండెపోటుతో కుప్పకూలి తుదిశ్వాస విడిచారు.

### వారం - వర్జ్యం

28-07-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చవితి రా.11.28
పూర్వఫల్గుణి సా.5.39
వర్జ్యం : రా.1.25-3.08
దు.ము.12.40-1.32, ము.3.15-4.07
శుభసమయం:ఉ.9.15-9.50, సా.6.30-7.15
రాహుకాలం - ఉ.7.30-9.00

### వార్తాఫలం

**మేషం :** సన్నిహితుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు. విందు, వినోదాలలో చురుకుగా పాల్గొంటారు.

**వృషభం:** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకొంటారు. ఇంతకాలం పడ్డ శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది.

**మిథునం:** నూతన ప్రయత్నాలు అనుకూలించి ముందుకు సాగుతారు. బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు.

**కర్కాటకం:** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

**సింహం:** అకారణంగా వివాదాలు ఏర్పడ వచ్చు, జాగ్రత్తగా వుండండి. షేర్లు, క్రయ విక్రయాలలో స్వల్పంగా లాభాలు పొందుతారు.

**కన్య :** వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి. పారిశ్రామిక, సాంకేతిక రంగాల వారికి అన్ని విధాలుగా అనుకూలంగా వుండును.

**తుల :** ఇంటా బయటా అనుకూల స్థితి ఏర్పడుతుంది. ఓర్పు, నేర్పులతో దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు.

**వృశ్చికం:** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకొంటారు. సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెరుగుతుంది.

**ధనుస్సు:** కొత్తమిత్రులు పరిచయమై నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సోదరుల కలయిక.

**మకరం:** ఆర్థికలావాదేవీలు సంతృప్తి కరంగా సాగుతాయి. రుణబాధల నుండి విముక్తి పొందుతారు.

**కుంభం:** ఇంటా బయటా అనుకూలంగా వుండును. అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి.

**మీనం :** విలువైన వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. అరుదైన ఆహ్వానాలు అందుకొంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



ఆదివారం సిఎం చంద్రబాబుకు మంగళహారతులు పడుతున్న సింగపూర్‌లో స్థిరపడిన తెలుగుమహిళలు

# సింగపూర్‌లో సిఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

**విజయవాడ, జూలై 27:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం ఉదయం సింగపూర్ చేరుకున్నారు. ఇవాళ్టి నుంచి ఐదు రోజుల పాటు సీఎం సింగపూర్ లో పర్యటించనున్నారు. సింగపూర్ కు చేరుకున్న సీఎంకు స్థానిక తెలుగు ప్రజలు, పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, ఏపీఎన్ఆర్టీ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి తాను బసచేసే హోటల్ కు చేరుకున్న ముఖ్యమంత్రి, మంత్రుల బృందానికి స్థానిక తెలుగు కుటుంబాలకు చెందిన వారు స్వాగతం పలికారు. సీఎంకు స్వాగతం పలికేందుకు సంప్రదాయ వస్త్రధారణలో తెలుగు కుటుంబాలకు చెందిన మహిళలు తరలి వచ్చారు.. హారతులు పట్టారు. చిన్నారులు కూచిపూడి నృత్యాలతో స్వాగతించారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఆయన బస చేస్తున్న హోటల్ ప్రాంగణంలో తెలుగు కుటుంబాల సందడి నెలకొంది. సింగపూర్ పర్యటనలో భాగంగా మొత్తం 29 కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇవాళ మధ్యాహ్నం తెలుగు డయాస్పోరా సమావేశానికి ముఖ్యమంత్రి, మంత్రులు నారా లోకేష్, పి.నారాయణ, టీజీ భరత్‌లు హాజరు కానున్నారు.

# అనకాపల్లి వైద్యులపై మంత్రి సీరియస్

>> డైట్ చార్ట్‌ను ప్రదర్శించకపోవడం, మందుల సరఫరా మరియు వినియోగం వివరాల్ని సరిగా చూపకపోవడం, తమ విధుల్ని సరిగా నిర్వహించకపోవడం వంటి లోపాల కారణంగా వీరిపై చర్యలు చేపట్టాలని ఎసిబి అధికారులు తమ నివేదికలో సూచించారు. ఈ నివేదికలో వెల్లడైన అప్పటి పరిస్థితిపై వెంటనే విచారణ చేపట్టాలని, ఆ మేరకు తగు క్రమశిక్షణా చర్యలు చేపట్టి వారిని తగు విధంగా శిక్షించాలని మంత్రి ఆదేశించారు. దీంతో పాటు రూ.74,000 మేరకు వాహన ఇంధనం వినియోగంలో తప్పుడు లెక్కలు చూపిన డ్రైవరు, డ్రెస్సింగ్ పనులు చేసిన కాంట్రాక్టు శానిటేషన్ వర్కర్‌పై కూడా తగు క్రమశిక్షణా చర్యల్ని చేపట్టాలని మంత్రి ఆదేశించారు.మంత్రిగా బాధ్యతల్ని చేపట్టిన అనతికాలంలోనే ప్రభుత్వాసుపత్రుల్లో నెలకొన్న పరిస్థితుల్ని గమనించి ఆందోళన చెందిన మంత్రి సత్యకుమార్ యాదవ్ మార్పుకోసం ప్రయత్నాలు మెదలుపెట్టారు. వైద్య సిబ్బంది హాజరు, రోజువారీ ఒపి, ఐపి సేవల నిర్వహణ, అవినీతిని అరికట్టడానికి చేపట్టాల్సిన చర్యలు మొదలైన వాటిపై తరచూ సమీక్షలు జరిపి ఉన్నతాధికారులకు తగు ఆదేశాలిస్తున్నారు. ఫలితంగా వైద్యుల హాజరు, వివిధ సేవల నిర్వహణ, డయాగ్నాస్టిక్ పరీక్షలు, పడకల వినియోగం వంటి విషయాల్లో స్పష్టమైన మార్పు కన్పించింది.

క్షేత్ర స్థాయిలో వివిధ ఆరోగ్య పథకాల అమలు, వైద్య సిబ్బంది పనితీరు పర్యవేక్షణ వంటి విషయాల్లో జిల్లా స్థాయి అధికారులైన డిఎంహెచ్‌ఓలు మరియు డిసిహెచ్ఎస్ అధికారులనే బాధ్యుల్ని చేస్తామని, నిర్లక్ష్యం చేసేవారిపై చర్యల్ని తీసుకుంటామని వారితో ముఖాముఖిగా నిర్వహించిన సమావేశాల్లో మంత్రి స్పష్టం చేశారు. ఈ మేరకు గతేడాదిలో పనితీరు ఆధారంగా పలువురు జిల్లా స్థాయి వైద్యాధికారుల నియామకాలు చేశారు. సరిగా పనిచేయని వారిని తొలగించి స్పష్టమైన సందేశాన్నిచ్చారు. అక్రమాల్ని అరికట్టే దిశగా ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఆఫీస్ సూపరింటెండెంట్లు, అకౌంటెంట్లు వంటి వారిని వేరేకార్యాలయాలకు బదలీలుచేశారు. ఉన్నత స్థాయిలో పలుఆసుపత్రుల సూపరిం టెండెంట్లు, వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లను కూడా ప్రతిభ ఆధారంగా మార్చడం, నియమించడం జరిగింది. గత ప్రభుత్వ హయాంలోని పరిస్థితిని వెల్లడిస్తూ ఎసిబి ఇచ్చిన నివేదిక నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రుల్లో మార్పు తెచ్చేందుకు మరింత పటిష్టమైన చర్యల్ని చేపట్టాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

# నేడు కార్పొరేట్ సిఇఒలతో బాబు భేటీ

**విజయవాడ జూలై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఐదు రోజుల పర్యటన కోసం సింగపూర్ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం రెండోరోజు పర్యటనలో సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో సహా... పలు సంస్థల అధిపతులతో సమావేశం కానున్నారు. నగరాల అభివృద్ధి, క్రీడలు, పోర్ట్ ఆధారిత పరిశ్రమలపై వారితో చర్చిస్తారు. భారత కాలమాన ప్రకారం ఉదయం 7 గంటలకు ట్రెజరీ బిల్డింగ్‌లో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ టాన్ సీ లెంగ్‌తో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. విద్యుత్, సైన్స్ అండ్ టెక్నాలజీ, పారిశ్రామిక సహకారంపై చర్చిస్తారు. ఉదయం 8.30 గంటలకు ఎయిర్‌బస్ సంస్థ ప్రతినిధులు కృతీవాస్, వేంకట్ కట్కూరితోనూ... అలాగే ఉదయం 9 గంటలకు హనీవెల్ సంస్థ ప్రతినిధులతో సమావేశం కానున్నారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు జరిగే బిజినెస్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. నైపుణ్యాల నుంచి సామర్థ్యాల వైపు మరలడం, కార్మికశక్తిని వేగవంతం చేయడంఅనే అంశంపై చర్చిస్తారు. ఇందులో నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్, నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్శిటీ, సింగపూర్ మేనేజ్‌మెంట్ యూనివర్శిటీ, సింగపూర్ యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ డిజైన్ విద్యార్థులు పాల్గొంటారు. 11 గంటలకు ఎవర్వోల్ట్ ఛైర్మన్ మిస్టర్ సైమన్ టాన్‌తో సమావేశం అవుతారు.

**అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం**

మధ్యాహ్నం 11.30కు సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో క్రీడల అభివృద్ధి ప్రణాళికలు అనుసంధానించే అంశంపై దృష్టి పెడతారు. మధ్యాహ్నం 1 గంటకు టుయాస్ పోర్ట్ సైట్‌లో పర్యటిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో పోర్ట్ ఆధారిత పారిశ్రామిక అభివృద్ధి, స్మార్ట్ లాజిస్టిక్స్, భారీగా తయారీ, ఎగుమతి మౌలిక సదుపాయాలపై పిఎస్ఎ సిఇఒ విన్సెంట్ ఆధ్వర్యంలో జరిగే ప్రత్యేక చర్చలో పాల్గొంటారు. సాయంత్రం 4.30గంటలకు ఎపి-సింగపూర్ బిజినెస్ ఫోరం నిర్వహించే రోడ్ షోకు హాజరవుతారు. సింగపూర్, అంతర్జాతీయ పెట్టుబడిదారులసమక్షంలో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలపై ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సాయంత్రం 6 గంటలకు అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీతో ప్రత్యేక సమావేశం జరగనుంది. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి, పెట్టుబడులపై ఇరువురు చర్చిస్తారు.

# 'సుర్బానా జురాంగ్' సిఇఒ భేటీ

>> ప్రముఖ నిర్మాణ సంస్థ ఎవర్సెండై కార్పొరేషన్ భెర్హాద్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తాన్‌శ్రీ ఏ.కె. నాథన్ ముఖ్య మంత్రితో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక ఫాబ్రికేషన్ ఫ్యాక్టరీతో పాటు ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు అంశంపై ఇరువురి మధ్యా చర్చ జరిగింది. ఈ ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీని విశాఖ లేదా కృష్ణపట్నంలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ఎవర్సెండై ఛైర్మన్ వివరించారు. దాదాపు 2 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు ఎవర్సెండై ప్రతిపాదించింది. ఈ కొత్త ఫ్యాక్టరీను వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతంలో ఏర్పాటు చేసి దేశమంతటా ఫ్యాబ్రికేషన్ ఉపకరణాలను రవాణా చేసేందుకు వీలుగా ఎవర్సెండై ఆలోచన చేస్తోంది. ప్రతిపా దిత పెట్టుబడి ద్వారా రాష్ట్రానికి పరిశ్రమల్లో వృద్ధి, ఉద్యోగావకాశాలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉంది. అటు అమరావతి రాజధాని నిర్మాణంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టు ల్లోనూ భాగస్వామ్యం అవుతామని ఎవర్సెండై ఆసక్తిని తెలిపింది. అలాగే రాష్ట్రంలోని ఐఐటి తిరుపతి, ఐఐటీ శ్రీ సిటీ వంటి సంస్థలతో కలిసి స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ సెంటర్ స్థాపనపైనా ఎవర్సెండై ఛైర్మన్ ముఖ్యమంత్రితో చర్చించారు. గతంలో బుర్జ్ ఖలీఫా, పెట్రోనాస్ టవర్ సహా చెన్నైలోని డిఎల్ఎఫ్ డౌన్ టౌన్ తారామణి ప్రాజెక్టు, గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ఫ్యాబ్రికేషన్ పనుల్లోనూ పాల్గొన్నట్టు ఎవర్సెండై వివరించింది.

# రౌడీషీటు వ్యాఖ్యలా?

>> న్యాయబద్ధంగా విధులు నిర్వర్తించి శాంతిభద్రతలను కాపాడటానికి నిబద్ధతతో పని చేశారన్నారు. అయితే చిత్తూరు నియోజకవర్గ వైఎస్సార్సీ ఇన్‌చార్జ్ ఎంసి విజయానందరెడ్డి డ్యూటీలో వున్న పోలీసు అధికారులపై వ్యక్తిగత దూషణలు చేయడం, అశ్లీల వ్యాఖ్యలకు పాల్పడటం దురదృష్టమన్నారు. ఘర్షణ సమయంలో ఇన్స్‌పెక్టర్ విద్యుత్ సరఫరాను నిలిపివేశారని ఆరోపణలు చేశారని, అయితే విద్యుత్ అధికారులు ఘర్షణ సమయంలో ఆ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం లేదని స్పష్టం చేశారన్నారు. పోలీసులు రాజ్యాంగబద్ధంగా చట్టానికి లోబడి జరిగిన ఘటనలపై నిష్పక్షపాతంగా కేసులు నమోదు చేసి తగిన చట్టపరమైన చర్యలు తీసుకున్నారన్నారు. చిత్తూరు జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలా చట్టబద్ధంగా నిష్పక్షపాతంగా పనిచేస్తోందని, ఇలాంటి తప్పుడు ప్రకటనల ద్వారా పోలీసు వ్యవస్థ మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తించవద్దని నాయకులకు వారు తెలిపారు. పోలీసు వ్యవస్థ ప్రతిష్టను దిగజార్చే తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని వారు వైకాపా నాయకులను కోరారు.

# ఆపరేషన్ 'చిరుత'!

>> ఆస్పత్రి సమీపంలోని అడవిలో ఒకటి, శ్రీవేంకటేశ్వరవిశ్వవిద్యాలయానికి చేరువగా ఉన్న అటవీప్రాంతంలో రెండు బోన్లు ఏర్పాటు చేశారు. ఈ బోన్లతో బాటు చిరుతపులుల కదలికలపై గమనిస్తూ పట్టుకోవడానికి 15 సిసిట్రాఫ్ కెమెరాలను కూడా అమర్చారు. గత నెలరోజుల క్రిందట సైన్స్‌సెంటర్ సమీపంలో విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికెళుతున్న టిటిడి ఉద్యోగి రవికుమార్‌పై చిరుతపులి దాడిచేయడం,తప్పించుకుని గాయాలతో ప్రాణాలతో బయటపడిన విషయంవిదితమే. ఆ తరువాత వారంరోజుల క్రిందట చిరుతపులి అరవింద్ కంటి ఆస్పత్రి సమీపంలో కల్వర్టుపై మాటువేసి కూర్చుని వుండటాన్ని వాహనదారులు గమనించారు. రెండురోజుల క్రిందట టాటాక్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో చిరుతపులి రాత్రివేళ ఓ ద్విచక్రవాహన దారుడిపై దాడిచేసి గాయపరిచే యత్నం చేసింది. వెనుకనే వచ్చిన కారు లైటింగ్, శబ్ధానికి చిరుత పరారైంది. తరచూ అలిపిరి అడవికి సమీపంలోని స్విమ్స్ ఆస్పత్రి వెనుకవైపు, ఎస్వీయూనివర్సిటీ హాస్టల్స్‌ప్రాంతాల్లో చిరుతపులి సంచరించి కుక్కను చంపి తిన్న విషయం విదితమే. అటు యూనివర్సిటీ విద్యార్థులు, ఇటు బైపాస్‌మార్గంలో వాహనదారులు చిరుతపులుల భయానికి వణికిపోతున్నారు. అయితే జూలై నుండి సెప్టెంబర్ వరకు చిరుతపులులు సంతానోత్పత్తి జరిపే కాలమని, దీంతో చిరుతలు అనుకూలమైన వాతావరణం కోసం వెదుకులాటలో ఇలా దారితప్పి వస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలు కూడా జాగ్రత్తగా వెళ్లాలని ,తగిన అప్రమత్తత అవసరమని హెచ్చరిస్తున్నారు. కాలినడక మార్గాల్లోనేగాక అలిపిరి బైపాస్‌లో చిరుతలు సంచరిస్తూ ద్విచక్రవాహనదారులపై దాడిచేస్తుండటంతో .చిరుతను బంధించడానికి అటవీశాఖ చర్యలు చేపట్టింది. ఆపరేషన్ చిరుత పేరుతో సంచరించే ప్రాంతాలను గుర్తించిన అటవీశాఖ వర్గాలు బోను ఏర్పాటుచేశారు. అలిపిరి నుండి చెర్లోపల్లికి వెళ్లే మార్గంలో విద్యాసంస్థలు, ఆస్పత్రులు ఉండటంతో వ్యర్థాలు పడేస్తుండటంతో వాటికోసం చిరుత సంచారం ఉందని అధికారులు కనుగొన్నారు. చిరుతసంచరించిన సమీప ప్రాంతాల్లో పాదముద్రలను గమనించారు. ఈ ప్రాంతంలో మూడు వరకు చిరుతపులులు సంచారం ఉందని పాదముద్రల ఆధారంగా గుర్తించారు. చిరుతపులి కదలికలపై ట్రాఫ్ కెమెరాలుకూడా ఏర్పాటుచేశారు. మొత్తంమీద చిరుత బంధిస్తే జూకు తరలించడమే శరణ్యమని జనం చెబుతున్నారు. తిరుపతి -అలిపిరి సమీప ప్రాంతాలు దట్టమైన శేషాచలం కొండలకు ఆనుకుని ఉండటంతో చిరుత పులులు, ఏనుగులు సంచారం ఉంటుందని అటవీవర్గాల సమాచారం. ఇప్పటికే అలిపిరి నడకమార్గంలో గాలిగోపురంవద్దనుంచి ఏడవమైలు మీదుగా లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వరకు మెట్లమార్గంలో వందమంది వరకు భక్తులను గుంపుగా పూర్తి రక్షణవలయంలో కొండకు పంపు తున్నారు. శేషాచలంలో పలు మార్గాల్లో భక్తులను భయపెడుతున్న చిరుతలు పట్టివేతకు అటవీశాఖ అధికారులు బోనులు తెప్పించి ఏర్పాటుచేయడంతో అవి పట్టుబడే వరకు జనంలో ఆందోళన తప్పదు.

# ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా తెలుగువారే

## ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుంది: మానవ వనరుల మంత్రి నారా లోకేష్



**విజయవాడ,జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచంలో ఎక్కడ చూసినా తెలుగు వారున్నారంటే ఆ క్రెడిట్ చంద్రబాబుకే దక్కుతుందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. సింగపూర్‌లో ఆదివారం ఆయన తెలుగు డయాస్పోరా ప్రొగ్రామ్ సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచంలో తెలుగు ప్రజలు శాసించేందుకు చంద్రబాబు విజనరీ కారణమన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 30 లక్షల మంది తెలుగు ప్రజలు ఉన్నారని తెలిపారు. ఉపాధి కోసం ప్రపంచవ్యాప్తంగా మనవాళ్లు వెళ్లారని చెప్పారు. సింగపూర్‌లో తెలుగు ప్రజలు ఉన్నా ఆంధ్రపైనే మనసు ఉంటుందని లోకేశ్ వివరించారు. "ఏపీలో రాజకీయాలు, రాష్ట్ర పరిస్థితుల గురించి నా కంటే మీకే బాగా తెలుసు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో సైకో పాలన, విధ్వంస పాలన చూశాం. ఎన్నికల సమయంలో కొందరు దాదాపు 6 నెలలు ఆంధ్రప్రదేశ్ కి వచ్చి కష్టపడ్డారు. రాష్ట్రాన్ని దారిలో పెట్టేందుకు కష్టపడినందుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. గతంలో చంద్రబాబు అరెస్టైనప్పుడు ఇదంతా మనకు అవసరమా అని బ్రాహ్మణి అడిగింది. అదే సమయంలో హైదరాబాద్‌లో 45,000ల మంది ఐటీ నిపుణులు చంద్రబాబు వెంట ఉంటామని చెప్పారు. ఐటీ నిపుణులు అండగా నిలబడ్డారు. అదే మాకు కొండంత ధైర్యమని లోకేష్ పేర్కొన్నారు. తెలుగు జాతి అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలిచేందుకు ఆరోజే కష్టపడాలని నిర్ణయించుకున్నాను. దారి తప్పిన ఏపీని గాడిలో పెట్టేందుకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషిచేస్తున్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో సింగపూర్‌ను రోల్ మోడల్‌గా తీసుకుంటున్నాం. ఎప్పుడూ లేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో ముందుకెళ్తున్నాం. రాయలసీమకు పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకొస్తున్నాం. ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్‌గా నియమించుకున్నామని లోకేశ్ వివరించారు. దేశంలో తొలి క్వాంటం వ్యాలీని అమరావతికి తీసుకొచ్చాం. ఉభయగోదావరి జిల్లాల్లో పెద్దఎత్తున ఆక్వాను ప్రోత్సహిస్తున్నాం. ఉత్తరాంధ్రలో ఆర్సిలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంటును తీసుకొస్తున్నాం. గత ఐదేళ్లలో నష్టపోయిందంతా వడ్డీతో తిరిగి తీసుకురావాలనేది లక్ష్యమన్నారు. పీ4 కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతున్నా. ఎన్ఆర్ఐలే మా బ్రాండ్ అంబాసిడర్లు. ప్రపంచంలో 80 శాతం ఉద్యోగాలు ఎంఎస్ఎంఈల ద్వారానే వస్తున్నాయి. పరిశ్రమలకు ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు అందుబాటులో ఉంటుంది. ఆంధ్ర రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులకు ముందుకు రావాలి. పరిశ్రమలకు అండగా నిలబడే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని మంత్రి లోకేశ్ అన్నారు.

# ఎపిలో పెట్టుబడికి ఎవర్సెండై కార్పొరేషన్ ఆసక్తి

## సీఎం చంద్రబాబుతో ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తాన్‌శ్రీ ఏ.కె.నాథన్ భేటీ




**విజయవాడ,జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** మలేషియాకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ ఎవర్సెండై కార్పొరేషన్ భేర్హాద్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ తాన్‌శ్రీ ఏ. కె. నాథన్ ముఖ్యమంత్రితో సమావేశం అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అత్యాధునిక ఫాబ్రికేషన్ ఫ్యాక్టరీతో పాటు ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు అంశంపై ఇరువురి మధ్యా చర్చ జరిగింది. ఈ ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీని విశాఖ లేదా కృష్ణపట్నం లో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ఎవర్సెండై ఛైర్మన్ వివరించారు. దాదాపు 2 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఈ ఫ్యాబ్రికేషన్ యూనిట్ ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్టు ఎవర్సెండై ప్రతిపాదించింది. ఈ కొత్త ఫ్యాక్టరీను వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతంలో ఏర్పాటు చేసి దేశమంతటా ఫ్యాబ్రికేషన్ ఉపకరణాలను రవాణా చేసేందుకు వీలుగా ఎవర్సెండై ఆలోచన చేస్తోంది. ప్రతిపాదిత పెట్టుబడి ద్వారా రాష్ట్రానికి పరిశ్రమల్లో వృద్ధి,ఉద్యోగావకాశాలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశంఉంది. అటు అమరావతి రాజధాని నిర్మాణంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లోనూ భాగస్వామ్యం అవుతామని ఎవర్సెండై ఆసక్తిని తెలిపింది. అలాగే రాష్ట్రం లోని ఐఐటీ తిరుపతి, ఐఐఐటీ శ్రీ సిటీ వంటి సంస్థలతో కలిసి స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ సెంటర్ స్థాపనపైనా ఎవర్సెండై ఛైర్మన్ ముఖ్యమంత్రితో చర్చించారు. గతంలో బుర్జ్ ఖలీఫా, పెట్రొనాస్ టవర్ సహా చెన్నైలోని డీఎల్ఎఫ్ డౌన్ టౌన్ తారామణి ప్రాజెక్టు, గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ఫ్యాబ్రికేషన్ పనుల్లోనూ పాల్గొన్నట్టు ఎవర్సెండై వివరించింది.

# బాలాజీరిజర్వాయర్‌కు కృష్ణాజలాలు తీసుకువస్తాం

## శ్రీవారి ఆశీస్సులతో 25యేళ్ల చరిత్రలో శ్రీశైలం నుండి కృష్ణాజలాలు విడుదల: మంత్రి రామానాయుడు



**తిరుమల,జూలై27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కరుణాకటాక్షాలతో 25ఏళ్ల చరిత్రలో మొదటిసారి జూలైనెలలో శ్రీశైలంనుండి కృష్ణాజలాలు విడుదల చేశామని రాష్ట్రమంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శ్రీశైలం మల్లన్న చెంత నుండి కృష్ణాజలాలు తీసుకువచ్చి బాలాజీరిజర్వాయర్‌కు నింపుతామన్నారు. తిరుమలకు వచ్చే భక్తులకు తాగునీటి కోరత లేకుండా గోవిందుని చెంతకు తరలిస్తామన్నారు. హంద్రీనీవా ద్వారా 3,850 క్యూసెక్కుల కృష్ణాజలాలను అడవిపల్లి రిజర్వాయర్ నింపి, నీవా కాలువద్వారా భవిష్యత్‌లో తిరుపతికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు అందిస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలో అమరావతి, పోలవరం ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తయి. యువతకు లక్షలాది ఉద్యోగాలు వస్తాయన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని గోవిందుడిని వేడుకున్నానన్నారు. గోవిందుని ఆశీస్సులతో గత ఏడాది రాయలసీమలో రిజర్వాయర్లు అన్నీ నిండి ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని మంత్రి నిమ్మల తెలిపారు. ఏడుకొండల స్వామి దర్శనానికి వచ్చేలక్షలాదిమంది భక్తులకు అన్నదానంతోబాటు ఇతర అన్ని ఏర్పాట్లు సంతృప్తికరంగా చేస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. తిరుమల ఆధ్యాత్మికతను, పవిత్రతను కాపాడేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుం టోందని మంత్రి నిమ్మల తెలిపారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో కుటుంబసభ్యులతో కలసి తిరుమల ఆలయంలోనికి వచ్చిన మంత్రి నిమ్మల రామానాయుడుకి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసులు కుటుంబానికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి స్వాగతం పలి కారు. ఆలయం లోపల శ్రీవారి దర్శనం చేయిం చారు. అనంతరం స్వామివారి వేదాశీర్వచనం తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు మంత్రి నిమ్మల కుటుంబంతో కలసి కాలినడకన తిరుమలకు చేరుకున్నారు.

# మోడీ పాలనలో నాల్గవ ఆర్థిక శక్తిగా భారత్

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి,ఎన్.మాధవ్



**కడప కార్పొరేషన్, జూలై 27 ప్రభాతవార్త:** భారత ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలో భారతదేశం ప్రపంచంలోనే నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్.మాధవ్ అన్నారు. 2028 నాటికి, భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సారథ్యం రాష్ట్ర పర్యటనలో భాగంగా ఆదివారం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కడప జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఉదయం శివ శివాని స్కూల్ గ్రౌండ్ లో ఆసనాలు చేశారు. అనంతరం వాయుపుత్ర కేఫ్ లో కార్యకర్తలతో ఛాయ్ పే చర్చా కార్యక్రమంలో స్థానిక పరిస్థితులపై చర్చించారు. తొలి గడప దేవుని కడపలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శనం చేసుకొని సారథ్యం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. సహజ కవి యోగి వేమన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, శశు భూషణ్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, బీరం సుబ్బారెడ్డి, సింగారెడ్డి రామచంద్రారెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ బొమ్మన సుబ్బరాయుడు, కార్యకర్తలతో యోగి వేమన, వై జంక్షన్ నుంచి ఆదిత్య ఫంక్షన్ హాల్ వరకు కాలినడకన ర్యాలీగా వెళ్లారు. విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాల్సిన దిశగా నా ఆలోచనలు, ప్రణాళికలను కార్యకర్తలతో పంచుకుంటున్నట్లు చెప్పారు. 11 ఏళ్ల మోదీ పాలనలో దేశం భలే శక్తిగా ఎదిగిందని, అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. జాతీయ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. దేశ జిడిపి పెరుగుతుందన్నారు. భారతదేశానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తు లభించింది అన్నారు. దేశ సంస్కృతిని పరిరక్షిస్తుందని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంతో పాటుగా రాయలసీమ జిల్లాలకు కేంద్రం నిధులు విడుదల చేస్తుందని చెప్పారు. కొప్పర్తి పారిశ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించిందన్నారు. కడప ఎయిర్‌పోర్ట్ సుందరీకరణ, కడప రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. ప్రతి గ్రామానికి బిజెపి జెండా వెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీలో అందరికీ సమున్నత స్థానం లభిస్తుందని, సాధారణ కార్యకర్తను అయినా నన్ను రాష్ట్ర అధ్యక్షునిగా చేశారన్నారు. కార్యకర్తలు అందరికీ గుర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి, శశి భూషణ్ రెడ్డి, నాయకులు లంకా దినకర్, శ్రీనాథ్ రెడ్డి, సింగారెడ్డి రామచంద్రారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, చలపతి, బొమ్మన సుబ్బరాయుడు, బాలకృష్ణ యాదవ్, బీరం సుబ్బారెడ్డి, మునగ సతీష్, శాలివాహన, లక్ష్మణరావు, అమర్నాద్ రెడ్డి, పవన్ కుమార్, బొమ్మన విజయ్, సురేంద్ర, ప్రవీణ్, కళ్యాణ్, కృష్ణారెడ్డి, చాగలమర్రి ఓబులేసు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాంకు సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ,జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ అణు, శాస్త్రీయ రంగాలకు దిశానిర్దేశం చేసిన మహా మనిషి, మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఏపీజే అబ్దుల్ కలాంకు ఏపీ సీఎం చంద్రబాబు నివాళిని అర్పించారు. వర్ధంతి సందర్భంగా ఆయన మానవతా సేవలను గుండెల్లో నిలుపుకుందాం. ఆయన స్ఫూర్తితో యువతకు కలలు కనడం, వాటిని సాకారం చేసుకోవడం నేర్పిన గొప్ప దార్శనికుడు. సాంకేతికత, విద్య, సమాజ సంక్షేమం కోసం అలుపెరగని కృషి చేసిన కలాం సేవలు భారతదేశ పురోగతికి మార్గదర్శనం. ఆయన జీవితం మనకు నిస్వార్థ సేవ, అంకిత భావం, దేశభక్తి నిజమైన అర్థాన్ని తెలియజేస్తుంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలాం వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయాలను సాకారం చేద్దామని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు.

## అబ్దుల్ కలాంకు మాజీ సిఎం జగన్ నివాళి

**విజయవాడ,జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** అబ్దుల్ కలాం మాటలు దేశ యువతకు స్ఫూర్తిదాయకమని వైఎస్.జగన్ అన్నారు. ఆదివారం మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన 'ఎక్స్' వేదికగా నివాళిని అర్పించారు. క్షిపణి శాస్త్రవేత్త, దార్శనికుడు, నిజమైన దేశభక్తుడు ఏపిజే అబ్దుల్ కలాం. ఆయన మాటలు దేశ యువతకు స్ఫూర్తిదాయకం. దేశ పటిష్టత, అభివృద్ధి కోసం అబ్దుల్ కలాం ఎంతో కృషి చేశారు. ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నా అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. ఇక ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని వైసిపి కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి పార్టీ నేతలు నివాళులర్పించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సహా పలువురు పార్టీ నేతలు హాజరయ్యారు. ఏపీజే అబ్దుల్ కలాంకు వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు.

## పి-4 భారాన్ని ఉద్యోగులపై వేయకండి

### సిఎం చంద్రబాబుకు సిపిఐ(ఎం)విజ్ఞప్తి

**విజయవాడ.జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** జీరో పావర్టీ పి -4 భారాన్ని ఉద్యోగులపై వేయకండి అని సిఎం చంద్రబాబుకు సిపిఐ(ఎం)విజ్ఞప్తి చేసింది. దీనికి సంబంధించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత నాలుగైదు మాసాలుగా రాష్ట్రంలో పి-4 పేరుతో పేదరిక నిర్మూలన చేస్తామని సంపన్నులు ముందుకు వచ్చి మార్గదర్శకులుగా నిలబడాలని, పేదవాళ్ళను బంగారు కుటుంబాలుగా చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటున్నారు, అందుకు కార్పొరేట్లు, సంపన్నుల నుండి ఆశించిన స్పందన రాలేదు అని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ భారాన్ని ఉద్యోగులపై నెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, టీచర్లందరూ ఒక్కొక్కరు ఐదుగురిని దత్తత తీసుకోవాలని డిఇఒల ద్వారా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, మరొకవైపు ప్రతి సచివాలయ కార్యదర్శి తప్పనిసరిగా ఇద్దరిని దత్తత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని అన్నారు. తాజాగా విజయనగరం జిల్లా సాలూరు మున్సిపాలిటీ విడుదల చేసిన మెమోను దీనితోపాటు జత చేస్తున్నామని తెలి పారు. తక్షణంఈ ప్రతిపాదనను ఉపసంహ రించుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నదన్నారు.

## కింగ్‌డమ్ చిత్రం విజయవంతం కావాలని వేడుకున్నా

### శ్రీవారిసేవలో చిత్రబృందం



**తిరుమల,జూలై27ప్రభాతవార్తప్రతినిధి:** కింగ్‌డమ్ చిత్రం విజయవంతంగా ప్రదర్శించి ప్రేక్షకుల అబిమానం చూరగొనేలా చూడాలని ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని ప్రార్థించినట్లు చిత్రబృందం తెలిపింది. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో కింగ్‌డమ్ చిత్రబృందం నటుడు విజయ్‌దేవంకొండ, నటి భాగ్యశ్రీ, నిర్మాత నాగవంశీ తదితరులు ఆలయంలోనికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. ఆలయ అదికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## గౌహతిలోని కామాఖ్య ఆలయానికి విచ్చేయండి

### ఆలయ అర్చకులు, టిటిడి ఛైర్మన్ నాయుడుకు ఆహ్వానం

**తిరుమల,జూలై27ప్రభాతవార్తప్రతినిధి:** అస్సాం గౌహతిలోని ప్రసిద్ధకామాఖ్య ఆలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులందుకోవాలని ఆలయ అర్చకులు కోరారు. ఆదివారం ఉదయం తిరుమలకువచ్చిన కామాఖ్య ఆలయ పండితులు దీక్షిత్ ప్రసాద్‌శర్మ, రోహిత్‌భాయ్ రబాడియా టిటిడి ఛైర్మన్‌బిఆర్‌నాయుడును ఉదయం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కామాఖ్య ఆలయ విశేషాలు, తెలిపి ఆలయాన్ని సందర్శించాలని కోరారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి దర్శనంతో ప్రత్యేక అనుభూతి: గవర్నర్ అబ్దుల్ నజీర్

**తిరుమల,జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో ఒక ప్రత్యేక అనుభూతి కలుగుతుందని రాష్ట్రగవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ తెలిపారు. ఆదివారం ఉదయం గవర్నర్ దంపతులు తిరుమలకు చేరుకున్నారు. ఉదయం నైవేద్యవిరామ సమయంలో గవర్నర్ దంపతులు మహద్వారం వద్దకు రావడంతో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్వయంగా స్వాగతం పలికారు. ఆలయ ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ల వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. ఆలయంలోనికి చేరుకున్న జస్టిస్ అబ్దుల్‌నజీర్ దంపతులు శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ శ్యామలరావు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గవర్నర్ శ్రీవారిని దర్శించుకుని తిరుగుప్రయాణమయ్యారు. అంతకుముందు ఉదయం శేషాద్రి



ఎక్స్‌ప్రెస్ రైల్లో తిరుపతికి విచ్చేసిన గవర్నర్ జస్టిస్ నజీర్ దంపతులకు తిరుపతి జిల్లా సంయుక్త కలెక్టర్ శుభంబన్సల్, జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు పుష్పగుచ్ఛాలతో సాదర స్వాగతం పలికారు.

## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో శుభాలు కలుగుతాయి

### సిఎస్ విజయానంద్



**తిరుమల,జూలై27ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో రాష్ట్రప్రజలకు శుభాలు కలుగుతాయని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. రాష్ట్రం అన్ని విధాలా అద్భుతమైన ప్రగతి సాధిస్తుందని తెలిపారు. ఆదివారం ఉదయం సిఎస్ విజయానంద్ దంపతులు విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఇఒ శ్యామలరావు,అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయంలోపల ధ్వజస్తంభానికి మొక్కారు. అనంతరం ఆనందనిలయంలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రం బహూకరించారు. పంచగవ్య ఉత్పత్తులు, డ్రైఫ్లవర్స్‌తో రూపొందించిన శ్రీవారి చిత్రపటాన్ని





## భగవత్ ప్రసాదంగా భావిస్తా

### అన్నప్రసాద వితరణ నిరంతరాయంగా కొనసాగాలి: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**తిరుమల,జూలై 27ప్రభాతవార్తప్రతినిధి:** భగవంతుని సన్నిధిలో భక్తులతో కలసి అన్నప్రసాదం స్వీకరించడం భగవత్ ప్రసాదంగా భావిస్తానని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విశ్వాసం వ్యక్తం చేశారు. టిటిడి నిర్వహిస్తున్న అన్నప్రసాదం వితరణ కార్యక్రమాన్ని భక్తులందరూ ఉపయోగించుకోవడం చాలా సంతోషమన్నారు. ఈ పరంపర ఇలాగే కొనసాగుతుండాలని ఆయన ఆకాంక్షించారు. భక్తులకు సేవచేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి శ్రీవారిసేవ చేయడం సంతోషించదగిన విషయమని, అనుసరించదగిన గొప్పశుభపరిణామమన్నారు. అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చును వివిధ రూపాలలో విరాళంగా భక్తులకు సమర్పించడమనేది జీవితంలో లభించిన ఓ పవిత్రమైన అవకాశంగా భావించాలన్నారు. అలాంటి అవకాశం ఉపయోగించుకునేందుకు దాతలైన భక్తులు ఇంకా ముందుకు రావాలని వెంకయ్యనాయుడు కోరారు. అన్నప్రసాదం చాలా రుచిగా, నాణ్యతగా అద్భుతంగా ఉందని అభినందించారు.

ఆదివారం మధ్యాహ్నం తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనాన్ని వెంకయ్యనాయుడు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డితో కలసి సందర్శించారు. ఇక్కడ శ్రీవారి సేవకులతో ,భక్తులతో ఆప్యాయంగా పలకరించి వారివారి సేవలను అభినందించారు. భక్తులు కూడా అన్నప్రసాదం బావుందని, నాణ్యత మెరుగుపడిందని మాజీ ఉపరాష్ట్రపతికి తెలిపారు.

## మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు సాదర స్వాగతం



**తిరుమల,జూలై27ప్రభాతవార్తప్రతినిధి:** ఇష్టదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులకోసం ఆదివారం ఉదయం తిరుమలకు వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు సాదర స్వాగతం లభించింది. తిరుమలలో పద్మావతివిశ్రాంతి గృహాల సముదాయం వద్ద టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి మాజీ ఉపరాష్ట్రపతికి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. రాత్రికి ఇక్కడే బసచేస్తున్న ఆయన సోమవారం ఉదయం శ్రీవారి ఆశీస్సులందుకోనున్నారు. ఆయన వెంట టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

## భక్తులకు మరింత మెరుగైన సేవలందించడం అభినందనీయం

### టిటిడి ఛైర్మన్‌ను ప్రశంసించిన సిఎస్



**తిరుమల,జూలై27ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమల పుణ్యక్షేత్రానికి విచ్చేస్తున్న లక్షలాదిమంది భక్తులకు మెరుగైన సేవలందించడం, అన్ని రకాల సేవలు సంతృప్తికరంగా ఉండటం అభినందనీయమని రాష్ట్రప్రభుత్వ సిఎస్ విజయానంద్ తెలిపారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం ఆదివారం ఉదయం క్యాంపు కార్యాలయంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును సిఎస్ విజయానంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య టిటిడి చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలు గురించి భక్తులకు మెరుగైన సేవలందించడం గురించి చర్చించారు. సామాన్య భక్తులకు టిటిడి సేవలు మెరుగుపడటం అభినందనీయమన్నారు. అన్నదానం, లడ్డూ నాణ్యత ఎంతో రుచిగా ఉందన్నారు.



## శ్రీవారి ఆశీస్సులుండాలి: పలువురు ప్రముఖులు

**తిరుమల,జూలై 27ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, దేవుని దర్శనంతో ఆనందం కలిగిందని పలువురు ప్రముఖులు తెలిపారు. ఆదివారం ఉదయం చెన్నై హైకోర్టు సిజె జస్టిస్ మనీంద్ర మోహన్ శ్రీవాస్తవ, తెలంగాణ ఎంఎల్‌సి రవీందర్‌రావు, నిర్మాత నాగవంశీ వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనా యకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

వార్త


మన జీవితం మనం చేసిన పనులను బట్టి అంచనా వేస్తారు. కాని జీవించిన కాలాన్ని బట్టి కాదు.

- న-ఎ. బెర్గ్

# 'అమ్మ'తనానికి అమానవీయ సృష్టి!

తెలుగు రాష్ట్రాల్లో విశ్వామిత్ర 'సృష్టి' కి దారులు తెరిచిన కొందరు డాక్టర్ల చేతిలో ఎందరో 'సంతృప్తి లేని దంపతులు మోసపోవడం,అదీ అమానవీయ పద్ధతుల ద్వారా కావడం విచారకరం. జుగుప్సాకరం కూడా. ఈ దందా నడిపే వారికి అండదండలుగా అండ, వీర్య కణాలు సేకరించే సంస్థలు కూడా ఇప్పుడు పోలీసుల దర్యాప్తులో ఇరుక్కున్నాయి.సంతానలేమితో సతమతమవుతున్న వారు, శారీరక అనారోగ్యాల రీత్యా ఇక పిల్లలు కనే అవకాశం లేనివారు, దంపతులిద్దరిలో ఎవరి వీర్యమైనా సంతానోత్పత్తికి పనికిరాని సందర్భంగా సరోగసికి పద్ధతిలో పిల్లల్ని కనడం ఈ మధ్యకాలంలో అందరూ ఆహ్వానిస్తున్నదే. కానీ తన భర్త వీర్యకణాల ద్వారా సంతానం కావాలని ఆశించిన ఓ స్త్రీమూర్తి ఆశలు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ల నిర్వాకంతో భగ్నమయ్యాయి.కానీ ఇంత దారుణంగా తమ దంపతులు కోరుకున్నట్లుగా భర్త వీర్యకణంతో కాకుండా వేరొకరి వీర్యంతో పుట్టిన బిడ్డను సాకాల్సి వచ్చింది. దారుణమేమిటంటే ఒప్పందాన్ని చట్టబద్ధంగా వినియోగించినట్లయితే ఇప్పుడు ఈ సంఘటన బయటకు పొక్కేది కాదు. కానీ బయట ఎక్కడో సేకరించిన పురుషుల వీర్యకణాలను వినియోగించడం, అవి కూడా జన్యుపరంగా క్యాన్సర్ రోగి వీర్య కణాలు కావడమే బెడిసికొట్టింది.రాజస్థాన్‌కు చెందిన సోనియా దంపతులు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లను నడుపుతున్న నిర్వాహకులను కలిసారు. ఐవిఎఫ్, సరోగసి, ఐయుఐ పద్ధతుల ద్వారా తాము సంతాన సాఫల్యాన్ని కలిగించగలమని విస్తృత ప్రచారం వారికి కలిసొచ్చింది. కానీ తాజాగా వీర్య కణాల మార్పు వారి కొంప తీసింది. ఫెర్టిలిటీ సెంటర్‌ను హైదరాబాద్‌లో సంప్రదిస్తే ఆమెకు కృత్రిమ పద్ధతిలో సంతానం కలిగించేందుకు ఒప్పందం కుదిరింది. వైద్య పరీక్షలకు మరో 66 వేల రూపాయలు కూడా చెల్లించారు. అనుకున్న 30 లక్షలు సమర్పించాక ఈ ప్రక్రియలో అన్ని ఏర్పాట్లు జరిగిపోయాయి. ఆ బిడ్డను సాకుతుండగా అనారోగ్యం, ఆఖరికి చివరకు క్యాన్సర్ సోకిందని తెలియగానే ఆ జంట హతాశులయ్యారు. దంపతులు ఇద్దరి కుటుంబాల్లో క్యాన్సర్ రోగ చరిత్ర లేనందున డిఎన్ఏ పట్టుబడతారు. 'సృష్టి'వారు నిరాకరించారు. ఆపై తమ సందేహం తీర్చుకునేందుకు ఢిల్లీలోని వసంత్ కుంజ్ ఫోరెన్సిక్ ల్యాబ్‌లో డిఎన్ఏ పరీక్షలు చేయించుకోగా అవి సరిపోలేదు. దాంతో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై సోనియా దంపతులు హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్ని సజావుగానే ఉందనుకుంటే సోనియా భర్త వీర్యాన్ని ఎందుకు వినియోగించ లేదు. ఇవన్నీ ఈ కేసును డీల్ చేసిన డాక్టర్లు, కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు తేల్చాలి. డబ్బు సంపాదనకు ఇలాంటి మార్గాన్ని ఎంచుకున్న డాక్టర్ను వైద్య వృత్తి క్షమించదు. గతంలో ఇదే డాక్టర్ కొన్ని అక్రమాలతో బయటపడి ఆమె క్లినికల్ లైసెన్స్ రద్దయ్యాయి.మరొకరి పేరిట క్లినిక్ నిర్వహిస్తున్నారని దర్యాప్తులో తేలింది. తమకు అందిన ఫిర్యాదుతో సృష్టి సెంటర్‌ను పోలీసులు, వైద్య, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేయగా ఒక్కటొక్కటిగా లోపాలు, పాపాలు బయటపడుతున్నాయి. దాంతో క్లినిక్‌కి అనుమతులు అక్రమాలు వంటి వాటిని పరిశీలించి కేసులు పట్టిష్ట పరచడానికి నిపుణుల జోక్యం అవసరం ఉంది. ఇటువంటి సంస్థలు ప్రక్రియలు ప్రయోగాలకు చెక్ పెట్టకపోతే మాతృత్వం వెక్కివెక్కి ఏడుస్తుంది. మారుతున్న కాలంలో సంతాన సాఫల్య కేంద్రాలు కొంత వరకు సమర్ధనీయమే. కానీ అనుచిత కార్యక్రమాలను అనుమతించరాదు. దంపతులను దగా చేయడమే కాదు. తీరా బిడ్డను పరిశీలించాక కానీ అసలు విషయం వారు తెలుసుకోలేకపోయారు. పుట్టిన బిడ్డ ముఖ కవళికలు రంగు, హావభావాలు,రంగు, ఆహార్యం, ఆరోగ్య పరిస్థితులు వంటి అంశాలు తల్లిదండ్రులతో పోలనప్పుడు మాత్రమే, మళ్ళీ డిఎన్ఏ పరీక్షల కోసం వెళ్ళడం ఈ ప్రక్రియలో ప్రధానం.ఫెర్టిలిటీ స్కానింగ్ సెంటర్‌లపై ఎన్ని దాడులు జరిపినా, అక్కడ ఐవీఎఫ్‌కు మోస పోయిన వారు నోరెత్తితే తప్ప ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి దాపురిస్తోంది. దగాకోరు ఆలోచనలతో నగరాలలో విచ్చలవిడిగా వెలుస్తున్న ఫెర్టిలిటీ సెంటర్‌లపై వైద్యశాఖ నిరంతర నిఘా ఉండాలి. సరోగసి చట్టబద్ధమే అయినా, వంచనను సహించకూడదు. హైదరాబాద్ జిల్లాలో 49, రంగారెడ్డిలో 40, మేడ్చల్ జిల్లాలో 30 వరకు ఐవిఎఫ్ ఫెర్టిలిటీ సెంటర్‌లున్నా మరికొన్ని అనధికారంగా సాగుతున్నాయి. ఐవీఫ్ ద్వారా గర్భధారణ అవసరం అనుకున్న వారికి అత్యాధునిక చికిత్స, నిరంతర పర్యవేక్షణ పేరిట 20 నుంచి 30 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తుంటారు. ఈ సరోగసి ఫెర్టిలిటీ సెంటర్కు అనుబంధంగా స్పెర్మ్ కలెక్ట్ చేస్తున్న సెంటర్ల నిర్వాకంపై టాస్క్‌ఫోర్స్ దాడులు చేసి ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐవీఎఫ్ సెంటర్లకు స్పెర్మ్ కలెక్ట్ సెంటర్లకు అవినాభావ సంబంధం ఉంటుంది. వీటి రెండిటి మీద వైద్య ఆరోగ్యశాఖ నిఘా తప్పనిసరి. యువకుల వీర్యం కోసం వారికి డబ్బు ఆశ చూపి వారికి పోర్న్ చిత్రాలు చూపిస్తూ వీర్య సేకరణ, అలాగే అండ సేకరణ ఈ సెంటర్‌ల నిత్య విధి. అనుమతిలేని విధానాలు ,అక్రమ పద్ధతులను నివారించేందుకు వైద్యారోగ్య శాఖ స్పష్టమైన చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ పాపంలో అధికారుల భాగస్వామ్యం కూడా క్షమార్హం కాదు!

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగంలోనే అసలు సమస్య.



రామకృష్ణ పరమహంస

# ప్రజావాక్కు



## సుప్రీం కోర్టు స్టే ఆర్డర్

జూలై 2006లో ముంబై లోకల్ రైళ్లలో 189 మంది మరణానికి 800మంది గాయాల పాలవడానికి కారణమైన వారిని ప్రత్యేక కోర్టు సుదీర్ఘంగా విచారణ జరిపి 12 మందికి శిక్ష విధించింది. వీరు ముంబై హైకోర్టును ఆశ్రయించగా వీరు నిర్దోషులని తీర్పు ఇచ్చింది. మరి ఈ దారుణానికి కారణమైన దోషులెవరు? నేరాలు జరుగుతున్నాయి. సాక్ష్యాలు లేవని కోర్టులు శిక్షలు విధించకపోతే నేరాలు, ఘోరాలు జరుగుతూనే ఉంటాయి. నేరాలను కళ్లతోచూసినా సాక్ష్యం చెప్పడానికి భయపడుతున్నారు. నేరస్తులను తమ్మినిబిమ్మని చేసి శిక్షలు పడకుండా రక్షించే న్యాయవాదులున్నారు. న్యాయమూర్తులు కూడా నేరం చేసిన వారిని గుర్తించినా సాక్ష్యాలు లేక విడిచి పెడుతున్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన స్టే ఆర్డరు ఏ రూపం దాలుస్తుందో వేచి చూడాలి.

- ఎన్.రామలక్ష్మి, సికింద్రాబాద్

## తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి

దశాబ్దాలుగా అన్ని రంగాల్లో వెనకబడి కుంగిపోతున్నా తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి.గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలో కాపు కులంతో తెలగ కులాన్ని జతచేయడం వల్లనే ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులాన్ని బీసీగా గుర్తించడంలేదు. ఎందుకంటే కాపులు ఆర్థికంగా బలమైన వారు కాని తెలగకులస్తులు కేవలం వ్యవసాయాన్ని నమ్మి ఆర్థికంగా ఎదగలేకపోయారు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు సంపాదించలేకపోయారు. అందుకే ఉత్తరాంధ్రలో తెలగకులాన్ని జాగృతం చేయాలి.

- జి. అశోక్ కుమార్, విశాఖపట్నం

## డిఏ బకాయిలు చెల్లించాలి

కరోనా సమయంలో నిలిపివేసిన 18 నెలల డిఏ బకాయిల చెల్లింపువిషయంలో నేషనల్ కౌన్సిల్‌ఆఫ్ జాయింట్ కన్సల్టెటివ్ మెషినరీ స్టాండింగ్ కమిటీ 63 వ సమావేశంలో ప్రభుత్వం తిరిగి చెల్లించాలి అని వాక్యాణించడం కొంచెం ఆలోచించవలసిన విషయం.ఆసమయంలో కుదేలైన అర్థిక వ్యవస్థ వల్ల ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకుంది. అందువల్ల 8వ వేతన సంఘం పూర్తిగా అమలు చేయ డానికి అడిగే హక్కు తప్పకుండా ఉంది.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

## ఓటీటీ వేదికలపై నిషేధం

సంస్కృతి, మానవీయ విలువలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం 25 ఓటీటీ వేదికలపై నిషేధం విధించడం సకాలంలో తీసుకున్న కీలక చర్య. ఉల్లూ, ఎఎల్టీటీ, బిగ్‌షాట్స్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారాలపై అశ్లీల,అసాంస్కృతిక కంటెంట్ యువతను దారితప్పిస్తోంది. దీని ప్రభావంతో వ్యక్తిగతం నుంచి సామాజిక స్థాయిలో నెగటివ్ ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అసభ్య కంటెంట్ వల్ల యువతలో అసత్య ఆశలు, మానసిక వక్రీకరణ, బాధ్యత లేని ప్రవర్తన పెరుగుతున్నాయి. బాల్యదశలోనే అసభ్య పదజాలం, అసాంఘిక ప్రవర్తన వ్యాపిస్తోంది. కుటుంబ విభేదాలు, మానసిక దిగజారాలు, నేరప్రవృత్తుల వరకు పరిమితమవుతున్నాయి. ఓటీటీలు, సినిమాలు, సోషల్ మీడియా వేదికలు ప్రజలకు సమర్థవంతమైన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. లాభదోపిడీ కోసమే కొన్నిసంస్థలు అసభ్యతను ప్రధానంగా నిలుపుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్,శ్రీకాకుళం

## ప్రభుత్వ కార్యాలయాలను ఆధునీకరించాలి

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ డివిజన్ వారు తహసిల్ పౌరసరఫరాల మొదలగు ప్రాథమికపరిపాలన కార్యాలయాలు చాలావరకు అధ్వాన్నస్థితిలో ఉన్నవి. ఈ భవనాలను శుభ్రపరచకపోవడం వలన అత్యంత భయంకర దృశ్యంగా కనిపిస్తుంటాయి. సున్నం రంగులు వేసినట్టు కనిపించడం లేదు. కొన్ని కార్యాలయాలు పై అంతస్తులో ఉండడం వలన స్త్రీలు వయోధికులు మెట్లమార్గం నుండి పోవడంగగనంగా మారుతున్నది. కంప్యూటర్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు ఉపయోగించే కేబుల్స్ కరెంటు వైర్లు వేలాడుతుంటాయి. ప్రభుత్వాలకు ప్రజలకు ప్రధాన వారుధలైన ఈ కేంద్రాల ఆలనాపాలన పట్టించుకోకపోవడం శోచనీయమైన అంశం.

- దండంరాజు రాంచందర్ రావు, పాత బోయినపల్లి

## ఉపాధి హామీ కార్యక్రమాలు చేపట్టాలి

భూమి అభివృద్ధి కార్యక్రామాల వల్ల భూమి చదును పనుల వల్ల రైతు కోణంలో ఉపాధిహామీ పని రైతులకు ఉపయోగకరంగా మారుతుంది. బీడు భూమిని సాగులోకి తేవడం వల్ల రైతు భూమి పంటకు యోగ్యంగా మారడం వల్ల రైతు సంపద కూడా పెరుగుతుంది. నీటి వసతి పెరగడంతో ఉపాధి హామీ ద్వారా మిగులు బీడు భూమి సాగులోకి వచ్చింది. ప్రభుత్వం ఇటువంటి పనిని ప్రోత్సహించాలి.

-భారత అవినాష్, జనగామ

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రకృతి పరిరక్షణలో వివేకం ఏదీ!

**చలితో వణికిపోయే యు.ఎస్, కెనడా వంటి దేశాల్లో కూడా ఎండలు పెరగడం, వివిధ దేశాల్లో భారీ వర్షాలు ముంచెత్తడం భారతీయ నగరాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు, ఊహించని వరదలు, కరువు పరిస్థితులు ఇలా ఒకదానికొకటి పొంతన లేని పరిస్థితులు నెలకొనడానికి వాతావరణంలోని అవాంఛనీయ పరిణామాలే కారణం. సకల అనర్థాలకు మూలకారణం ప్రకృతి విధ్వంసం. ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించడానికి పదాలు చాలవు. అయితే ఈ వర్ణన కొంతకాలానికి గతచరిత్రలా మిగిలిపోయే ప్రమాదం పొంచి ఉన్నది. మానవ జీవన సౌందర్యం మసకబారే రోజులు ఏర్పడుతున్నాయి. మానవ స్వార్థం మాన వాళికే మృత్యుగీతం ఆలపించే తరుణం ఆసన్నమైనది.**



సుంకవల్లి సత్తిరాజు

ఇటీవల చైనా,దక్షిణ కొరియాల్లో వైఫా తుఫాను సృష్టించిన బీభత్సం గురించి మాటల్లో చెప్పలేం. 150కి. మీటర్ల వేగంతో వీచిన పెనుగాలుల ఉధృతికి వందలాది భవనాలు నేలమట్టమయ్యాయి. భారీ వర్షం వలన జన జీవితాలు కకావికలమైనాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రోడ్డు,రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందిన అంతర్జాతీయ నగరం హాంకాంగ్ హడలెత్తిపోయింది. తైవాన్ టైఫూన్ ప్రళయ గర్జనతో ఘోషించింది. వియత్నాం విలయాన్ని చవిచూసింది. పాకిస్థాన్ భారీ వర్షాలతో భీతిల్లింది. పాక్‌లోని పంజాబ్ ప్రాంతంలో భారీ ప్రాణ నష్టం సంభవించింది. ప్రకృతి విలయ తాండవం ఎంతో మంది ప్రాణాలను బలితీసుకుంటున్నది. భువన గగనాలను శాసిస్తున్నామని విర్రవీగే మానవ విజ్ఞానం ప్రకృతి ముందు మోకరిల్లక తప్పడం లేదు. ఎందుకిలా జరుగుతున్నది? ప్రకృతి ప్రకోపానికి కారణమేమిటి? ప్రకృతి సృష్టిస్తున్న విలయానికి అడ్డుకట్ట వేయలేమా? ప్రకృతిని ధ్వంసం చేయడమే ప్రళయానికి కారణమన్న సంగతిని ఎందుకు గుర్తించలేకపోతున్నాం. ప్రకృతిని పరిరక్షించగలిగితేనే ధరిత్రిలో మానవులు సుఖసౌఖ్యాలతో మనుగడ సాగించగలరు. పచ్చదనానికి పాడె కడితే మానవ పయనం కాటికే దారితీస్తుంది. ఈ సత్యాన్ని గ్రహించక తాత్కాలిక సౌకర్యాల కోసం మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కోవడం ఆత్మహత్యాసదృశం. భవిష్యతరాలకు భద్రమైన సమాజాన్ని అందించాలనే ధ్యేయంతో ప్రతీఏటా జూలై 28వ తేదీని 'ప్రకృతి పరిరక్షణ దినం'గా పాటిస్తున్నాం. పలురకాల కాలుష్య కారకాలతో, వ్యాధులతో, వైరస్‌లతో ప్రపంచం అతలాకుతలమైపోతున్న నేపథ్యంలో 2025వ సంవత్సరం జూలై 28 వ తేదీన జరిగే ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవానికి ప్రాధాన్యత పెరిగింది. మన ముందు తరాలు ముందు చూపుతో ప్రకృతి పట్ల శ్రద్ధ చూపేవారు. పంచభూతాలను ఆరాధ్య దైవాలుగా భావించేవారు. ప్రాచీన కాలం నాటి పెద్దల ఆచారాలను మనం అవహేళన చేశాం. మూఢ నమ్మకాలని కొట్టి పడేశాం. వారు ఆచరించి, ఆరాధించిన ప్రతీ పని వెనుక ఒక పరమార్థం దాగి ఉంది. నాటి మన పెద్దల ఆచార వ్యవహారాలు, జీవన విధానం వారి ముందు చూపుకు నిదర్శమని వర్తమాన పరిణామాలను బట్టి అవగతమవుతున్నది. పచ్చదనం పట్ల వారికున్న మక్కువ, నీటి వినియోగంలో పొదుపు, ఆరోగ్య పరిరక్షణకు అవలంభించిన విధానాలు, వనమూలికలతో వైద్యం,మొక్కల పెంపకం,పశు పెంపకం, వివిధ జీవరాశుల మనుగడ పట్ల ఆసక్తి, అందుకు వారు అవలంభించిన విధానం, మనకు తిండినిచ్చిన నేలతల్లిని కృతజ్ఞతాభావంతో ఆరాధించడం, ప్రతీ పర్వదినానికి ఒక అర్థాన్ని సూచించడంలోని లోతైన విశ్లేషణ మానవ జాతి పదికాలాల పాటు సుభిక్షంగా వర్ధిల్లాలనే వారి ఆకాంక్షను వెల్లడిస్తున్నది. ప్రకృతి పట్ల వారు కనబరచిన ఆరాధ్యభావం అనుసరణీయం. నాటి పెద్దల హితోక్తులు నేటికీ శిరోధార్యం. అయితే గత తరాల దార్శనికతను మూఢత్వంగా భావించి, హేళన చేసి, ఆధునికత్వం పేరుతో ప్రకృతిని పరిహసించిన ఫలితాన్ని నేడు మనం అనుభవిస్తున్నాం. ప్రకృతి సిద్ధమైన జీవన విధానాన్ని విస్మరించి, మన జీవితాలను మనమే ఛిన్నాభిన్నం చేసుకుంటున్నాం.అడవులు విధ్వంసమైపోతున్నాయి. త్రాగునీటికి, సాగునీటికి ప్రాంతాల మధ్య విబేధాలు తలెత్తుతున్నాయి. చినుకు పడితే జనారణ్యాలన్నీ సంద్రంలా మారిపోతున్నాయి.భారీవర్షాల వలన జరిగిన నష్టం,వరదల వలన ప్రజలు పడుతున్న అగచాట్లు కేవలం ప్రకృతి ప్రకోపం వలన సంభవించినవిగా మాత్రమే చెప్పడం సత్యదూరం. ఈ ఉత్పాతాలకు మానవ వైఫల్యా




లు చాలా వరకు కారణం. ప్రస్తుతం జనాభా విపరీతంగా పెరిగింది.రెండు వందల సంవత్సరాల క్రితం ప్రపంచ జనాభా కేవలం వంద కోట్లు. వంద సంవత్సరాల క్రితం సుమారు 318 కోట్లు, 2025 నాటికి ప్రపంచ జనాభా 820 కోట్లకు చేరుకున్నది.'ఇంతింతై వటుడింతై' అన్న మాదిరిగా ఆకాశమే హద్దుగా, భూమ్యాకాశాలను ఆక్రమించే విధంగా పెరిగి పోయిన జనాభా ప్రకృతి విధ్వంసానికి దారి తీసింది. మానవ స్వార్థం పరాకాష్ఠకు చేరుకుంది. మానవ తప్పిదాలే మానవాళికి ముప్పుగా పరిణమించాయి. సహజ వనరులు తరిగిపోతున్నాయి. మానవ అవసరాలు పెరిగిపోతున్నాయి. గాలి, నీరు కలుషితమై పోయింది. పచ్చదనం హరించుకుపోయింది. వాహన కాలుష్యం పెరిగి పోయింది. 'గ్లోబల్ వార్మింగ్' దుష్ఫలితాలను చవిచూస్తున్నాం. పీల్చే గాలిలో, త్రాగే నీటిలో, తినే తిండిలో స్వచ్ఛత లోపించింది. నాణ్యతా ప్రమాణాలు లోపించాయి. ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి జరుగుతున్న నష్టం అంచనాకు అందని విధంగా ఉంది.మానవ దురాలోచన దూరదృష్టిని హరించింది. ప్రకృతిని పరిహసించింది.మానవేతర జీవరాశులు అంతర్థానమైపోతున్నాయి. ప్రకృతి సమతుల్యత లోపించింది. అంటువ్యాధులు ప్రబలిపోతున్నాయి. శాస్త్రజ్ఞులకు అంతుబట్టని బ్యాక్టీరియాలు, వైరస్‌లు విజృంభిస్తున్నాయి. ప్రస్తుత మానవ తప్పిదాలు రోగగ్రస్థమైన ప్రపంచాన్ని రాబోవు తరాలకు అందించడమే ధ్యేయంగా అప్రతిహతంగా కొనసాగుతున్నాయి. ప్రకృతిని పరిరక్షించడంలో ఇకనైనా జాప్యం లేకుండా కట్టుదిట్టమైన చర్యలుచేపట్టాలి. రాబోయే మానవ విలయాన్ని ఆపాలి. తరిగిపోతున్న సహజ వనరులను కాపాడాలి. కాలుష్యరహితమైన ప్రత్యామ్నాయ ఇంధన వనరులను వినియోగించాలి. రసాయనాల వాడకాన్ని తగ్గించగలగాలి. సహజ సిద్ధమైన జీవన శైలిని అలవాటు చేసుకోవాలి. మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత నివ్వాలి. వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి, పునర్వినియోగానికి అనువైన చర్యలు చేపట్టాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని జీరోస్థాయికి తగ్గించాలి. భూతాపాన్ని తగ్గించడానికి ప్రపంచ దేశాలన్నీ ఏకత్రాటిపైకి రావాలి. ఈ విషయంలో పారిస్ ఒప్పందాన్ని తు.చ తప్పకుండా అమలు చేయాలి.వాతావరణంలో సంభవించే మార్పుల వలన భవిష్యత్తులో అనేకభౌగోళిక మార్పులు జరిగే అవకాశముంది. చలితో వణికిపోయే యు.ఎస్, కెనడా వంటి దేశాల్లో కూడా ఎండలు పెరగడం, వివిధ దేశాల్లో భారీ వర్షాలు ముంచెత్తడం భారతీయ నగరాల్లో తీవ్ర ఉష్ణోగ్రతలు, ఊహించని వరదలు, కరువు పరిస్థితులు ఇలా ఒకదానికొకటి పొంతన లేని పరిస్థితులు నెలకొనడానికి వాతావరణంలోని అవాంఛనీయ పరిణామాలే కారణం. సకల అనర్థాలకు మూలకారణం ప్రకృతి విధ్వంసం. ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించడానికి పదాలు చాలవు. అయితే ఈ వర్ణన కొంతకాలానికి గతచరిత్రలా మిగిలిపోయే ప్రమాదం పొంచి ఉన్నది.మానవ జీవన సౌందర్యం మసకబారే రోజులు ఏర్పడుతున్నాయి. మానవ స్వార్థం మానవాళికే మృత్యుగీతం ఆలపించే తరుణం ఆసన్నమైనది. పచ్చని ప్రకృతి ఒడిలో పసిపిల్లల వలే ఆనందంతో జీవించే ఆరోగ్యవంతమైన వాతావరణం భువిపై కనుమరుగైపోతుంటే, సహజత్వంలో ఉన్న మాధుర్యాన్ని మరచి, కృత్రిమంగా జీవించే కాలాన్ని ఖరీదు పెట్టి కొనుక్కునే చేటుకాలం దాపురించింది. పండు వెన్నెల్లో పరవసించే కాలం పరిసమాప్తమైనది. ప్రకృతిలో సేద తీరడం మాని, కృత్రిమ, కలుషిత ఆధునిక జీవనవ్యవస్థలో స్వాంతన పొందాలని ఆశిస్తున్నాం. ఇదే మానవ జీవన క్రమంలో మౌనంగా వచ్చి చేరిన మహా విపత్తు. పచ్చదనం హరించబడింది. ప్రకృతి మానవ పరిహాసానికి గురౌతున్నది. ఒకవైపు భూ ఉపరితల ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మరోవైపు వాతావరణంలో అవాంఛనీయ పరిణామాలు ఏర్పడుతున్నాయి. గ్రీన్‌హౌస్ వాయువుల ప్రభావంతో సంభవిస్తున్న వాతావరణ మార్పులు అనేక విపత్కర పరిణామాలకు దారి తీస్తున్నాయి.జీవరాశుల మనుగడకు గ్రీన్‌హౌస్ వాయువులు ఎంత ముఖ్యమో,వీటి ప్రభావం అధికమైతే అంతే ప్రమాదం. గ్రీన్‌హౌస్ వాయువులు లేకపోతే భూతల ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీకి పడిపోతాయి. కాబట్టి ఈ వాయువులు తగు పరిమాణంలో ఉండాలి. కాలుష్యాన్ని పెంచే ఇంధనాల వాడకం విపరీతంగా పెరిగిపోతున్నది. మానవ దుశ్చర్యల వలన ప్రకృతి ప్రకోపిస్తున్నది.పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నది. కలుషిత కారకాలతో, అవాంఛనీయ వాతావరణ మార్పులతో భూగ్రహం నిర్జీవంగా మారే ప్రమాదం ఏర్పడింది.ఇప్పటికేమానవ స్వార్థానికి ప్రకృతి చాలావరకు విధ్వంసం కాబడింది. ఇకనైనా మేల్కొని ప్రకృతిపరిరక్షణ చర్యలను వేగవంతంచేయాలి. పచ్చదనాన్ని పెంపొందించాలి.సకల జీవరాశులు ప్రకృతిలో మమేకమై జీవించాలి. ప్రకృతి సమతుల్యత, పరి రక్షణ మీదనే భవిష్య ప్రపంచమనుగడ ఆధారపడి ఉన్నది. •

# ఆత్మహత్యలను అదుపు చేయలేమా?

డాక్టర్. వై. సంజీవ కుమార్

రోజు రోజుకు పెరిగిపోతున్న ఆత్మహత్యలు, చిన్న పెద్ద, అనే తారతమ్యం లేకుండా, చదువుకున్న వాళ్లు, చదువు లేని వాళ్లు కూడా ఒక్క క్షణాన్ని విస్మరించి ప్రాణాలను తీసుకుంటున్నారు. ఉన్నతమైన స్థానాల్లో ఉన్న వ్యక్తులు కూడా ఆత్మహత్యలకు పాలుబడడం అనేది సమాజం విస్తుపోయేలా ఉంది. ఆర్థికభారం అని కొందరు, చదువులలో విజయం సాధించలేదని కొందరు, ప్రేమలో విఫలంఅయ్యామని, కుటుంబ కలహాలు ఇలా అనేకం ఉన్నాయి. కానీ ఎవ్వరికి వాళ్లు ఆ సమస్యల పట్ల నియంత్రణ కోల్పోవడం వాళ్లను వాళ్లు కోల్పోయేలా చేస్తుంది అనడానికి నిదర్శనాలే ఈ ఆత్మహత్యలు. జీవితంలో ప్రతి ఒక్కరు ఎదో ఒక సమస్యతోనే ఉన్నారు. అనేక సమస్యలతో ఉన్నవాళ్లు కూడా నిత్యం జీవితాన్ని నిలుపోవడానికి పోరాటం చేస్తున్నారు. జీవితమంటే అన్ని ఎదురుకొని సాగడమే. అన్నిటిని ఎదుర్కోలేనప్పుడు మానసిక సంఘర్షణ మొదలవుతుంది. సంఘర్షణ మొదలైనప్పుడే నమ్మినవాళ్లతో సమస్యలను పంచుకోవాలి. అప్పుడు మనస్సు బాధ తగ్గుతుంది. చెప్తే ఏమనుకుంటారో అనే ఆలోచనలతో కూడా మనస్సులోని సంఘర్షణలను పంచుకోలేకపోతున్నారు. ప్రాణం ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకోవాలి. ప్రాణం తీసుకుంటే మీ స్థాయికి మీరు మాయని మచ్చను మిగిల్చినవాళ్ళే అవుతారు. సమాజం కూడా మనిషిని బలహీనపరచడంలో ముందు ఉంటుంది. నెగటివ్‌ను ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. ఎదుటి మనిషిలో మంచిని గ్రహిస్తే ఆ మనిషిలో చెడు ఉన్నాకూడా మంచివైపు మారే అవాకాశం ఉంటుంది. భారతీయ కుటుంబ వ్యవస్థ అంటేనే గొప్పప్రాధాన్యత, గౌరవం. ఆ కుటుంబ వ్యవస్థలో ఆధునికపోకడల వలన ఎవ్వరికి వారే యమునా తీరే అనేలా ఎవ్వరికివాళ్లే గొప్ప అనుకోని జీవిస్తూ నాలుగు గోడల మధ్య ఉండే మనస్పర్థలు, సమస్యలను బాజారుకీ ఈడుస్తున్నారు. అవమానాలను తట్టుకోలేని వాళ్లు బలవర్మణాల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రేమ అనేది జీవితంలో ఒక భాగమే అనేవిషయాన్ని యువత మర్చిపోయి జీవితమే ప్రేమ అనే భ్రమలో వెనకముందు ఆలోచించకుండా ఎదుటి వారి ప్రాణాలను బలిగొంటున్నారు. మరికొందరు వాళ్ల ప్రాణాలు వాళ్లే తీసుకుంటున్నారు. మిమ్మల్ని అల్లారుముద్దుగా పెంచి అహర్నిశలు కష్టపడి వాళ్ళ జీవితాలను పణంగా పెట్టి స్తోమత లేకున్నా మా పిల్లలు మంచి ఉన్నతమైన చదువులు చదవాలి, ఉన్నతంగా ఎదగాలి అని లక్షలకు, లక్షలు ఖర్చుపెట్టి చదివిస్తుంటే మీరు ఇచ్చే బహుమానాలు ఆత్మహతలు, జూదం ఆడటం, వ్యసనాలకు బానిస అవ్వడం. ఒక్క క్షణం ఆలోచిస్తే మీరు ఏమిటి అనేది మిమల్ని ప్రశ్నించుకుంటే తల్లిదండ్రుల గోష అర్థం అవుతుంది. ఉద్యోగం లేదని రాలేదని చనిపోవడం మీచదువును మీరు చంపడమే అవుతుంది. బ్రతకడానికి అనేక మార్గాలు, చదివిన చదువుకు ఉదోగ్యం చేసేవాళ్లు ఎందరో ఉన్నారు. చదివిన ప్రతి ఒక్కరికి ఉద్యోగమే కావాలి అని కూర్చుకుంటే మనిషి మనుగడనే ఆగిపోతుంది. చదువు విజ్ఞానం మాత్రమే నేర్పుతుంది. బ్రతుకు బ్రతకాలంటే అనేక మార్గాలు, చిన్నదైనా, పెద్దదైన సిగ్గుపడకుండా చేసుకుంటూ వెళ్తే జీవితంలో ఎప్పుడో ఒకసారి మీ చదువే మీకు మార్గం అవుతుంది. అనాలోచితంగా మీరు తీసుకునే ఆ ఒక్క క్షణం నిర్ణయం మీ జీవితాలనే కాదు, మీ తల్లిదండ్రుల జీవితాలు బుగ్గిపాలు అవుతున్నాయి. మానసిక సంఘర్షణ నివారణకు మార్గాలను అన్వేషించకపోవడమే మనోవ్యాధి పెరిగి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. జీవితంలో ఎదురయ్యే ప్రతి ఒక్కరు మీవాళ్లు కాదు, విడిపోయే వాళ్ళు ఎవ్వరు మీ వాళ్లు కాదు. జీవితం రైలుబండి లాంటిది, సాగుతూనే ఉంటుంది. వచ్చే వాళ్లు వస్తుంటారు, దిగేవాళ్ళు దిగిపోతున్నారు, ఒక్క క్షణం ఆలోచిస్తే ఆత్మహత్య మూర్ఖపు ఆలోచనల నుంచి బయట పడతారు. చనిపోయి ఏమి సాధించలేరు. బ్రతికి సాధించి చూపండి. అప్పుడే మీ బ్రతుకుకి ఒక అర్థం ఉంటుంది. చిన్న పెద్దా అనే తారతమ్యం లేకుండా ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం కమిటీ వేసి ఆ కమిటీలో అన్ని విభాగాలను చేర్చి ఆత్మహత్యలు చేసుకోవాలనే ఆలోచన వచ్చినవారికి ఈ ప్రణాళిక మార్గం చూపించి పరిష్కారం చేయించేలా ఒక ప్రణాళికను సిద్ధం చేయాలి. దాన్ని వెంటనే అమలులో చూపాలి. •

# స్కూల్ బ్యాగుల మోతకు అంతుండదా!

లకావత్ చిరంజీవి

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన తరుణంలో విద్యార్థులపై మళ్ళీ బ్యాగు భారం మొదలైంది. నర్సరీ పిల్లాడి స్కూల్ బ్యాగు బరువు ఐదు కిలోలు పైన ఉన్నప్పుడు ఐదో తరగతి పిల్లాడి స్కూల్ బ్యాగ్ పుస్తకాల బరువు 12 కిలోలకు తక్కువ ఉండదు. అతి చిన్న వయసులోనే ఇంతా బరువు మోయడం వలన పిల్లలు ఇబ్బందులు పడుతుంటే పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదు. భావి భారత పౌరులు బడులకు ఆడుతూ.. పాడుతూ వెళ్లాల్సిన పిల్లలను ఆధిక బరువుతో పుస్తకాల సంచీ వెన్ను వంచుతోంది. దాని ఫలితంగా పట్టుమని 15 ఏళ్లు నిండక ముందే చాలా మంది నడుము, మెడనొప్పి, కండరాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అవసరం ఉన్నా లేకున్నా పుస్తకాలు కొనిపించి పిల్లలపై మోయలేని భారాన్ని పాఠశాలల యాజమాన్యాలు వేస్తున్నారు. ఏళ్ల తరబడి బరువైన బడి సంచుల్ని మోయడం వల్ల యుక్త వయస్సు వచ్చేసరికి భుజాలు, వెన్నెముకకు సంబంధించిన సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో బుక్స్ భారం తగ్గించి విద్యార్థులకు గుణాత్మక నైపుణ్య విద్యను అందించాలని విద్యాహక్కు చట్టం చెప్తున్నప్పట్టికి ప్రైవేట్ విద్యాసంస్థలు పట్టించుకున్న పాపాన కనిపించడం లేదు. పుస్తకాల భారం తగ్గించాలంటే 2006లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకువచ్చినప్పటికీ 2020లో స్కూల్ బ్యాగ్‌పాలసీ ద్వారా సూచించినప్పటికీ వాటిని అమలు చేయడం లేదు. విద్యార్థులకు అవసరం ఉన్నా లేకపోయినా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్దీ బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. పుస్తకాల సంచుల మోతతో పాటు పాఠశాలలో సరియైన సదుపాయాలు లేక పిల్లల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. పోటీ చదువుల పేరిట అటు తల్లిదండ్రులు ఇటు పాఠశాల యాజమాన్యాలు పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు. తద్వారా చిన్నారులు విద్యార్థి దశ నుంచి నడుము నొప్పి, కండరాల బలహీనత, మెడ భుజాలు భాగాలలో నొప్పి కలుగుతుంది. అలసటతో బడి నుంచి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి నీరసపడిపోతున్నారు. 10 శాతం బరువు కన్నా ఎక్కువ బరువును మోస్తే పిల్లల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. చిన్న వయస్సు పిల్లలు ఎక్కువ బరువు మోస్తే వారి వారి శరీరం దెబ్బతినే అవకాశం ఉంది. భుజాలు, మెడ,



నడుము భాగాలలో నొప్పికలుగుతుంది. నీరసంగా అనిపిస్తుంది. విసుగు, తలనొప్పి లాంటి సమస్యలు ఎదురవుతాయి. పిల్లలకు పుస్తకాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించిన విద్యాబోధన ఉండాలి. ఈ విషయంలో పాఠశాల యాజమాన్యాలు, అధికారులు, తల్లిదండ్రులు చొరవ చూపాలని డాక్టర్లు సైతం అభిప్రాయపడుతున్నారు. పిల్లలు మోయాల్సిన బరువు కంటే అధిక బరువు మోస్తే (వెన్నెముక్క ఒకవైపు వంగిపోవడం) వంటి ఇబ్బందులు వస్తాయి. మరో కారణంగా పాదంపై పట్టు మారుతుంది. నడక తీరు పట్టు తప్పుతుంది. తద్వారా పిల్లలు మానసిక సమస్యలు ఎదుర్కొంటారు. బ్యాగును ఒక వైపే తగిలించుకొని నడవడం కారణంగా భుజం, మెడ నొప్పి వస్తుంది. బ్యాగును నడుము కింద వరకు వేలాడుతూ ఉండి నడిస్తే నడుము దెబ్బతినే అవకాశం ఉంటుంది. పిల్లల బ్యాగుల బరువు తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల విపులు వంగిపోయేలా పుస్తకాల బరువు మోయడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతింటుంది. దీని గురించి చాలా సంవత్సరాలుగా చర్చ జరుగుతున్నప్పటికీ, ఇప్పటికీ ఎవరూ పెద్దగా పట్టించుకునే పరిస్థితిలో లేరని చెప్పవచ్చు. 2020 సంవత్సరంలో ప్రభుత్వం ఒక నూతన పాలసీకి శ్రీకారం చుట్టినా అది అమలుకు నోచుకోలేదు. ప్రతి నెల ఒకటవ, మూడవ శనివారం నోబ్యాగ్ డే పద్ధతిని అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ఇది ఎక్కడ అమలకు నోచుకున్న దాఖలాలు కనిపించడం లేదు. పాఠశాలలో అవసరం ఉన్న మేరకే పుస్తకాలు వినియోగించాలి. బడి సంచుల బరువు పై విద్యాశాఖ యంత్రాంగం నిరంతర నిఘా, పర్యవేక్షణ కొనసాగాలి. విద్యార్థుల బడి సంచుల బరువులని తనిఖీ చేసే ప్రక్రియతరచూ చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే పాఠశాలల యాజమాన్యాలపై అధికారులు తగిన చర్యలు తీసుకునే విధంగా కృషి చేయాలి. పిల్లల తల్లిదండ్రుల వైఖరి కూడా వింతగా ఉంటోంది. ఎక్కువ పుస్తకాలు ఇచ్చే పాఠశాల్లోనే చదువు బాగా చెబుతారని వారు నమ్మడంతో పాఠశాల యాజమాన్యం ఇదే అదునుగా భావించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజు విద్యార్థులు అన్ని పుస్తకాలు తీసుకెళ్లకుండా అవసరం మేరకే తీసుకెళ్లేలా పాఠశాలలో చర్యలు తీసుకోవాలి. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించేలా ఆయా పాఠశాలలో ర్యాక్స్ ఏర్పాటు చేసి బుక్స్ అన్ని పాఠశాలలో ఉంచుతూ హోంవర్క్ బుక్స్ మాత్రమే ఇంటికి తీసుకెళ్లా చర్యలు చేపడితే విద్యార్థులపై కొంత భారాన్ని తగ్గించవచ్చు. •

# తిరువతిరై వేడుకల్లో ప్రధానిమోడీ ప్రత్యేక పూజలు!



**అరియలూర్ (తమిళనాడు)జూలై 27:** చోళ చక్రవర్తి రాజేంద్ర చోళ జయంతి సందర్భంగా ఇవాళ తమిళనాడులో తిరువతిరై ఉత్సవం వైభవంగా సాగుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గంగైకొండ చోళపురం ఆలయంలో జరుగుతున్న ఈ ఉత్సవానికి హాజరయ్యారు. ప్రధాని సాంప్రదాయ దుస్తులైన తెల్లటి ధోతి, తెల్ల చొక్కా, మెడలో ధరించే అంగవస్త్రంతో ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలోని స్థానిక పండితులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

తమిళనాడులో తన రెండు రోజుల పర్యటన చివరి రోజున ఇవాళ, ప్రధానమంత్రి రాజేంద్ర చోళుడు ఆగ్నేయాసియాకు సముద్ర యాత్ర చేసి 1,000 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జరుగుతున్న స్మారక కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. గంగైకొండ చోళపురం ఆలయ నిర్మాణ ప్రారంభానికి గుర్తుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాజేంద్ర చోళ భారత చరిత్రలో అత్యంత శక్తివంతమైన, దార్శనిక పాలకులలో ఒకరు. అతని నాయకత్వంలో, చోళ సామ్రాజ్యం దక్షిణ ఇంకా ఆగ్నేయాసియా అంతటా విస్తరించింది. తన విజయ యాత్రల తర్వాత గంగైకొండ చోళపురాన్ని సామ్రాజ్య రాజధానిగా స్థాపించాడు. ఆయన అక్కడ నిర్మించిన ఆలయం 250 సంవత్సరాలకు పైగా శైవ భక్తి, స్మారకనిర్మాణం, పరిపాలనా నైపుణ్యానికి ప్రతీకగా ఉంది. ఈ ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా నిలుస్తోంది.

ఆలయంలోని శిల్పాలు, చోళ కాంస్యాలు, పురాతన శాసనాలకు ప్రసిద్ధి చెందాయి. ఇందులో భాగంగానే తిరువతిరై పండుగ కూడా గొప్ప తమిళ శైవ భక్తి సంప్రదాయానికి నిదర్శనగా పరిఢవిల్లుతోంది. అంతకుముందు, తమిళనాడులో రెండు రోజుల పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ తిరుచిరాపల్లి జిల్లాలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానికి ఘన స్వాగతం లభించింది. గంగైకొండ చోళపురం ఆలయానికి వస్తున్న క్రమంలోనూ ప్రధానికి తమిళనాడు ప్రజలు రోడ్ కు ఇరువైపులా నిల్చుని జయ జయ ధ్వానాలు చేశారు.



## నేను మాట్లాడిన తర్వాతే థాయిలాండ్ కాంబోడియా కాల్పుల విరమణ
### డొనాల్డ్ ట్రంప్ వెల్లడి

**వాషింగ్టన్,జూలై 27:** థాయ్‌ల్యాండ్, కంబోడియా నేతలు కాల్పుల విరమణపై చర్చలకు తక్షణమే అంగీకరించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. థాయిలాండ్‌తో యుద్ధాన్ని ఆపడానికి కంబోడియా ప్రధాని హున్ మానెట్‌తో ఫోన్లో మాట్లాడానని తన సోషల్‌మీడియా ట్రూత్‌లో వెల్లడించారు. వారు యుద్ధం కొనసాగిస్తే అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు దెబ్బతింటాయని హెచ్చరించినట్లు చెప్పారు. కాల్పుల విరమణ సహా ఘర్షణ ముగింపు కోసం థాయిలాండ్ తాత్కాలిక ప్రధాని వెచాయాచాయ్‌తోనూ మాట్లాడినట్లు ట్రంప్ చెప్పారు. వెచాయాచాయ్‌తో జరిగిన సంభాషణ చాలా బాగుందని ట్రంప్ తెలిపారు. కంబోడియాలాగే థాయిలాండ్ కూడా తక్షణ కాల్పుల విరమణ, శాంతిని కోరుకుంటుందని తెలిపారు. థాయిలాండ్ కంబోడియా సరిహద్దులో వరుసగా నాలుగు రోజుల పాటు జరిగిన ఘర్షణల వల్ల 33మంది మరణించారు. లక్షా 50 వేల మంది స్వస్థలాలను వదిలి మరో చోటుకి వెళ్లారు. థాయ్‌లాండ్‌కంబోడియా మధ్య కొన్నేళ్లుగా సాగుతున్న సరిహద్దు వివాదం ఇటీవల తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ఇరుదేశాలకు చెందిన సైన్యాలు పరస్పరం దాడులుచేసుకుంటున్నాయి. అయితే, సైనికులు, ఆయుధాలను సరిహద్దులకు తరలిస్తూ థాయ్‌లాండ్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని కంబోడియా సైన్యం ఆరోపించింది. యుద్ధ సన్నద్ధతను ప్రదర్శిస్తూ రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడింది. థాయ్‌లాండ్ చర్యలను అంతర్జాతీయ సమాజం ఖండించాలని కోరింది. థాయ్‌లాండ్ మాత్రం భిన్నంగా స్పందించింది. కంబోడియాతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించింది. అయితే సరిహద్దుల్లో దుందుడుకు చర్యలకు కంబోడియా స్వస్తి పలికాలని షరతు విధించింది. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి పాత పాటే పాడారు. భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని విజయవంతంగా ఆపానని మళ్లీ చెప్పారు. కంబోడియా, థాయ్‌లాండ్ మధ్య ఘర్షణ వాతావరణం నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్ మధ్య వాణిజ్యం ఆధారంగా యుద్ధాన్ని ఆపానని ట్రంప్ ఇప్పటికే పలుమార్లు చెబుతూనే వచ్చారు. భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణలో 5 యుద్ధ ఫైటర్ జెట్లు కూలిపోయాయని తెలిపారు. ఈ యుద్ధాన్ని తానే ఆపానని, లేకపోతే అణు యుద్ధంగా మారేదేమో అని అన్నారు.

## ఆస్ట్రేలియాలో మరో భారతీయ విద్యార్థిపై కత్తితో దాడి
### తెగిపడిన చేయి

**కాన్‌బెర్రా, జూలై 27:** ఆస్ట్రేలియాలో భారత సంతతి పౌరులపై వరుస దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ఓ భారత విద్యార్థిపై దుండగులు తీవ్రంగా దాడి చేసిన ఘటన మరవకముందే మరో భారత విద్యార్థిపై కత్తితో దాడి చేసినఘటన వెలుగులోకి వచ్చింది. మెల్‌బోర్న్‌లో ఉంటున్న భారత విద్యార్థి సౌరభ్ ఆనంద్ ఇటీవల ఓ ఫార్మసీ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలోన దుండగులు అతడిపై కత్తితో దాడి చేసి.. తీవ్రంగా గాయపరిచినట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో సౌరభ్ మెడ, తలకు తీవ్రగాయాలు కాగా.. చేయి తెగిపడింది.

సౌరభ్ ఆనంద్ ఆల్టోనా మెడోస్‌లోని ఓ ఫార్మసీ నుంచి మందులు తీసుకొని ఫోన్‌లో మాట్లాడుతూ ఇంటికి వెళ్తున్నాడు. ఆ సమయంలో ఐదుగురు యువకుల బృందం అతడిపై కత్తితో దాడి చేసింది. వారి సౌరభ్ మెడ నరకడానికి ప్రయత్నించగా.. అతడు తీవ్రంగా ప్రతిఘటించాడు. ఆ సమయంలో అతడి చేతిలోకి కత్తి దూసుకుపోయింది. అనంతరం శరీరంలోని పలుచోట్ల కత్తులతో తీవ్రంగా గాయపరిచి నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారని.. తెగిపడిన చేతిని వైద్యులు మళ్లీ అతికించారని పోలీసులు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన ఐదుగురు యువకుల్లో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల ఆస్ట్రేలియాలో భారతీయ విద్యార్థి చరణ్‌ప్రీత్ సింగ్‌పై దుండగులు దాడికి పాల్పడ్డారు. పదునైన వస్తువులతో కొడుతూ.. అతడిని దూషించారు. ఈ ఘటనలో చరణ్ ముఖం, వెనక భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని స్థానికులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించారు. జాత్యంహంకారం కారణంగానే భారత విద్యార్థిపై దాడులకు పాల్పడ్డారని పలు మీడియా వర్గాలు వెల్లడించాయి.

## ఆపరేషన్ సింధూర్‌పై నేటినుంచే లోక్‌సభలో చర్చ

**న్యూఢిల్లీ,జూలై 27:** ఆపరేషన్ సింధూర్‌పై సోమవారం నుంచి చర్చ జరగనుంది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. లోక్‌సభలో ఆపరేషన్ సింధూర్‌పై చర్చ కోసం కేంద్రం ఏకంగా 16 గంటల సమయం కేటాయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో ఈ చర్చ జరగనుంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించనున్నారు. రాజ్యసభలోకూడా ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరగనుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాజ్యసభలో ఈనెల 29 నుంచి 9 గంటలపాటు దీనిపై చర్చ జరుపనున్నట్లు వెల్లడించింది. రెండు సభల్లోనూ చర్చకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానం ఇస్తారు. కాగా ఆపరేషన్ సింధూర్‌పై చర్చకు విపక్షాలు ఎప్పటి నుంచో పట్టుపడుతున్నాయి. భారత్, పాక్ మధ్యతానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదేకామెంట్స్ చేస్తుండటంపై కేంద్ర జవాబు చెప్పాలని రాహుల్ డిమాండ్ చేస్తున్నారు.

## రాజ్యాంగ హక్కులపై పౌరులకు అవగాహన కల్పించాలి
### సిజెఐ బిఆర్ గవాయ్

**శ్రీనగర్, జూలై 27:** హక్కులపై అవగాహన లేకపోతే ఎటువంటి ఉపయోగం లేదని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పేర్కొన్నారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సమావేశంలో సిజెఐ ప్రసంగిస్తూ.. దేశంలోని పౌరులకు రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కులపై అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

గతంలో ఉన్నట్లుగా ఎటువంటి విభేదాలు లేకుండా అన్నివర్గాలు సామరస్యంగా జీవించే పాత కాశ్మీర్‌ను పునరుద్ధరించుకో వాల్సిన అవసరం ఉందన్నారు. గత 35 యేళ్లుగా కాశ్మీర్‌లోని పరిస్థితుల్లో చాలా మార్పులు, లోపాలు తలెత్తాయని.. వాటిని తొలగించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని న్యాయవాదులకు సూచించారు. ఎటువంటి సవాళ్లు ఎదురైనప్పటికీ వెనకడుగు వేయొద్దని పేర్కొన్నారు.

## మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట
### ఆరుగురు మృతి, అనేకమందికి గాయాలు



**హరిద్వార్, జూలై 27:** ఉత్తరాఖండ్ హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయానికి వెళ్లే మార్గంలో తొక్కిసలాట జరిగింది. దీంతో ఆరుగురు భక్తులు మరణించారు. అనేక మంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలికి చేరుకున్నారు. గాయపడిన వారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే విద్యుద్ఘాతం జరుగుతుందనే పుకారువల్లే తొక్కిసలాటకు దారి తీసిందని అధికారులు తెలిపారు. ఆలయాన్ని కూడా మూసివేసినట్లు చెప్పారు. భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరగడంతోనే ఇలాజరిగిందని, సహాయక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

అయితే జులై 23వ తేదీన మాస శివరాత్రి జలాభిషేకం తర్వాత, లక్షలాది మంది కన్వర్ యాత్రికులు, సామాన్య ప్రజలు ఇప్పటికీ హరిద్వార్‌కు చేరుకున్నారు. శనీ,ఆదివారాలు కారణంగా పెద్ద సంఖ్యలో విచ్చేశారు. దీంతో భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరగడంతోనే తొక్కిసలాట జరిగిందని సమాచారం. ఘటనలో గర్హ్వాల్ పోలీస్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ఆరుగురు మరణించినట్లు ధ్రువీకరించారు. దాదాపు 35 మంది గాయపడిన వారిని ఆసుపత్రిలో చేర్చామని ఎస్ఎస్పీ ప్రమేంద్ర సింగ్ దోబాల్ వెల్లడించారు. ప్రస్తుతం వారంతా చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. అయితే ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో తొక్కిసలాట జరిగినట్లు సమాచారం అందిందని హరిద్వార్ జిల్లా మేజిస్ట్రేట్ మయూర్ దీక్షిత్ తెలిపారు. దర్యాప్తు తర్వాత మరింత సమాచారం తెలియజేస్తామని అన్నారు. అకస్మాత్తుగా పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడడం వల్ల తొక్కిసలాట జరిగిందని గాయపడిన వారిలో ఓ వ్యక్తి తెలిపారు.

ఆ సమయంలో తాను పడిపోయానని, చేయి విరిగిందని చెప్పారు. ఆలయ ప్రాంగణానికి కేవలం 2025 మెట్ల ముందు భక్తులను అదుపు చేయడానికి ఎవరు లేరని మరో బాధితుడు తెలిపారు. తాను 10-12 మందితో పాటు కింద పడిపోయానని చెప్పారు. మరోవైపు, తొక్కిసలాట కారణంగా ప్రాణనష్టం సంభవించిన నేపథ్యంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా స్పందించారు. హరిద్వార్‌లోని మానసా దేవి ఆలయం వద్ద తొక్కిసలాట జరిగినట్లు విచారకరమైన వార్తలు అందాయి. స్థానిక పోలీసుల, ఇతర రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకునిసహాయ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నాయి.ఆ విషయంలో నేను నిరంతరం స్థానిక పరిపాలనతో సంప్రదిస్తున్నాను.

పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాను. భక్తులందరి భద్రత కోసం నేను మాతా రాణిని ప్రార్థిస్తున్నానంటూ సీఎం పోస్ట్ చేశారు. ఒక పుకారు కారణంగా మానసాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 6 మంది మరణించారు మరియు అనేక మంది గాయపడ్డారు. దురదృష్టకర ఘటన జరిగింది. మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించా. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గాయపడిన వారికి సహాయం చేయడానికి అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50వేలు ఎక్స్‌గ్రేషియా అందించనున్నామని చెప్పారు.

## అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో..
# తెలుగు బాలుడు దుర్మరణం!
### సైక్లింగ్‌కు వెళ్లిన బాలుడిని ఢీకొన్న ట్రాలీ ట్రక్కు

**వాషింగ్టన్, జూలై 27:** తొమ్మిదేళ్ల బాలుడు రోడ్డుప్రమాదంలో మృతి చెందడంతో అమెరికాలో ఉంటున్న ఓ తెలుగు కుటుంబంలో విషాదం నెలకొంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్లకు చెందిన తుర్లపాటి శ్రీనివాసరావు కుటుంబం అమెరికాలోని మిసోరి రాష్ట్రం జెఫర్‌సర్ సిటీలో ఉంటోంది.

శ్రీనివాసరావు ఈ నెల 24న సాయంత్రం 7 గంటలకు (అమెరికా కాలమానం ప్రకారం) తన చిన్నకుమారుడు యత్విక్‌సాయి (9)తో కలిసి సైక్లింగ్‌కు వెళ్లారు. శ్రీనివాసరావు సైకిల్‌పై ముందు వెళుతుండగా.. వెనుక యత్విక్‌సాయి తన స్నేహితులతో కలిసి సైకిల్ తొక్కుతూ వెళుతున్నాడు. ఆ సమయంలో ఓ రోడ్డు మలుపులో చెట్లు అడ్డుగా ఉండటంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు కనిపించలేదు. వేగంగా వచ్చిన ఓ ట్రాలీ ట్రక్కు బాలుడిని ఢీకొట్టి కొంత దూరం ఈడ్చుకెళ్లింది.

ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యత్విక్ సాయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. శుక్రవారం బాలుడికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇక, బాలుడి మృతి సమాచారంతో ముప్పాళ్ల గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మనవడి మరణవార్త తెలుసుకున్న నాయనమ్మ విజయ గుండెలవిసెలా రోదిస్తున్న తీరు అక్కడి వారిని తీవ్రంగా కలిచివేసింది.

## ఎన్నికల్లో గణనీయంగా ఓట్లు చీలుస్తాం
### సర్కారు ఏర్పాటు నిర్ణయించేది మేమే...
### జన్‌సురాజ్‌పార్టీ అధినేత ప్రశాంత్‌కిశోర్



**పాట్నా, జూలై 27:** ఈ ఏడాది చివర్లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో పార్టీల ప్రచార వేడి క్రమంగా పెరుగుతోంది. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్తగా పేరుతెచ్చుకుని కొద్దికాలం క్రితం రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ప్రశాంత్ కిషోర్ తన రాజకీయ పార్టీ జన్ సురాజ్‌పై గట్టి అంచనాలే పెట్టుకున్నారు. తాజాగా ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ జన్ సురాజ్‌ను ఓట్లను చీల్చే పార్టీగా అభివర్ణించారు. కానీ ఇందులో ఒక ట్విస్ట్ కూడా ఉంటుందన్నారు. జన్ సురాజ్ ఓట్లను చీల్చే పార్టీ. కానీ మేము చాలా ఓట్లు చీల్చుకుంటాం అంతిమంగా ఎన్నికల్లో గెలుస్తాం అని ప్రశాంత్ కిషోర్ తెలిపారు. తమ పార్టీ రాష్ట్ర రాజకీయ డైనమిక్స్‌లో గణనీయంగా మార్పులు తీసుకువస్తుందని చెప్పారు. జన్ సురాజ్ ప్రభావంతో చిన్న పార్టీల వర్కర్లు, సపోర్ట్ బేస్ ఇప్పటికే తమ క్యాంపులోకి వచ్చేసిందని, చిన్న పార్టీలు ఉనికి కోల్పోయినందున వాటి గురించి ప్రజలు చర్చించుకోవడం మానేశారని అన్నారు. ప్రస్తుతం బీహార్‌లో రాజకీయ సంభాషణలన్నీ ఆర్జేడీ సారథ్యంలోని కూటమి, బిజెపి,జేడీయూ కూటమి, జన్ సురాజ్ చుట్టూనే నడుస్తున్నాయని తెలిపారు. రెండో దెబ్బ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జేడీయూపై పడుతుందని, జేడీయూ కార్యకర్తలు, మద్దతుదారులు, ఓటర్లు పెద్ద సంఖ్యలో జన్ సురాజ్ వైపు మళ్లుతున్నారని ప్రశాంత్ కిషోర్ చెప్పారు. జన్ సురాజ్ ఊపు ఇదేవిధంగా కొనసాగితే మూడో దెబ్బ బిజెపిపై పడుతుందని అన్నారు. రెండు రకాల బిజెపి మద్దతుదారులు జన్‌సురాజ్ వైపు మొగ్గు చూపుతున్నారని, నాయకత్వంపైన, లోకల్ స్థాయిలో పనితీరుపై భ్రమలు తొలగిపోయిన వారు, పైస్థాయిలో మోడీ బాగా పనిచేస్తున్నప్పటికీ రాష్ట్ర స్థాయిలో వైవిధ్యం కోరుకుంటున్న వారు ఈ జాబితాలోకి వస్తారని చెప్పారు.

ముస్లిం ఓటు బ్యాంకు సంప్రదాయంగా లాలూ ఆర్జెడీకి విధేయంగా ఉంటుందని, 30 ఏళ్లుగా ఇదే జరుగుతోందని, అయితే వారంతా ఇప్పుడు తమ వైపు మళ్లే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రశాంత్ కిషోర్ తీసుకువచ్చిన జన్ సురాజ్ ఉద్యమం రాష్ట్ర ప్రజలను ఆకర్షించిందనే చెప్పాలి. అయితే, ఇదంతా ఓట్లుగా మార్చుకోగలదా ఆనే ప్రశ్న కూడా ఉంది. ప్రశాంత్ కిషోర్ నిజాయితీ, అట్టడుగు స్థాయి నుంచి చేపడుతున్న ప్రచారం బీహార్ రాజకీయాలపై ఏమేరకు ప్రభావం చూపనుందనే చర్చ కూడా జరుగుతోంది. ఆర్జేడీ సారథ్యంలోని మహాఘట్‌బంధన్, ఎన్డీయే కూటమి మధ్య పొత్తులు ఖరారై పోటీ రెండు కూటముల మధ్యే ఉంటుందని అనుకుంటున్న తరుణంలో జన్ సురాజ్ తెరపైకి వచ్చింది. దీంతో ప్రధాన పార్టీల సంప్రదాయ ఓట్ బ్యాంకును ఆ పార్టీ ఏమేరకు గండికొట్టనుందనేది ఆసక్తికరంగా మారుతోంది.

## మహిళల పథకంలో మగాళ్లూ లబ్ధిదారులే!
### ఫోర్‌వీలర్ యజమానులు కూడా..
### కోట్లల్లో స్కీం సొమ్ముకొల్లగొట్టిన ఘనాపాటీలు
### ఆటకట్టించిన మహిళా శిశుసంక్షేమశాఖ



**భోపాల్,జూలై 27:** మహిళలకోసం ప్రవేశపెట్టిన పథకంలో లబ్దిదారులుగా మగరాయుళ్లు చేరిపోయారు. పథకం ప్రారంభించిన తర్వాత ఇప్పటివరకూ రూ.21.44కోట్ల నగదు వీరి ఖాతాల్లోకి బదలీఅయింది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థను తప్పుదారి పట్టించి మహిళలుగా తమ పేర్లనమోదుచేసుకున్నారు. సుమారుగా పది నెలల తర్వాతకానీ అధికారులు ఈ విషయం గుర్తించలేదు. వెంటనే పసిగట్టి అధికారులు వీరిపేర్లను తొలగించారు. కొన్ని కుటుంబాల్లో ముగ్గురుకూడా రిజిస్టర్ అయ్యారు. దీనివల్ల ప్రభుత్వానికి 1196 కోట్ల నష్టం వాటిల్లింది. గరిష్టపరిమితి వయసు 65 ఏళ్లుగాపెట్టినా అంతకుపైబడిన 2.87 లక్షలమంది మహిళలకు లబ్దిచేకూరినట్లు తేల్చారు. దీనివల్ల మరో 431.7 కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఫోర్‌వీలర్ ఉన్న 1.62 లక్షలమంది మహిళలు కూడా లబ్దిదారుల్లో ఉన్నారు. వీరిపై సమగ్ర దర్యాప్తు చేస్తామని డిప్యూటి సిఎం అజిత్‌పవార్ అన్నారు.

మహారాష్ట్రలో బిజెపి సర్కారుప్రవేశపెట్టిన ఈ పథకం వల్లనే బిజెపి భారీ విజయం సాధించింది. అంతేకాకుండా ఈపథకం ఓటుబ్యాంకును పెంచింది. దీనితో తక్కువ ఆదాయం కలిగిన మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం 'లడ్కీ బెహన్ యోజన' స్కీమ్ ప్రవేశపెట్టినప్పటినుంచి ఇప్పటికీ కొనసాగుతోంది.

ఈపథకం కింద అర్హులైన మహిళలకు నెలకు 1500 రూపాయలు అందిస్తోంది. 21 నుంచి 65 సంవత్సరాల వయసు కలిగిన వారికి ఆర్థిక సాయం చేస్తోంది. మహారాష్ట్రలో మహాయుతి కూటమి అధికారంలోకి రావడానికి ఈ పథకం కూడా ఓ కారణం. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం కారణంగా ప్రభుత్వం విమర్శల పాలు అవుతోంది. ప్రభుత్వం మీద ఏకంగా భారీగా ఆర్థిక భారం పడుతోంది. లడ్కీ బెహన్ యోజన కింద ప్రభుత్వం 24.1 మిలియన్ మంది అర్హులైన ఆడవారికి వారికి 3,700 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. గత సంవత్సరం 1,640 కోట్లు ఖర్చు అయ్యాయి. అయితే, 24.1 మిలియన్లలో ఐదు లక్షల మంది అనర్హుల్ని ప్రభుత్వం గుర్తించింది. సాధారణంగా ఇంట్లో ఒక మహిళ ఉంటే 1500 రూపాయలు వస్తాయి. అదే ఇద్దరు ఉంటే 3000 వేలు వస్తాయి. ఇలా ఎంత మంది ఉంటే అన్ని 1500 రూపాయలు వస్తాయి.

ఇంట్లో ఒకరి కంటే ఎక్కువ మంది ఆడవాళ్లు ఉండటం వల్ల అదనంగా 1,196 కోట్ల రూపాయలు ఖర్చయింది. అయితే మహిళలకోసం ప్రవేశపెట్టిన ఈ స్కీముకు మగాళ్లు కూడా అప్లై చేసుకున్నారు. ఫేక్ ఐడీలు సృష్టించి పథకానికి అర్హత పొందారు. దాదాపు 14,298 మంది మగాళ్లు ఫేక్ గుర్తింపుతో ఈ పథకం కింద ఆర్థికసాయం పొందారు. ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 10 నెలల పాటు ప్రతీ నెలా 1500 రూపాయలు పొందారు. వీరి కారణంగా ప్రభుత్వానికి 21.44 కోట్లు అదనంగా ఖర్చు అయింది. పది నెలల తర్వాత 'ది ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్' ఆ 14 వేల మంది గుట్టురట్టయింది. వారిని పథకం నుంచి తొలగించారు.

# సంక్షిప్తంగా..

## పాఠ్యాంశంగా ఆపరేషన్ సిందూర్




**న్యూఢిల్లీ,జూలై 27:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' వివరాలను స్కూల్ పుస్తకాల్లో పాఠ్యాంశంగా చేర్చాలని కేంద్రం నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గతంలోనే ప్రకటించారు. తాజాగా ఈ విషయంపై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎన్‌సిఇఆర్‌టి)' స్పందించింది. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే ఉద్దేశంతో ఆపరేషన్ సిందూర్‌ను సిలబస్‌లో చేర్చుతున్నట్లు ఎన్‌సిఇఆర్టీ తెలిపింది. పిల్లలకు జాతీయ భద్రత, సైనిక వ్యూహం, దౌత్యం ప్రాముఖ్యతను బోధించడమే ఈ నిర్ణయం వెనకున్న లక్ష్యమని తెలిపింది. ఇందుకోసం ఎన్‌సిఇఆర్టీ ప్రత్యేక మాడ్యూల్‌ను సిద్ధం చేసింది. ఈ మాడ్యూల్ రెండు భాగాలుగా విభజిస్తారు. ఒకటి 3-8 తరగతుల విద్యార్థుల కోసం, మరొకటి 9 నుంచి 12 తరగతుల విద్యార్థుల కోసం రూపొందిస్తారు. ఆదిత్య ఎల్1 చంద్రయాన్ అంతరిక్ష మిషన్‌లు, ఇటీవల శుభాన్షు శుక్లా 'అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)'కు వెళ్లిన అంశాలను కొత్త సిలబస్‌లో చేర్చనున్నట్లు అధికారులు తెలిపారు.

## పాఠశాల భవనం పైనుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య

**అహ్మదాబాద్, జులై 27:** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లోని నవరంగ్‌పురా ప్రాంతంలోని సోమ్ లలిత్ ప్రైవేట్ స్కూల్‌లో ఒక విద్యార్థిని హఠాత్తుగా స్కూలుభవనం 4వ అంతస్తుపైనుంచి పడి చనిపోవడం కలకలం రేపింది. పాఠశాలలోని సిసిటివి ఫుటేజ్ ప్రకారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈ వీడియో.. విద్యార్థిని నాలుగో అంతస్తు లాబీలో కీ రింగ్ చేతి వేలితో తిప్పుతూ నడుచుకుంటూ వెళ్లడం కనిపిస్తోంది. ఆ తర్వాత అకస్మాత్తుగా విద్యార్థిని రైలింగ్‌పైకి ఎక్కి కిందకి దూకేసింది. గమనించిన తోటి విద్యార్థులు పరుగున బాలికను పట్టుకునేందుకు వచ్చారు. కానీ అప్పటికే ఆలస్యమైంది. పై నుంచి దూకడంతో విద్యార్థిని తలకు బలమైన గాయం తగిలింది. చేతులు, కాళ్ళ ఎముకలు విరిగిపోయాయి. వెంటనే స్కూల్ యాజమన్యం బాలికను సమీపంలోని నిధి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్న బాలికను ఆమె తల్లిదండ్రులు తల్తేజ్‌లోని మరొక ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ బాలిక మరణించింది.

## భర్తప్రాణం తీసిన వివాహేతర సంబంధం!

**పాట్నా,జూలై 27:** బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో ఓ దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ముఫాసిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లగునియా రఘుకాంత్ గ్రామంలో 30 ఏళ్ల సోను కుమార్ తన ఇంట్లో రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. అతడి భార్య స్మితా ఝానే ఈ హత్య చేసిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా అనుమానంతో స్మితను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. సోను తండ్రి టుంటున్ ఝా మీడియాతో మాట్లాడుతూ సోను, స్మితలకు ఆరేళ్ల క్రితం వివాహం జరిగిందని, వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారని చెప్పారు. అదే గ్రామానికి చెందిన హరిఓమ్ కుమార్ పిల్లలకు ట్యూషన్ చెప్పడానికి వారి ఇంటికి వచ్చేవాడని, తన భార్య ట్యూటర్‌తో అభ్యంతరకర స్థితిలో ఉండగా చూసినట్టు నా కొడుకు చెప్పాడని టుంటున్ ఝా పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత కొంతకాలం ట్యూటర్ రావడం మానేసినట్టు తెలిసింది. అయితే, సోను అన్నయ్య పిల్లలకు ట్యూషన్ చెప్పడానికి ట్యూటర్ తిరిగి రావడంతో మళ్లీ ఆ దంపతుల మధ్య కలతలు మొదలయ్యాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

## చిన్నస్వామి తొక్కిసలాటలో చిన్నారి ఆభరణాలు మిస్!

**బెంగళూరు,జూలై 27:** ఆర్సీబీ ఐపీఎల్ 2025 టైటిల్ విజయోత్సవాల సందర్భంగా జూన్ 4న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన 13 ఏళ్ల బాలిక దివ్యాంశి మృతదేహం నుంచి రూ. లక్ష విలువైన ఆభరణాలు చోరీకి గురైనట్టు ఆమె తల్లి ఆరోపించింది. దివ్యాంశి తల్లి అశ్విని శివకుమార్ (35) కమర్షియల్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. అశ్విని శివకుమార్ ఫిర్యాదు ప్రకారం జూన్ 4 సాయంత్రం దివ్యాంశి మృతదేహాన్ని బౌరింగ్ అండ్ లేడీ కర్జన్ ఆస్పత్రి మార్చురీకి తరలించినప్పుడు ఆమె శరీరంపై 6 గ్రాముల బంగారు చెవిపోగులు, 56 గ్రాముల బంగారు గొలుసు ఉన్నాయి. అయితే, శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించినప్పుడు ఈ ఆభరణాలు పూర్తిగా మాయమయ్యాయి.

# ఎల్ఆర్ఎస్‌కు మార్గదర్శకాలు జారీ

**విజయవాడ,జూలై27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అనుమతులు తీసుకోకుండా వేసిన లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) మినహా ఇతర పుర,నగరపాలక సంస్థలు,పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలో వేసిన అనధికార లేఅవుట్లకు ఈ పథకం వర్తించనుంది. ఈమేరకు మార్గదర్శకాలు పేర్కొంటూ పురపాలక,పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు. ఈ ఏడాది జూన్ 30కి ముందు వేసిన లే అవుట్లను ఈ పథకం క్రింద క్రమబద్ధీకరించనున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 18 వేల ఎకరాల్లో వేసిన లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి సంబంధించిన పోర్టల్ ఆగస్టు ఒకటో తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. 2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్‌లో నిర్ధేశించిన బేసిక్ ధరలనే ఇప్పుడు కూడ నిర్ణయించారు. నిర్ధేశించిన విలువను స్థానిక సబ్ రిజిస్ట్రార్ ధరలతో పోలుస్తారు.

ఒకవేళ నిర్ధేశించిన ధర ఎక్కువగా ఉంటే సబ్ రిజిస్ట్రార్ విలువను పరిగణనలోకి తీసుకుంటారు. తక్కువగా ఉంటే ఎల్ఆర్ఎస్‌లో నిర్ణయించిన ధర వసూలు చేస్తారు.




# కాణిపాకం ఆలయానికి రూ.3 లక్షలు విరాళం

**కాణిపాకం, జులై 27 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఇద్దరు భక్తులు 3 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ మేరకు దేవస్థానంలో అమలు జరుగుతున్న శాశ్వత నిత్యన్నదాన పథకానికి తిరుపతికి చెందిన కృష్ణమోహన్, పార్థసారధి నాయుడులు 2,01,116 రూపాయలను డిడి రూపలో విరాళంగా అందజేశారు.

అలాగే బెంగళూరుకు చెందిన పుష్పలత, శివప్రసాద్ దంపతులు శ్రీ సిద్ధి వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు 1,00,016 రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తంను దాతలు కుటుంబసభ్యులతో కలిసి ఆలయ సూపరిటెండెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజీలకు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జెఎన్‌టియుఏ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి, గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు

# ఎస్ఆర్ఐటి కళాశాల నుంచి విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన అడుగులు

## ఘనంగా 3వ గ్రాడ్యుయేషన్ డే, ముఖ్య అతిథులుగా హాజరైన జెఎన్‌టియుఏ ప్రొఫెసర్లు కె.హేమచంద్రారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి

**శింగనమల, జులై 27 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయ సముద్రం మండల పరిధిలో ఉన్న ఎస్ఆర్ఐటి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం 3వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమానికి జెఎన్‌టియు మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్, రాష్ట్రమాజీ ఉన్నత విద్యా మండలి అధ్యక్షులు కె.హేమచంద్రారెడ్డి, మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వేణుగోపాల్‌రెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డిలు హాజరయ్యారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 620 మంది విద్యార్థులకు ప్రొఫెషనల్ సర్టిఫికెట్లు అందజేశారు.

**ఉన్ననత లక్ష్యాలవైపు నడిపిస్తున్న ఎస్ఆర్ఐటి : ప్రొ.హేమచంద్రారెడ్డి :** 2008లో స్థాపితమైన ఎస్ఆర్ ఐటి కళాశాల నాణ్యమైన విద్యను లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం అభివృద్ధి చెందుతోందని ప్రొ.హేమచంద్రారెడ్డి అన్నారు. విద్య నాణ్యత ప్రమాణాలతో అందిస్తూ జిల్లాలో ప్రథమ ఇంజినీరింగ్ కళాశాలగా ఎస్ఆర్ఐటి నిలిచిందన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. విద్యను అందించి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడం అనేది భగవంతుడు ఇచ్చిన గొప్ప వరమన్నారు. ఈ సారి గ్రాడు య్యేషన్ పూర్తి చేసిన 620 మందిలో 430 మంది విద్యార్థులు ప్రముఖ ఎంఎన్‌సి కంపెనీలలో ఉద్యోగాలు పొందారని తెలిపారు. టిసిఎస్ కంపెనీలో 165 మందికి 4 నుంచి 9 లక్షల వరకు వార్షిక ప్యాకేజీతో ఉద్యోగాలు లభించాయన్నారు. జెఎన్‌టియు ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ..పిల్లలకు మంచి విద్యను అందిస్తూ విద్యా రంగంలోనూ, ఉద్యోగాల కల్పనలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలుస్తున్న ఎస్ఆర్ఐటి కళాశాల యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.బాలకృష్ణ, వైస్ చైర్మన్ డా.రంజిత్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగుల సమస్యలపై సిఎస్‌కు వినతి




సమావేశంలో ప్రసంగిస్తున్న కెఆర్ సూర్యనారాయణ

**విజయవాడ, జూలై 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలకు సంబంధించి వినతిపత్రాని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు సమర్పించారు. జూన్5న జరిగిన ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో ఎన్నికైన కార్యవర్గసభ్యులు, రాష్ట్ర అధ్యక్షులు ఆదివారం విజయవాడలో సమావేశమై ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై చర్చించి, ప్రధాన అంశాలపై వినతిని అందించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కెఆర్ సూర్యనారాయణ మాట్లాడుతూ టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖలో పాలిటెక్నిక్ శాఖలో పనిచేసే టీచింగ్, అండ్ అకాడమిక్ స్టాఫ్ ఉద్యోగులకు ఏఐసిటిఇ నిబంధనల మేరకు 2016 పేస్కేల్స్‌ను అమలు చేసిన వేతన బకాయిలు ప్రభుత్వంలో పెండింగ్ వున్న రు.191.13 కోట్లు తక్షణం విడుదల చేయాలని కోరారు. ఏఐఐఎంస్ మంగళగిరిలో ఈహెచ్‌ఎస్ పథకం కింద ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సదుపాయం కోసం ప్రత్యేక ఏర్పాటు చేసేలా సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులతో ప్రభుత్వం తరపను మాట్లాడాలని కోరారు. ఏపిలో గుర్తింపు సంఘాల వ్యవస్థను క్రమబద్ధీకరించి రెండేళ్ళకోసారి ఎన్నికలు నిర్వహించటం, అందుకోసం ఏపి సివిల్ సర్వీస్ జాయింట్‌స్టాఫ్ కౌన్సిల్ సభ్యులైన ప్రభుత్వ ప్రతినిథులు, ఉద్యోగ సంఘ ప్రతినిథులతో ఒక జాయింట్ వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర స్థాయి సివిల సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సెల్ గత కొన్నేళ్ళుగా జరగలేదని త్వరలో ఏర్పాటు చేయాలని కోరామని దీనికి సానుకూల స్పందన లభించిందన్నారు. కార్యక్రమం లో సంఘ ప్రధాన కార్యదర్శి ఎం రమేష్‌కుమార్, సహ అధ్యక్షులు బి సుగున, ఉపాధ్యక్షులు కె రాజ్‌కుమార్, ఎన్ లక్ష్మీపతి, తదితర నేతలు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి ఎడ్ల విజేత చాముండేశ్వరి సీ ఫుడ్స్ జట్టు

**కోవూరు (నెల్లూరు), జూలై 27, ప్రభాతవార్త :** కోవూరులో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గంగపట్నంకు చెందిన చాముండేశ్వరి సీ ఫుడ్స్ జట్టు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. ప్రథమ స్థానం పొందిన ఈ జట్టుకు రూ.20,116 లతో పాటు వెండి కప్పును కూడా అందజేశారు. బాపట్ల జిల్లాకు చెందిన నలమోతు గోపీకృష్ణ జట్టు ద్వితీయ స్థానం, మినగల్లు గ్రామానికి చెందిన మోచర్ల పార్ధు ఎడ్ల జట్టు తృతీయ స్థానం, సౌత్ మోపూరు, మోపూరమ్మ తల్లి ఎడ్ల జట్టు నాల్గవ స్థానం, అల్లూరుకు చెందిన జరుగుమల్లి మోహన్‌కు చెందిన ఎడ్ల జట్టు ఐదవ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఊహించని రీతిలో ప్రేక్షకులు హాజరుకావటంతో నిర్వాహక కమిటీ సభ్యులు ఎం. ప్రేమ్‌కుమార్, బాబు, టి. శ్రీనివాసులు సురేష్, ఆనందంతో పొంగిపోయారు.

## రైల్వేకోడూరు నియోజక వర్గానికి

# సోమశిల వెనుక జలాలు అందించాలి

### మంత్రి నిమ్మలతో కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి




మంగంపేట సుపరిపాలలో తొలి అడుగులో పాల్గొన్న మంత్రి రామానాయుడు, కూడా చైర్మన్ రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే శ్రీధర్, రూపానంద రెడ్డి నివాసంలో మంత్రి

**రాజంపేట, జూలై 27 ప్రభాతవార్త:** రైల్వే కోడూరు నియోజకవర్గంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా లేదని, వర్షాధారంతోనే నీటి వనరులు నిండాల్సిన పరిస్థితి ఉందని, నియోజకవర్గంలోనే ఉన్న సోమశిల వెనుక జలాలు నియోజకవర్గానికి మళ్లించి సస్యశ్యామలం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రైల్వేకోడూరు టిడిపి ఇంచార్జ్, కడప అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ ముఖరూపానంద రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం మంత్రి రైల్వేకోడూరు నియోజవర్గంలో పర్యటించారు. ఓబులవారిపల్లి మండలం మంగంపేటలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడుకి రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జ కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి , సతీమణి ముక్కా వరలక్ష్మి ఎమ్మెల్యే అరవ శ్రీనివాసులు, డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రికి రూపానంద్ రెడ్డి ఆధ్వర్యంలో క్రేన్ సాయంతో గజమాలలు వేసి, ఘనంగా స్వాగతం పలికారు. ఈసం దర్భంగా మంత్రితో రూపానంద రెడ్డి మాట్లా డుతూ సోమశిల వెనుక జలాలు పెనగలూరు మండలంలో నిల్వ ఉంటాయని తెలిపారు. వెనుక జలాలను ఎత్తిపోతల పథకం ద్వారా నియోజ కవర్గ వ్యాప్తంగా చెరువులకు ఇచ్చినట్లయితే సాగునీటి సమస్య లేకుండా పోతుందని మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. మంగంపేటలో ఇంటింటికి వెళ్లి ప్రజ లను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. వారి సమస్యలు తెలుసుకుని, గతంలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల స్పందనను తెలుసు కున్నారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, ఇది ప్రజలు కూటమి పై చూపుతున్న నమ్మకాన్ని నిలుపుకునేందుకు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. ప్రజల ఆశయాలను నెరవేర్చడమే మా బాధ్యత అని పేర్కొన్నారు.ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ప్రజల ప్రేమ, ఆదరణే మాకు బలమని, ఈ రోజు మీరు ఇచ్చిన గౌరవం మా బాధ్యతను మరింత పెంచిందని, ప్రజల మధ్యకి వచ్చి, ప్రతి ఇంటిలోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే మా లక్ష్యమన్నారు. ఓబులవారిపల్లె మండలం సందర్భంగా నివాసానికి మంత్రి చేరుకున్నారు.

ఈ సందర్భంగా ముక్కవారిపల్లి నివాసనికి వచ్చిన మంత్రి రామానాయుడుకి ప్రభుత్వ విప్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి,ముక్కా విశాల్ రెడ్డి, ముక్కా సాయి వికాస్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. మంత్రి వెంట పార్టీ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్ రాజు, గునిపాటి చేంద్రా యుడు, అనమలగుండం చంద్రమోహన్,మాజీ జెడ్పిటిసి వెంకటేశ్వరరాజు, చరణ్, పలువురు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలనలో మార్పు ఏది?

### రాష్ట్రంలో అప్పులు అధికం అభివృద్ధి శూన్యం

### పోలవరాన్ని 45.72 మీటర్ల ఎత్తు పెంచాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**అనంతపురం, జూలై 27 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో చంద్రబాబు సర్కార్‌లో మార్పు కనిపించడం లేదని, ఏపీ రాష్ట్రంలో అప్పుల అధికం అవుతున్నాయని అభివృద్ధి శూన్యం అని, పోలవరం ఎత్తు పెంచకపోతే రాయలసీమ, ఉత్తరాంధ్రకు అన్యాయం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. కూటమి నేతలు ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పారని ఇప్పుడు మళ్లీ అమలు చేయడంలో అర్థం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఆదివారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన పాత్రికేయ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్‌తో కలిసి కె.రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సంవత్సర కాలంలో కేంద్ర ప్రభుత్వంలో ఉన్న ప్రధానమంత్రిని, హోం మంత్రి ఫైనాన్స్ మంత్రులను కలిసి అర్జీలు ఇచ్చేందుకే కాలం సరిపోతుందన్నారు. చంద్రబాబు నాయుడు పరిపాలన ఎటువంటి మార్పు లేదని గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఏ విధంగా పరిపాలించాడో అదే విధానాలను అవలంబిస్తున్నారన్నారని ఆరోపించారు. విభజన హామీలు, రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, కడప స్టీల్ ప్లాంట్‌ల గురించి వీటిపై ఏమీ మాట్లాడడం లేదన్నారు. వైసీపీ హయాంలో అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి జిందాల్ అంటే ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు జిందాల్ అంటున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పక్కాగా ప్రవేట్ వారికి అప్పగిస్తుంటే దానిని ఆపలేకపోతున్నారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 4 వేలు మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడంతోపాటు 1,400 మంది పర్మినెంట్ కార్మికులకు వీఆర్ఎస్ ఇచ్చి పంపించడం జరిగిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని 45.72 మీటర్ల ఎత్తు నిర్మాణం జరిగితేనే పూర్తిస్థాయిలో నీటిని వినియోగించడం జరుగుతుందన్నారు. తద్వారా ఉత్తరాంధ్ర రాయలసీమ ప్రాంతాలకు నీరు అందించడం వీలుంటుంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వము ఒక సంవత్సర కాలంలో రూ.1.50లక్షల కోట్లు అప్పులు చేయడం జరిగిందన్నారు. ఒక అమరావతి రాజధాని నిర్మాణం కోసం 31వేల కోట్లు అప్పు చేశారని మరో రూ.31వేల కోట్లు అప్పులు తేవడానికి సిద్ధమ య్యారన్నారు. సింగపూర్ ఢిల్లీ పర్యటనలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నారా లేక అప్పుల్లోకి తీసుకు పోతున్నారో విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. అధికారంలోకి రాక ముందు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే పగల గొట్టాలని చెప్పిన పెద్దమనిషి అధికారంలోకి రాగానే స్మార్ట్ మీటర్లను బలవంతంగా బిగిస్తున్నారని దుయ్యబట్టారు. మద్యం కుంభకోణంలో రూ.3500 కోట్లు గత ప్రభుత్వం దోపిడీ చేశారని కూటమి ప్రభుత్వం చెబుతున్నారు.12 మందిపై కేసులు పెట్టారు. అరెస్టు చేసిన వారిపై నిజాలను నిగ్గు తేల్చకుండా సిట్, కేంద్ర దర్యాప్తు సంస్థల పేరుతో కాలగర్భంలో కలిపేస్తారని ప్రజలు అనుకుంటున్నారన్నారు. నిజాలను నిగ్గు తేల్చి ప్రజాధనాన్ని రికవరీ చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, పుట్టపర్తి జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సహాయ కార్యదర్శి పి. నారాయణస్వామి, జిల్లా సిపిఐకార్యదర్శి వర్గ సభ్యులు జె.రాజారెడ్డి, అనంతపురం నగరసిపిఐ కార్యదర్శి ఎన్.శ్రీరాములు పాల్గొన్నారు.

# పార్వతమ్మ మరణం పార్టీకి తీరని లోటు

### సంస్మరణ సభలో వక్తలు

**అనంతపురం, జులై 27 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం నగరంలో హెచ్ఎల్‌సి కెనాల్ వద్ద ఉన్న వీకే మెమోరియల్ హాల్‌లో సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో కమ్యూనిస్టు పార్టీ మాజీ శాసనసభ్యులు వికె ఆదినారాయణ రెడ్డి సతీమణి వీకే పార్వతమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కమ్యూనిస్టు పార్టీ నాయకులు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో గుర్తుండిపోయే నాయకులు కామ్రేడ్ ఐదుకల్లు సదాశివన్, నీలం రాజశేఖరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, వి.కె.ఆదినారాయణ రెడ్డితోపాటు, ఆదినారాయణ రెడ్డి సతీమణి కీర్తిశేషులు కామ్రేడ్ వి.కె.పార్వతమ్మ పాత్ర రాజకీయంగా వినూత్నంగా నిలిచిందన్నారు. జై ఆంధ్ర ఉద్యమంలో ఎదురైన రాళ్లదాడి సమయంలోనూ ధైర్యంగా నిలిచిన ఆమె, ఉద్యమ పట్ల ఎనలేని నమ్మకంతో పోరాటం జరిగిందన్నారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, మాజీ శాసనసభ్యులు విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఏఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిని అడ్డుకునేందుకు వైఎస్సార్సీ విషపు వైఖరి

### రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ దిశగా శరవేగంగా పయనిస్తున్న ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తప్పుడు ఆరోపణలు, వక్రీకరణలతో దుష్ప్రచారానికి దిగడం అత్యంత బాధాకరమని రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రాబట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన విజన్ వ్యూహంపై చీకటి రాజకీయం నడుపడమే గుడివాడ అమర్నాథ్ వంటి నేతల లక్ష్యంగా మారిందని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఒక్క పరిశ్రమ కూడా తేవకుండా... ఇవాళ అడ్డంకులు తెస్తున్నారు వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు ఒక్క గొప్ప పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురాకుండా చేతులెత్తేశారని వారే చెబుతున్నారు. అప్పట్లో "ఇప్పుడే పెట్ట గుడ్డుపెట్టింది, పొదగడానికి సమయం పడుతుంది" అంటూ కాలయాపన చేశారు. నేడు చంద్రబాబు కృషితో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రానికి ముందుకొస్తుండగా వాటిపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరం. ఇది పరిశ్రమల దృష్టిని మళ్లించేందుకు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్న కుట్రలలో భాగం.

**వాస్తవాలను వక్రీకరించడమే అమర్‌కి వృత్తిగా మారిందా? :** గుడివాడ అమర్నాథ్ వాస్తవాలను వక్రీకరించి మాట్లాడడంలో మాత్రమే నిపుణుడు. పలు సందర్భాల్లో తన విమర్శలకు ఆధారాలేవీ చూపలేకపోయినా బూతుల వంటి ఆరోపణలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమే చేస్తూ వస్తున్నాడు. ఉర్సా డేటా సెంటర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై కేంద్రంగా విమర్శలు గుప్పించడాన్ని చూస్తే... అమర్ అసలు విషయాలను అర్థం చేసుకోకుండానే మాట్లాడుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోందన్నారు. మార్కెట్ రేటుతో భూములు కేటాయించినందున ఎటువంటి అవకతవకలు లేవని ఐటీ శాఖ స్పష్టంగా వివరణ ఇచ్చినప్పటికీ, దుష్ప్రచారమే ఆయనకు ఆయుధంగా మారింది.

ఇప్పుడు రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి.. ఇప్పటికే 9 ఎస్ఐపిబి సమావేశాల్లో దాదాపు ..10 లక్షల కోట్ల పెట్టుబడులు ఖరారయ్యాయి. వీటి ద్వారా 5 లక్షలకు పైగా ఉద్యోగ అవకాశాలు సృష్టించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇవి త్వరలోనే భూమిపైకి దిగనున్నాయి. దీంతో రాష్ట్రం అభివృద్ధి బాటలో వేగంగా పయనించనుండగా... ప్రజల్లో ప్రభుత్వం పట్ల నమ్మకాన్ని కలిగించే దిశగా చంద్రబాబు, లోకేష్ చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. ఇది వైసీపీ నేతల అసహనానికి గల అసలైన కారణం.

**పబ్లిసిటీ కోసమే అబద్ధాల దూకుడు:** ప్రతిపక్ష నేతల ఆరోపణల వెనుక ప్రజల మనోభావాలే గాక, పెట్టుబడుల మీద నమ్మకాన్ని దెబ్బతీయాలన్న కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది. ఐటీ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో అమర్ ప్రారంభించినవి హాట్ ఫుడ్ షాపులే. అలాంటి నేతలు నేడు పరిశ్రమలపై మాట్లాడడమే పాపం. చంద్రబాబు నాయుడు దేశానికి గౌరవంగా నిలిచే టెక్‌సంస్థలతో మంతనాలు జరుపుతుంటే, గుడివాడ బ్యాచ్ మాత్రం చీప్ కమెంట్లతో న్యూస్‌లో కనిపించాలనే తహతహలతో ప్రవర్తిస్తున్నారు.చెప్పిన దాన్నిచేసి చూపించడమే శైలి. ఇది ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి పునాది వేసే అధికార ప్రభుత్వ ధర్మం.

# దుర్గమ్మవారి సేవలో ఏపి చీఫ్ జస్టిస్



హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఓ



నిత్యాన్నదాన పథకానికి విరాళమిచ్చిన దాతలకు దుర్గమ్మవారి జ్ఞాపిక నందిస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జూలై 27, ప్రభాతవార్త:** దుర్గమ్మ వారిని ఏపి హైకోర్టు ఛీఫ్‌జస్టిస్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆదివారం దర్శించుకున్నారు. వారికి ఇఓ వికె శీనా నాయక్ దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం సూర్యోపాసనను వేదోక్తంగా జరిపారు.

**నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రు.1లక్షను విరాళంగా ఆదివారం ఏలూరుకు చెందిన వెంకట గౌరి గిరి సాయి బాలాజీ వారి తల్లిదండ్రులు చిత్త శ్రీనివాసరావు, చాముండేశ్వరిల పేరిట అందించారు. ఆలయంలో ఆదివారం చెన్నైకు చెందిన కానికేతన్ కూచిపూడి డ్యాన్స్ అకాడమి ఆచార్యులు డా మాధవి మల్లంపల్లి నేతృత్వంలో విద్యార్థుల దుర్గమ్మ వైభవాన్నీ కీర్తిస్తూ నృత్యనీరాజనాలర్పించి భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు, దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అధికారులు ప్రసాదం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



రఘువీరారెడ్డి స్వగ్రామం నీలకంఠాపురంలో ఆలయాలను సందర్శిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

# నీలకంఠాపురంలో మాజీ మంత్రులు జానారెడ్డి, రఘువీరా భేటీ

**అనంతపురం, జూలై 27 ప్రభాతవార్త బ్యూరో:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కీలక మంత్రులుగా పనిచేసిన జానారెడ్డి, ఎన్.రఘువీరారెడ్డి నీలకంఠాపురంలో ఆదివారం సమావేశం అయ్యారు. తెలంగాణ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి అనంతపురం జిల్లా పర్యటన చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి జానారెడ్డి ప్రత్యేకంగా సిడబ్ల్యుసి సభ్యుడైన మాజీ మంత్రి రఘువీరారెడ్డి స్వగ్రామం నీలకంఠాపురంకు వెళ్లారు. ఆయన వెంట ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తదితర నాయకులు కూడా ఉన్నారు. ఈసందర్భంగా నీలకంఠాపురంలో రఘువీరారెడ్డి ప్రత్యేకంగా నిర్మించిన నీలకంఠాపురం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌ను మాజీ మంత్రి జానారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం అనంతపురంలోని వైసీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఇంటికి మాజీ మంత్రులు జానారెడ్డి,రఘువరెడ్డి తదితరులు వచ్చారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు అనంత వెంకట్రామిరెడ్డితో ఉన్న స్నేహం, అనుబంధంతో మాజీ మంత్రులు వారి ఇంటికి వెళ్లినట్లు తెలుస్తోంది. అనంతపురంలోజరిగిన ఓ వివాహ కార్యక్రమంలో మాజీమంత్రి జానారెడ్డి హాజరైనట్లు సమాచారం.


తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 28 - జూలై - 2025 7


# రోటరీ క్లబ్ సామాజిక సేవలు ప్రశంసనీయం - సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**కోనసీమబ్యూరో, జులై 27 , ( ప్రభాతవార్త ) :** సమాజానికి సేవలు అందిస్తున్న రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. ఆదివారం అన్నయిపేట గ్రామంలో కాకినాడ రోటరీ క్లబ్ సౌజన్యంతో అన్నయపేట పంచాయతీ నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్ (జల కళ్యాణం) ప్రారంభోత్సవం జరిగినది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, ముఖ్య అతిథులుగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, రోటరీ అధ్యక్షులు తడాలబుజ్జి రోటరీ సెక్రెటరీ సతీష్ లు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన రోటరీ క్లబ్ సేవలను అభినందించారు. వాటర్ ప్లాంట్ నిర్మాణంతో సురక్షితమైన నీటిని పొందటం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం వైస్ ఎంపీపీ శాఖ బాబి, ఉప సర్పంచ్ చల్లా బుజ్జి గ్రామ పెద్దలు రావూరి సుబ్బారావు, పెమ్మిరెడ్డి మురళి, ఆకేటి భీమన్న, అన్నయి పేట గ్రామపంచాయతీ పాలక సభ్యులు రోటరీ క్లబ్ కాకినాడ పాలక సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ దొరబాబు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ కూడా ఉచితంగా మంచినీళ్లు అందిస్తున్నామని ప్రజలందరూ కూడా ఈ మంచినీరును సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి భాగస్వామిగా సహకరించిన రోటరీ క్లబ్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రోటరీ క్లబ్ వారి ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ, విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేశారు.

# వీరేశ్వరస్వామికి మకర తోరణం బహుకరణ



**అంబాజీపేట, జులై 26 , ( ప్రభాతవార్త ) :** మండలంలోని గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో వేంచేసియున్న శ్రీ పార్వతి వీరేశ్వరస్వామి వారికి మండల లక్ష్మి నరసింహమూర్తి, కమలావతి దంపతులు,వీరి కుమారులు,మనుమలు ఇత్తడి మకర తోరణాన్ని ఆదివారం బహుకరించారు. ఆలయ అర్చకులు చంద్రమౌళి సూర్యకామేష్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# టూరిజం అభివృద్ధికి బౌద్ధ ఆరామం అనుకూలం..జేడీ కిరణ్ కుమార్



**మామిడికుదురు, జులై 27 , ( ప్రభాతవార్త ) :** ఆదుర్రు బౌద్ధ ఆరామం చుట్టూ అందమైన మడ అడవులు కలిగి ఉందని ఈ ప్రదేశం టూరిజం అభివృద్ధికి ఎంతో అనుకూలంగా ఉందని ఐఅండ్ పిఆర్ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ పేర్కొన్నారు.ఆదివారం ఆయన ఆదుర్రు గ్రామం లోని ప్రాచీన బౌద్ధ స్థూపాన్ని సందర్శించి అక్కడి కట్టడాలను పరిశీలించారు.వైనతేయ గోదావరి నదీ తీరంలో ఉన్న ఈ స్థూపం క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దంలో అశోకుని కుమార్తె సంఘమిత్రచే నిర్మాణం చేసినట్టు చరిత్ర ఆధారాలను బట్టి తెలుస్తోందన్నారు.ఈ ఆరామాన్ని సందర్శించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.ఈ స్థూపానికి వచ్చే మార్గంలో సరైన రోడ్డు లేని కారణంగా ఇది అభివృద్ధికి దూరం అయ్యిందని తెలిపారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి అభివృద్ధి చేస్తే ఎకో టూరిజంగా అభివృద్ధి చెందుతుందని కిరణ్ కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఆయన వెంట సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు,చెల్లుబోయిన శ్రీనివాసరావు, పినిశెట్టి చంద్రశేఖర్ ఉన్నారు.

# జగ్గంపేట సొసైటీ చైర్మన్ గా బుర్రి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం



**జగ్గంపేట, జులై 27 , ( ప్రభాతవార్త ) :** జగ్గంపేట సొసైటీ చైర్మన్ గా నరేంద్ర పట్నం గ్రామానికి చెందిన బుర్రి సత్యనారాయణ(సత్తిబాబు) త్రిసభ్య కమిటీ సభ్యులు నంద చిరంజీవి, జనసేన పార్టీ నుంచి పాలి శెట్టి సతీష్ లతో కలిసి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే జ్యోతులనెహ్రూ, మాజీ సొసైటీ చైర్మన్ జ్యోతుల మణి, డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు, జిల్లా టిడిపి అధ్యక్షు లు జ్యోతుల నవీన్ హాజరయ్యారు.అనంతరం సీఈఓ పాఠం శెట్టి అప్పలరాజు, సొసైటీ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం గోకవరం రోడ్ లోని కాపు కళ్యాణ మండపంలో ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని కూటమి నాయకులందరూ చైర్మన్ బుర్రి సత్తిబాబును త్రిసభ్య కమిటీ సభ్యులను పూలమాలతో, శాలువాల తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ, జ్యోతుల మణి, నవీన్, తుమ్మల బాబు మాట్లాడుతూ సత్తిబాబు ఆధ్వర్యంలో జగ్గంపేట సొసైటీ మరింత అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హజ్ యాత్ర దరఖాస్తుకు ఈ నెల 31 వరకు గడువు



**మామిడికుదురు, జులై 27 , ( ప్రభాతవార్త ) :** హజ్ యాత్రకు 2026 లో వెళ్లే ముస్లింలు ఈనెల 31వ.తేదీ వరకు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు సమయం ఉన్నదని రాష్ట్ర వాక్ఫ్ బోర్డ్ సభ్యుడు హాజీ ముకరం హుస్సేన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ హజ్ యాత్ర దరఖాస్తులు స్థానిక సున్నీ జామియా మసీదు,నగ్రమ్ మినల్లా షియ్యా మసీదు ప్రతినిధులకు అందజేశానన్నారు.హజ్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం అయ్యిందని వెళ్లే వారు 2026 డిసెంబర్ 31 తేదీ వరకు చెల్లుబాటు అయ్యే మెషిన్ రీడబుల్ పాస్ పోర్టు కలిగి ఉండాలన్నారు.దరఖాస్తులు హజ్ సువిధా యాప్ లో మాత్రమే అందుబాటులో ఉంటాయన్నారు.ఎంపికైన యాత్రికులు ముందస్తుగా రూ.1,52,300లు డిపాజిట్ గా చెల్లించవలసి ఉంటుందని ముకరం తెలిపారు.

# ఘనంగా ప్రభా గౌరవ సభ

## డాక్టర్ ఆలూరి విజయలక్ష్మికి ప్రభా గౌరవ పురస్కారం ప్రదానం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జులై 27 , ( ప్రభాతవార్త ) :** మధునాపంతుల రత్నప్రభ జయంతి, రత్నప్రభా గ్రంథాలయం ఆవిర్భావ సభ ఆదివారం ఘనంగా జరిగింది. పల్లిపాలెం లోని కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో ప్రభా గౌరవసభ ఆంధ్రీకుటీరం ప్రతినిధి మధునాపంతుల సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది.ఈసభలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది ఏర్పాటు చేసిన గ్రంథాలయంకు విశేష స్పందన లభించిందన్నారు.ఎంతో మంది గ్రంథాలయంకు పుస్తకాలు అందించారన్నారు.ప్రస్తుతం 12 వేలు పుస్తకాలు ఉన్నాయన్నారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని కలిగించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు.గ్రంథాలయం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రముఖ వైద్యురాలు, రచయిత్రి, సమాజ సేవకురాలు డాక్టర్ ఆలూరి విజయలక్ష్మికి సభలో ప్రభా గౌరవ పురస్కారం ప్రదానం చేశారు. మధునాపంతుల సత్యనారాయణమూర్తి,కిరణ్ మధునాపంతుల, ఎం.వి.చలపతి తదితరులు ఆమెను శాలువాలతో ఘనంగా సత్కరించి మెమెంటో, సన్మాన పత్రం అందజేశారు.విజయలక్ష్మి సమాజసేవ, వైద్యరంగంలో చేసిన కృషిని నూకల భానుమతి వివరించారు. వైద్యురాలుగా సేవలందిస్తూనే సమాజసేవ చేసిన ఘనత విజయలక్ష్మికి దక్కుతుందన్నారు.అలాగే ప్రముఖ రచయిత, విమర్శకులు మాకినీడి సూర్య భాస్కర్ మాట్లాడుతూ సాహిత్యరంగంలో విజయలక్ష్మి చేసిన కృషిని, ఆమె రచనలను పరిచయం చేశారు.వైద్య వృత్తి నేపథ్యంగా మహిళలు, కౌమారబాలికలు గురించి ఎన్నో కథలు రాసి వారిలో చైతన్యం తీసుకురావడానికి విశేష కృషి చేసిన గొప్ప రచయిత్రి అని పేర్కొన్నారు.అనంతరం విజయలక్ష్మి మాట్లాడుతూ తనకు పురస్కారం ప్రదానం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.ఇష్టంగా చేసే ఏ పని అయినా కష్టంగా ఉండదని పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయడం కూడా ఒక బాధ్యతగా భావించాలన్నారు.సభలో పెండ్యాల కామేశ్వరరావు రచించిన పల్లిపాలెం వారి తెలుగు కథలు పుస్తకంను ఆవిష్కరించారు.అనంతరం ప్రముఖకవి జోష్యుల కృష్ణబాబు అధ్యక్షతన కవిసమ్మేళనం జరిగింది.అద్దేపల్లి ప్రభు, బొల్లోజు బాబా, అవధానుల మణిబాబు,డాక్టర్ కాళ్లకూరి శైలజ, ఎం.జానికిరామ్ చౌదరి, అద్దేపల్లి జ్యోతి, పద్మజావాణి, పొనుగుమట్ల అశోక్ కుమార్, డాక్టర్ వేదుల శిరీష, ఇందిర, రత్నాకర్, సత్య చాగంటి, శుభశ్రీ రాజన్, వుండవల్లి, తదితర కవులు తమ కవితలు వినిపించారు.కవి సమ్మేళనంలో కవులు అనేక అంశాలపై కవితలు వినిపించి ఆకట్టుకున్నారని జోష్యుల కృష్ణబాబు పేర్కొన్నారు.కవులకు మెమెంటో అందించి సత్కరించారు.ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# పెరికలు సంఘటితంగా ఉండాలి పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

## రాఘవరావు ప్రత్తిపాడులో ఘనంగా పెరిక సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలు

**ప్రత్తిపాడు , జులై 27 , ( ప్రభాతవార్త ) :** రాష్ట్రంలోని పురగిరి క్షత్రియులు (పెరిక) సంఘటితంగా ఐక్యమత్యంతో ఉండాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కత్తిక రాఘవరావు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో బీబీఆర్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం పురగిరి క్షత్రియ కాకినాడ సంఘం ఎన్నికల ఏకగ్రీవంగా జరిగింది. ఈ సంఘ నూతన అధ్యక్షుడు వనపర్తి వీరభద్రరావు (భద్రీ) జిల్లా అ్యధ్యక్షుడుగా మరో 70 మంది కార్యవర్గ సభ్యులచే రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరావు పదవీ ప్రమాణం చేయించారు. అఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ పెరికిల సంక్షేమం, అభివృద్ధి కోసం సంఘం పనిచేస్తుందన్నారు. దీని కోసం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో, గుంటూరు సమీపంలోని వడ్డేశ్వరం వద్ద రెండు నూతన కార్యాలయ భవనాలు ఏర్పాటు అయినట్లు తెలిపారు. ఈ మాదిరిగా అన్ని జిల్లాలోను సంఘ కమ్యూనిటీ భవనాల ఏర్పాటుకు సంఘాలు కృషి చెయ్యాలని కోరారు. నూతన అధ్యక్షుడు వనపర్తి భద్రి మాట్లాడుతూ కాకినాడలో అర ఎకరం స్థలంలో పెరకీల కోసం నూతన కళ్యాణ మండపం ఏర్పాటు చేస్తున్నామని, అలాగే సంఘీయులకోసం సత్రం కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి నరిశెట్టి చద్రశేఖర్, రాష్ట్ర నాయకుడు రాలి సూర్యనారాయణ, తిబిరిశెట్టి వెంకటేశ్వరరావు, యడ్ల సుబ్రహ్మణ్యం, వీరలంక సూరిబాబు, బిట్టు రమేష్, దనేకుల భద్రం, మదినే దొరబాబులు మాట్లాడుతూ పెరికీలు ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా ఎదగాలని కోరారు. ఈసమవేశంలో విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చివ గోదావవరి జిల్లాల నుంచి తరలిరాగా, కాకినాడ జిల్లా వ్యాప్తంగా వందలాదిగా పెరికీలు పాల్గొన్నారు.



జిల్లా పెరికి సంఘం కార్యవర్గం

కాకినాడ జిల్లా పెరికి సంఘం అధ్యక్షుడు వనపర్తి వీరభద్రరరావు, గౌరవ అధ్యక్షుడుగా పోతన అప్పలరాజు, దనేకుల భద్రం, ప్రధాన కార్యదర్శగా జీవీవీ సత్యనారాయణ, కోశాధికారిగా జి మాణిక్యాలరావు, కన్వీనర్లుగా ఏవీ రామానుజులు, ఎం కృష్ణమోహన్, డి.వెంకటరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా గోడె గంగాధర్, వనపర్తి సతీష్, చికలమర్తి భద్రం, ఉపాధ్యాక్షుడుగా మదినే దొరబాబు, చిత్రా చంద్రరావు, అత్తి శ్రీనివాసరావు, ఎస్ చిన్న, సీహెచ్ పాపారావు, కారే రామమకృష్ణలతో పాటు మరో 70 మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

# పేకాట రాయుళ్లపై పోలీసులు దాడి, ఐదుగురు అరెస్ట్

**రౌతులపూడి, జులై 27 , ( ప్రభాతవార్త ) :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపిఎస్ జూద క్రీడల పై ఉక్కు పాదం మోపాలని ఆదేశాలు జారీచేశారు. ఆదివారం ప్రత్తిపాడు సి. ఐ సూర్యఅప్పారావు కి రాబడిన సమాచారం మేరకు రౌతులపూడి ఎస్సైజి. వెంకటేశ్వరరావు రావు సిబ్బందితో దిగువశివాడ గ్రామ శివారు తాండవ కాలువ గట్టు ప్రాంతంలో పేకాట రాయుళ్లు పై దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్దనుండి రూ 4,200 లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు. రౌతులపూడి మండల పరిధిలో ఎవరైనా జూద క్రీడలకు పాల్పడిన లేదా అసాంఘిక కార్యక్రమాలు పాల్పడిన సమాచారం తెలియజేయాలని ఎస్. ఐ. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

# స్త్రీ, శిశు, సంక్షేమ,దివ్యాంగ వ్రయోవృద్ధుల సంక్షేమ రాష్ట్ర కమిటీ సభ్యురాలుగా ఎమ్మెల్యే సత్యప్రభ



**ప్రత్తిపాడు , జులై 27 , ( ప్రభాతవార్త ) :** మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమంపై కమిటీ సభ్యురాలిగా శాసనసభ్యురాలు వరపుల సత్య ప్రభ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమంపై కమిటీ లో స్థానం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.. పిల్లలు, వృద్ధులు వికలాంగులు మహిళల సంక్షేమం మరియు వారి అభివృద్ధి కోసం వారి హక్కుల కోసం, వారి సంరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు


# పేకాట రాయుళ్ల పై పోలీసులు దాడి, ఐదుగురు అరెస్ట్




**రౌతులపూడి, జులై 27 , ( ప్రభాతవార్త ) :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఐపిఎస్ జూద క్రీడల పై ఉక్కు పాదం మోపాలని ఆదేశాలు జారీచేశారు. ఆదివారం ప్రత్తిపాడు సి. ఐ సూర్యఅప్పారావు కి రాబడిన సమాచారం మేరకు రౌతులపూడి ఎస్సైజి. వెంకటేశ్వరరావు రావు సిబ్బందితో దిగువశివాడ గ్రామ శివారు తాండవ కాలువ గట్టు ప్రాంతంలో పేకాట రాయుళ్లు పై దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్దనుండి రూ 4,200 లను స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు. రౌతులపూడి మండల పరిధిలో ఎవరైనా జూద క్రీడలకు పాల్పడిన లేదా అసాంఘిక కార్యక్రమాలు పాల్పడిన సమాచారం తెలియజేయాలనీఎస్. ఐ. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.


# తునిలోక్రెడై రాష్ట్ర కమిటీ సమావేశం




**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జులై 27 , ( ప్రభాతవార్త ) :** ఆంధ్రప్రదేశ్ క్రెడై రాష్ట్ర కమిటీ సమావేశం తుని పట్టణంలో ఆదివారం జరిగింది. అమలాపురం క్రెడై చాప్టర్ ప్రారంబించెందుకు రాష్ట్ర కమిటీ ఆమోదం తెలిపింది. ఈ సమావేశానికి అమలాపురం బల్డర్స్, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షులు మండేల నాగ వెంకట ప్రసాద్ (బాబీ ), కార్యదర్శి ముద్రగడ సుబ్రహ్మణ్యం (తాసు), కార్యవర్గ సభ్యులు చిక్కం సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. రియల్ ఎస్టేట్ సమస్యలను అధ్యక్షులు బాబీ సమావేశం దృష్టికి తెచ్చారు. ఏపీ అధ్యక్షులు భయాన శ్రీనివాస రావు, చైర్మన్ బుడ్డిగా శ్రీనివాస రావు, ఉపాధ్యక్షులు రాయుడు, కె సి ఎస్ బోస్, సాయి రామ్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ డి రాంబాబు తదితరులుతో పాటు రాష్ట్ర నలు మూలల నుంచి ఆయా క్రెడై చాప్టర్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# జూద క్రీడల పై ఉక్కు పాదం



**జగ్గంపేట, జులై 27 , ( ప్రభాతవార్త ) :** జగ్గంపేట సీ.ఐ వై.అర్.కె కు రాబడిన సమాచారం మేరకు జగ్గంపేట ఎస్సై రఘునందన్ రావు తన సిబ్బందితో కాట్రావులపల్లి గ్రామ శివారు గరువు చెరువు ప్రాంతంలో పేకాట రాయుళ్లు పై దాడి చేసి ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి వారి వద్దరూ 5,150లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయటం జరిగింది. అదే విధంగా జగ్గంపేట శివారు స్మశానం వద్ద ఒక చైల్డ్ కన్ఫ్లిక్ట్ విత్ లా ఒక ఆసామిని అరెస్ట్ చేసి అతని వద్ద 1.640 లీటర్ల లిక్కర్ బాటిల్స్ ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగింది.జగ్గంపేట సర్కిల్ పరిధిలో ఎవరైనా జూద క్రీడలకు పాల్పడితే సహించేది లేదని ఈ సందర్భంగా తెలియజేశారు.

# కార్గిల్ విజయ్ దివాస్ ర్యాలీలో పాల్గొన్న బిజెపి నేతలు



**కాకినాడ రూరల్, జులై 27 , ( ప్రభాతవార్త ) :** కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు కాకినాడ బిజెపి జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పార్టీ ఆఫీస్ నుంచి జిల్లా పరిషత్ సెంటర్ దగ్గర వున్న అమర వీరుల స్థూపం వరకు కాగడాలు, కొవ్వొత్తులతో ప్లకార్డ్స్ తో భారతమాత కి జై నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు మాట్లాడుతూ దేశ సరిహద్దుల్లో మన సైనిక వీరుల ధైర్య, సాహసాలు, త్యాగాలు వల్ల మనము స్వేచ్ఛగా ప్రశాంతమైన జీవనం గడుపుతున్నామని , అమర వీరుల త్యాగాలను మనం ఎల్లప్పుడూ స్మరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యేనిమిరెడ్డి మాలకొండయ్య, యార్లగడ్డ రామ్ కుమార్, కుండల సాయి కుమార్ యాదవ్, సాహితీ వర్మ, చోడిశెట్టి రమేష్ బాబు, గండి కొండలరావు, వెలుగులు గోపాలకృష్ణ, గూడూరు పద్మ, పెండెం శ్రీదేవి,గోరగపూడి చిన్నయ్య దొర, జ్యోతుల రాజేష్, విజయలక్ష్మి, ఉషారాణి, కర్రీ సత్యనారాయణ, గట్టి సత్యనారాయణ, మొసలిగంటి సురేష్, కే జి ఆర్, శ్రీహరి, ధనలక్ష్మి, ప్రతాప్, వరలక్ష్మి, గౌతు చిన్న, జిల్లా మీడియా కోఆర్డినేటర్ తుమ్మలపల్లి నారాయణ రావు(నాని), గంటసాల గోవింద్ , తోట ఏడుకొండలు, అడబాల మోహనరావు, కాళ్ల ధనరాజు, విజయరామయ్య, అధిక సంఖ్యలో భాజాపా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముద్రగడ ఆరోగ్యం కోసం నూకాలమ్మ తల్లి కి వైసీపీ నేతల ప్రత్యేక పూజలు



**ప్రత్తిపాడు, జులై 27 , ( ప్రభాతవార్త ) :** మాజీ మంత్రి వైసీపీ పిఏసి సభ్యులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడి సంపూర్ణ ఆరోగ్యం తో తిరిగిరావాలని మండలం లో ఉత్తరకంచి, ధర్మవరం గ్రామాలలో వైసీపీ నాయుకులు గ్రామ దేవత నూకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముద్రగడ పద్మనాభం నియోజకవర్గానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉత్తరకంచి వైసీపీ నాయుకులు గొల్లపల్లి దొరబాబు, కందా మాణిక్యం, బొడ్డు చిన్నా, చెలపరెడ్డి చక్రయ్య, సింహాద్రి, పూజారి, ధర్మవరం వైకాపా నేతలు ఉప సర్పంచ్ బొల్లు సీతారామరాజు, ఎంపీటీసీ జువ్వల సుజాత బాబులు, మాజీ సొసైటీ అధ్యక్షులు జువ్వల చినబాబు, దొడ్డిపట్ల సోమన్న దొర, సానా తాతీలు తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమలలో భక్తుల సందడి

**- వకుళ మాత అన్నదాన భవననిర్మాణానికి లక్ష విరాళం - స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ, 6, 73,949లు**





**ఆత్రేయపురం, జులై 27 , ( ప్రభాతవార్త ) :**
కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లిలో వెంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి శ్రావణమాసం తొలి ఆదివారం కావడం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు కిటకిటలాడాయి.ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణతో మర్మోగాయి. ఉదయం మేలుకొలుపు ఐశ్వర్య లక్ష్మి హెూమం గోపూజ అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం బాలభోగం నివేదన పవళింపు సేవ తదితర కార్యక్రమాలు అర్చకులు, ఘనంగా నిర్వహించారు. అన తరం భక్తులు స్వామివారి దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వివిధ సేవలద్వారా స్వామివారికి రూ,6,73,949లు సమాకూరినట్లు దేవస్థానం అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆలయానికి వారం వారం పెరుగుతున్న భక్తుల రద్దీ కారణంగా మరిన్ని సౌకర్యాలు కల్పించే విధంగా పనులు చేపట్టారు దీనిలో భాగంగా ఆదివారం శ్రీనివాస పార్కింగ్, టాయిలెట్స్ ను డిప్యూటీకమీషనర్, ఈఓ నల్లం సూర్య చక్రధరరావు పరిశీలించారు. ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవనం నిర్మాణానికి రాజమండ్రి చెందిన ఎం.వి. రాఘవ , మరియు వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,000 లక్ష విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ ఉప కమీషనర్ కార్యనిర్వాహణాధికారి నల్లం సుర్య చక్రధరరావు స్వామివారి చిత్రపటం ప్రసాదాలు అందజేశారు.

# మహిళల సంక్షేమ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యే సత్య ప్రభ ఎంపికపై హర్షం

**శంఖవరం, జులై 27 , ( ప్రభాతవార్త ) :**
మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమంపై కమిటీ సభ్యురాలిగా శాసనసభ్యురాలు వరుపుల సత్య ప్రభ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై రాష్ట్ర టి ఎన్ టి యు సి ఉపాధ్యక్షులు వెన్న శివ హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని కత్తిపూడి లో గల ఆయన స్వగృహంలో ఆదివారం శివ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ సంయుక్త కమిటీ మహిళలు, పిల్లలు, వికలాంగులు మరియు వృద్ధుల సంక్షేమంపై కమిటీ లో ఎమ్మెల్యే సత్య ప్రభకు స్థానం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రాజన్న ఆశయాలు సాధన కోసం రాజన్న ను నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయాలనే, దృఢ సంకల్పంతో ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారని, తను నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేస్తూ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పాటువడడం



జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఎవరు చేపట్టిన విధంగా గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణం మారుమూల గ్రామాలను ప్రధాన రహదారులు కలుపుతూ లింక్ రోడ్లు నిర్మాణం గ్రామాల్లో సిమెంట్ రోడ్లు నిర్మాణం డ్రైనేజీలు ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని స్థానిక నాయకులు కార్యకర్తలతో పని చేస్తూ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలో సుపరిపాలన తొలి అడుగు గ్రామాల్లో అమల్లో రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గం ఐదో స్థానంలో నిలవడం గర్వించదగ్గ విషయం అన్నారు .పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి న్యాయం చేయడం జరుగుతుందని, రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే సత్య ప్రభ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గాబు కృష్ణమూర్తి, కంచి బోయిన, సాధనల లక్ష్మీ బాబు కేలంగి జనార్ధన్ నక్క శీను కొయ్య రవణ చక్రి తదితరులు పాల్గొన్నారు

# ఎరువులు కృత్రిమ కొరత సృష్టించకుండా పర్యవేక్షణ చేయాలి

**- జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

**కోనసీమ బ్యూరో, జులై 27 , ( ప్రభాతవార్త ) :**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఖరీఫ్ సీజన్ పూర్తయ్యే వరకు రైతాంగానికి పూర్తిస్థాయిలో ఎరువుల సరఫరా చేసేలా చర్యలు గైకొనడంతోపాటు కృత్రిమ కొరతను సృష్టించ కుండా పర్యవేక్షణ వ్యవ స్థను బలోపేతం చేయాలని వ్యవసాయ, మార్కెట్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆది వారం ఒక ప్రకటన ద్వారా ఆదేశించారు. అవసరాలకు మించి యూరియా వినియో గంపై తప్పనిసరిగా రైతుల కు అవగాహన కల్పించి సాధ్యమైనంత మేరకు వాడ కాన్ని తగ్గించాలని సూచించారు. సాగు నీటి నిర్వహణ పక్కాగా జరిగితే నే ఆశించిన ఫలితాలు వస్తాయని, యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఆందో ళనకు గురిచేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే డీఏపీ విక్రయి స్తామని పలు ప్రాంతాల్లో వ్యాపారులు నిబంధనలు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తు న్నారని, అటువంటి వారిపై ఈసీ, వీడీ యాక్టు నమోదు చేయాలని ఆదే శించారు రైతులు వంటల అవస రానికి మించి యూరియా అధికంగా వాడుతున్నారని, దీనివల్ల భూమి నిస్సార మవుతుందనే అవగాహనను రైతులకు కల్పించాల న్నారు రసాయన ఎరువులు ఎక్కువ వినియోగించడం వల్ల భూసారం తగ్గి వంట ఉత్తత్తుల పై ప్రభావం పడు తుందన్నారు.రైతులకు అవసరమైన మేరకు యూరియా వాడాలని భూసారం ప్రకారం శాస్త్రవేత్తలు సూచించిన మో తాదు లోనే రైతులు ఎరువుల వినియోగించేలా చూడాలన్నా రు. అలాగని యూరియా కొరత ఉందనే అనుమానం రైతుల్లో తలె త్తకుండా చూడాలన్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు అం దుబాటులో ఉన్నాయనీ. యూరియా కొరత ఉందని కొన్ని మాధ్యమాలు, సామా జిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం జరుగు తోందన్నారు తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవా లన్నారు. ప్రతీ రైతు సేవా కేంద్రా నికి అవసరమైన మేర స్టాక్ అందుబాటులో ఉంచు కోవాలన్నారు నానో యూరి యావాడకంతో కలిగే ప్రయో జనాలను,రైతులకు వివరిం చాలన్నారు. జిల్లాలో ప్రస్తు త ఖరీఫ్ సీజన్లో 1,63,399 ఎకరాలలో వరి సాగు చేప ట్టారని, దీనిలో ఇప్పటివ రకు ఎ ద జల్లు నిదానం ద్వారా 15,744 ఎకరాలు, నాట్లు వేసే విధానంలో 73,250 ఎకరాలలో నాట్లు వేశా రని, ఆగస్టు 15 నాటికి జిల్లాలో నాట్లు పూర్తవు తాయన్నారు. ఈ ఖరీఫ్ లో 42,493 మెట్రిక్ టన్నులు వివిధ రకాల ఎరువులు అవసరం కాగా ఇప్పటి వరకు 34,224 మెట్రిక్ టన్నులు పం టల సాగు కొరకు విక్రయించగా మిగిలిన 24,405 మెట్రిక్ టన్నులు ఎరువులు అందు బాటులో ఉన్నాయన్నారు. యూరి యా వాడకాన్ని తగ్గిస్తూ శాస్త్రీయ పద్ధతిలో ఎరు వులు వాడకంపై రైతులకు అవగాహన పెంచాలన్నారు దీంతో నేల జీవశక్తి, మెరుగుపడి రసాయన ఎరువుల అవసరం తగ్గుతుం దన్నారు రైతులకు సాగునీటి కొరత లేకుండా ఉత్తమ సాగు నీటి నిర్వ హణ విధానాలను తప్పని సరిగా చేపట్టాలన్నారు.

# అందరికీ అండగా.. ఆర్యవైశ్యులు



**- రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ**
**- ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం**
**- మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ**

**పిఠాపురం, జులై 27 , ( ప్రభాతవార్త ) :**
రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలందరికీ అండగా ఆర్యవైశ్యులు ఉంటారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో అధ్యక్షులు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పిఠాపురం పట్టణంలో ఎస్ కన్వెన్షన్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కాకినాడ జిల్లా పిఠాపురం, యు కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల ఆర్యవైశ్య సంఘాల నూతన కమిటీ ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు రామ సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని వర్గాల ప్రజలందరికీ అండగా ఉంటూ ఇప్పటికే ఎన్నో సేవ సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య మహాసభ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షులు అడ్మినిస్ట్రేటివ్ వెలగా వెంకట నాగేష్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పిఠాపురం మండలం ,యు కొత్తపల్లి మండలం, గొల్లప్రోలు మండలం అధ్యక్ష కార్యదర్శి కోశాధికారులు కార్యవర్గ సభ్యులుచే ప్రమాణస్వీకారం కాకినాడ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పులవర్తి కుమార్ చేయించారు. పిఠాపురం మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా రేపాక రమేష్, కార్యదర్శిగా కంభంపాటి శ్రీరామ్, కోశాధికారిగా కంచర్ల నగేష్, ఉపాధ్యక్షులు కొల్లేపల్లి శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శి చిత్తులూరి రాజా, అధనపు కోశాధికారి కొత్త శ్రీను, యు కొత్తపల్లి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా కూరగాయల వి.ఆర్.యం కృష్ణ ,కార్యదర్శిగా సుతాపల్లి సతీష్ ,కోశాధికారిగా కడిమిశెట్టి వెంకటరావు, ఉపాధ్యక్షులుగా నేతి సత్యనారాయణ, అదనపు కార్యదర్శిగా చెన్నా శశిధర్, అదనపు కోశాధికారిగా కె.వి త్రిమూర్తులు, గొల్లప్రోలు మండలం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ములుకూరి వెంకట్రాజు, కార్యదర్శి కేదార శెట్టి లక్ష్మీప్రసాద్, కోశాధికారిగా వెత్స వీర వెంకట రమణమూర్తి, ఉ పాధ్యక్షులుగా గ్రంధి నాగ కృష్ణారావు ,అదనపు కార్యదర్శిగా దర్శిపూడి శ్రీధర్, అదనపు కోశాధికారిగా కేదార్ శెట్టి శ్రీధర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, సలహాదారులుగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని వాసవి మాత కండువాతో సత్కరించారు .

**ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం..**
**మాజీ ఎమ్మెల్యే ఎస్ పి ఎస్ ఎన్ వర్మ**

రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన వర్మ మాట్లాడుతూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేసే ఆర్యవైశ్యులకు తెలుగుదేశం పార్టీ అండగా నాయకులందరం ఇచ్చిన మాటపై ఉంటామని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిఠాపురం నియోజవర్గ మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ఎస్ వి ఎస్ ఎన్ వర్మ అన్నారు. అదేవిధంగా మా రాజకీయ ఎదుగుదలకు కృషిచేసిన ఆర్యవైశ్యులకి రుణపడి ఉంటానని, ఆర్యవైశ్యులు ఎంతగానో సహకారం అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు గ్రంధి నారాయణరావు బాబ్జి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు పేరూరు గాంధీ ,ఆర్యవైశ్య మహాసభ జాయింట్ సెక్రెటరీ పెనుగొండ కామరాజు, తూర్పుగోదావరి జిల్లా సంఘం అధ్యక్షులు భక్తుల సత్తిబాబు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు వాకచర్ల వీర వెంకట సత్యనారాయణ మూర్తి, కాకినాడ జిల్లా యువజన సంఘం అధ్యక్షులు నార్ల రత్నాజీ, జోన్ చైర్మన్ ఇమ్మడి శెట్టి నాగేంద్ర కుమార్, లలిత ఇండస్ట్రీ అధినేత కాకినాడ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు మట్టే శ్రీనివాస్, గ్రంధి రాజేష్ పిఠాపురం వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ అధ్యక్షులు దంగేటి సత్యనారాయణమూర్తి, పిఠాపురం మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు, బోడ సతీష్, కర్ణాటకపు శేషారావు, కుసుమంచి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు యధావిధిగా పి జి ఆర్ఎస్



**కోనసీమ బ్యూరో, జులై 27 , ( ప్రభాతవార్త ) :**
ఈనెల 28 సోమ వారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) ద్వారా అర్జీ దారుల వినతులను స్వీక రించడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం (పీ జీ ఆర్ ఎస్) ద్వారా అర్జీల స్వీకరణ ప్రక్రియ చేపట్ట నున్నట్టు తెలిపారు. స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాలలోను 4 మునిసి పల్ ప్రధాన కార్యా లయాల లోనూ 22 మండల కేంద్రాల్లో సంబంధిత అధి కారులు ప్రజలకు అందు బాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసు కోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవి ధంగా అర్జీదారులు తమ అర్జీలను పిజిఆర్ఎస్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతు లు సంబంధిత సమాచారం తెలుసుకు నేందుకు 1100 కి నేరుగా ఫోన్ చేసి సంప్రదిం చవచ్చునని తెలిపారు. కావున అర్జీదారులు జిల్లా, డివిజన్, మండల నిర్దేశిత స్థాయిల లోనీ ప్రజా సమ స్యల పరిష్కార వేదికలను ఆశ్రయించి తమ తమ సమస్యలకు తగు పరి ష్కార మార్గాలు పొందాలని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ను కలిసిన అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి



**అమలాపురం, జులై 27 , ( ప్రభాతవార్త ) :**
ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ను అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి ముగ్గళ్ల గణేష్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక విజయలక్ష్మీ నగర్ లో వైసిపి కార్యాలయం లో శాసన సభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ చైర్మెన్ గా నియమితులైన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

# కర్బలా యాత్రికులకు ఘన వీడ్కోలు



**మామిడికుదురు., జులై 27 , ( ప్రభాతవార్త ) :**
ముస్లిం మతస్తుల ఆరాధ్యదైవం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ కుటుంబ,పరివార సభ్యులు 72 మంది ఇరాక్ లోని కర్బలా పుణ్య భూమిలో వీరమరణం పొంది 40 రోజులు పూర్తి అయిన సందర్భంగా జరిగే అర్బయీన్ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మండలం లోని నగరం,మామిడికుదురు గ్రామాలకు చెందిన మహిళా భక్తుల బృందం ఆదివారం ఇరాక్ దేశానికి బయలు దేరి వెళ్లారు.వీరు హైదరాబాద్ లోని కార్వాన ఏ జైనుల్ ఆబేదీన్ ఆధ్వర్యంలో అక్కడి భక్త బృందంతో కలిసి తొలుత ఇరాన్ వెళ్తారు.అక్కడి పుణ్య క్షేత్రాలను సందర్శించి ఇరాక్ లోని నజఫ్ పట్టణానికి చేరుకుంటారు. అక్కడినుండి సుమారు 90 కిలోమీటర్లు పాదయాత్ర చేసుకుంటూ కర్బలా చేరుకొని అర్బయీన్ కార్యక్రమాల్లో పాల్గొని పుణ్య క్షేత్రాలను దర్శించుకుంటారు.ఈ బృంద సభ్యులకు నగరం లోని పంజషా వద్ద స్థానికులు,మహిళలు ప్రత్యేక ప్రార్ధనలు చేసి వీడ్కోలు పలికారు.

# విద్యార్థులకు హరిహర వీరమల్లు స్పెషల్ షో - విజయోత్సవ సంబరంలో బత్తుల వెంకటలక్ష్మి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాబ్యూరో, జులై 27 , ( ప్రభాతవార్త ) :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రం మన చరిత్రను, మన దేశ వీరుల గురించి నేటి విద్యార్థులకు తెలియజేయాలనే సంకల్పంతో ప్రభుత్వ స్కూలు మరియు కాలేజీలో చదివే విద్యార్థులకు రాజనగరం నియోజకవర్గ శాసనసభ్యులుబత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో స్పెషల్ షో వేసి విద్యార్థులకు ఉచితంగా టిక్కెట్లు అందజేశారు.ఈ సందర్భంగా జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి సీతానగరం మండలంలో గీతా



శ్రీనివాస్ నందు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. అనంతరం చిన్నారులతో కలిసి హరిహర వీరమల్లు చిత్రాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో సీతానగరం మండల జనసేన పార్టీ నాయకులు,కార్యకర్తలు, వీర మహిళలు భారీగా పాల్గొన్నారు.

# హైందవ మహిళలకు 1200 బంగారు వరలక్ష్మి రూపులు బహుకరణ



**- విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు,బిజెపి నాయకుడు కంబాల శ్రీనివాసరావు**

**ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బ్యూరో , జులై 27 , ( ప్రభాతవార్త ) :**
హైందవ ధర్మాన్ని పరిరక్షించడంలో భాగంగా హిందూ మహిళలకు బంగారు వరలక్ష్మీ రూపులు ఉచితంగా అందజేస్తున్నామని విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ సమితి రామసేన అధ్యక్షుడు, బిజెపి నాయకుడు తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దేశంలో హిందూ ,సనాతన ధర్మాన్ని కాపాడాలని దేశ ప్రధాని మోడీ కృషి చేయడానికి తాను స్ఫూర్తిగా తీసుకొని తన వంతుగా హిందూ ధర్మాన్ని పరిరక్షణకు కృషి చేస్తున్నానని చెప్పారు.గత మూడు సంవత్సరాలుగా తాను గోకవరం మండల కేంద్రంగా రాజనగరం,కోరుకొండ , అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ప్రాంతాల్లో హిందూ దేవాలయాలకు లక్షల రూపాయలు విరాళంగా అందిస్తున్నట్లు చెప్పారు. శ్రావణ శుక్రవారం ని పురస్కరించుకొని హిందూ మహిళలకు బంగారు వరలక్ష్మి రూపులు ఉచితంగా 1200 పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఒక బంగారు రూపు అర గ్రాము చొప్పున ఉంటుందని ఈ మేరకు 60 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని తెలిపారు.కళ్యాణ మండపాలు ఖర్చులు మరో 10 లక్షలు ఖర్చులు అవుతుందని మొత్తం 70 లక్షలు. ఈ రూపులను ఈనెల 28వ తేదీన నుంచి ప్రారంభిస్తున్నామని మొదట గా గోకవరం గ్రామంలో సూర్య మహల్ లో 150 మందికి బంగారు వరలక్ష్మి రూపులు అందజేస్తున్నామన్నారు.29 న గోకవరం రూరల్ గ్రామాల ప్రజలకు మరో 150 రూపులు అందజేస్తున్నట్లు తెలిపారు.30వ తేదీన కోరుకొండ మండలం, శ్రీరంగపట్నంలో 150 మందికి వచ్చే నెల రెండవ తేదీన కోరుకొండ సుబ్రహ్మణ్యం మైదానంలోని 150 మందికి పంపిణీ చేస్తున్నామన్నారు. ఆగస్టు మూడవ తేదీన గోకవరం మండలం ఇందుకూరుపేట గ్రామంలోను,నాలుగో తేదీన ఉదయం రంపచోడవరం లోను, మధ్యాహ్నం అడ్డతీగల గ్రామంలో రాజేంద్ర కళ్యాణమండపంలోను ,ఐదవ తేదీన సీతానగరం మండలం సీతానగరం గ్రామంలో రాజా గార్డెన్స్ లోను , ఆరవ తేదీన రాజానగరం మధు కళ్యాణ్ మండపం లో బంగారు వరలక్ష్మీ రూపులను ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రూపులు అందజేసిన ప్రతి చోటా ఉచిత భోజన సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.గత మూడేళ్లుగా హైందవ ధర్మాన్ని పరిరక్షిస్తూ ప్రధాని మోడీ విధానాలకు ఆకర్షితులై సుమారు పదివేల మందితో బిజెపి పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు.రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని ఆ వ్యాపారం లో వచ్చిన లాభాలతో రూపాయలను హిందూ ధర్మాన్ని పరిరక్షించడానికి చాలామందికి, ఎన్నో సంస్థలకు విరాళాలుగా అందజేసినట్లు అని తెలిపారు .ఇంతవరకు తన ఆదాయాన్ని ప్రజల కోసం ఖర్చు పెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రామసేన నాయకులు నాగ రమేష్ ,వీరాంజలి తదితరులు పాల్గొన్నారు.

# సబ్సిడీ పై వచ్చిన డ్రోన్ లను ప్రారంభించిన బత్తుల



**ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా బ్యూరో, జులై 27 , ( ప్రభాతవార్త ) :**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు డ్రోన్ సబ్సిడీపై ఇచ్చే కార్యక్రమం చేపట్టింది. ఈ నేపథ్యంలో సీతానగరం మండలం, చిన్నకొండేపూడి గ్రామంలో ఓ రైతుకు సబ్సిడీపై వచ్చిన డ్రోన్ లను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆదివారం తమ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ మీద డ్రోన్ లు ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పడుతున్న ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంనకు రైతులందరి తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ డ్రోన్లను సరైన క్రమంలో ఉపయోగించుకోవడం ద్వారా రైతులు అనేక ఉపయోగాలు పొందగలరని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డ్రోన్లు సబ్సిడీ పై పొందిన రైతులు చేకూరు కృష్ణంరాజు, ముదునూరి మోహన్ కిరణ్, ముదునూరి జగ్గరాజు, తోట వెంకటరాజు, పెన్మత్స నాగరాజు మరియు జనసేన టిడిపి బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పశువులు అక్రమ రవాణా చేస్తున్న వాహనం సీజ్

**గండేపల్లి , జులై 27 , ( ప్రభాతవార్త ) :**
కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ గోవుల అక్రమ రవాణా అరికట్టాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఈ మేరకు గండేపల్లి ఎస్ఐ యువి శివ నాగబాబు సిబ్బందితో కలిసి గండేపల్లి వద్ద వాహన తనిఖీలు నిర్వహించుచుండగా ఒక అశోక్ లేలాండ్ దోస్త్ వాహనంలో నాలుగు ఆవు దూడలు ,12 ఎద్దు దూడలు అక్రమంగా తుని నుండి చిలకలూరిపేట కు తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ వైఆర్ కె శ్రీనివాస్ తెలిపారు.గోవులను అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,“Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# గర్భిణులకు సురక్షత ప్రయాణం కోసం..



రిషిత

రిషతది ఒడిశాలోని భువనేశ్వర్. చిన్నప్పటి నుంచి నిరుపేదలకు సాయం చేయాలనుకునే రిషిత హైస్కూల్ స్థాయిలోనే నిధుల సేకరణ చేసి ఎన్జీవోలతో కలిసి పనిచేయడం ప్రారంభించింది. తమ ఇంట్లో సహాయకురాలిగా ఉండే మహిళ సొంతూరికి ప్రయాణమైంది. సరిగ్గా లేని రోడ్డు మార్గంలో బస్సులో ప్రయాణించడంతో ఆమెకు గర్భస్రావమైంది. ఇలా రెండుసార్లు జరిగిందని తెలిసి గర్భిణులకు సురక్షిత ప్రయాణాన్ని అందించేలా ఏదైనా చేయాలనుకుంది. రహదారులు గోతులుగా ఉన్నప్పుడు ఆ వాహనంలో గర్భిణులున్నారని డ్రైవరు గుర్తిస్తే కాస్త జాగ్రత్తగా డ్రైవ్ చేస్తారనిపించింది రిషితకు. అలాగని ఎక్కిన ప్రతి ఒక్కరి గురించి డ్రైవరు తెలుసుకోవడం కష్టమైన విషయం. దీనికి ప్రత్యామ్నాయంగా ట్రాక్ చేసే విధానం మంచిదనిపించింది. అందుకే బస్సులోని సాంకేతికతకు అనుసంధానం చేస్తూ బయోమెట్రిక్ పరికరాన్ని రూపొందించింది. గర్భిణులు, వృద్ధులు, వికాలాంగులకు సంబంధించిన ప్రభుత్వ డేటాబేస్ ఈ సిస్టమ్‌కు అనుసంధానమవుతుంది. ఇందులోని కెమెరా డేటాబేస్ ద్వారా ప్రయాణికుల గుర్తింపును స్కాన్ చేస్తుంది. జీపీఆర్ఎస్ షీల్డ్ ద్వారా బస్సు డ్రైవర్, కండక్టర్‌కు ప్రయాణంలో అదనపు జాగ్రత్తలు తీసుకోవడానికి హెచ్చరికను పంపుతుంది. దీంతో ఆయా వ్యక్తులకు అనుకూలమైన సీటింగ్ ఏర్పాటు చేస్తారు. 'గర్భిణులకు సురక్షితమైన ప్రయాణం' పేరుతో రూపొందించిన ఈ ప్రాజెక్టు బస్సు ప్రయాణాలతో మహిళల్లో గర్భస్రావం కాకుండా ఉండేలా చేయడానికి ఉపయోగపడుతుంది. రిషిత రూపొందించిన ఈ పరికరానికి డాక్టర్ అబ్దుల్‌కలాం ఇగ్నైట్‌మైండ్ ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీ అవార్డు దక్కింది.




# ప్రభుత్వశాఖలో తొలి మహిళా డ్రైవర్

మనసుకు నచ్చిందే చేస్తామంటున్నారు నేటి మహిళ క్రమంలో తమను తాము నిరూపించు కోవడమే కాదు.. ఒడిశాకు చెందిన సుంధ్యారాణి మాఝీ ఇదే కోవకు చెందుతుంది. చిన్నతనం నుంచి డ్రైవింగ్‌ని ఇష్టపడిన ఆమె.. దీన్నే తన వృత్తిగా మార్చుకోవాలనుకుంది. ఈ పట్టుదలే నేడు ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టింది. ఇటీవలే ఒడిశా ప్రభుత్వ శాఖలో డ్రైవర్‌గా చేరిన ఆమె.. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచింది. ఈ నేపథ్యంలో సంధ్య డ్రైవింగ్ జర్నీ గురించి తెలుసుకుందాం..

**చిన్నాటి కల!** చిన్నతనం నుంచి ఏ విషయంలోనైనా ధైర్యంగా వ్యవహరించే సంధ్య.. డ్రైవింగ్‌పై ఇష్టాన్ని పెంచుకుంది. అదెంతలా అంటే.. స్కూల్ బస్‌లో వెళ్లినా, ఏదైనా బైక్‌పై ప్రయాణించినా డ్రైవర్ నడిపే తీరును ఆసక్తిగా గమనించేది. నేను ఎక్కింది ఏ వాహనమైనా సరే.. డ్రైవర్ సీట్లో కూర్చున్న వ్యక్తి డ్రైవింగ్ స్కిల్స్‌ని సునిశితంగా పరిశీలించేదాన్ని. అతడు స్టీరింగ్ ఎలా తప్పుతున్నాడు? బ్రేకులెలా మేస్తున్నాడు? క్లచ్ ఎలా నొక్కుతున్నాడు? ఆయా ప్రదేశాల్ని బట్టి వేగాన్ని పెంచుతూ తగ్గించే విధానం.. ఇలా ప్రతి విషయాన్నీ గమనించేదాన్ని. ఇది నాలో డ్రైవింగ్ పట్ల ఆసక్తిని మరింతగా పెంచింది. అంటోన్న సంధ్య గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక డ్రైవింగ్‌లో మరిన్ని మెలకువలు నేర్చుకుంది.

**భర్త ప్రోత్సాహంతో..** అయితే అంతలోనే ఆమెకు వివాహం జరగడంతో డ్రైవర్ కావాలన్న తన కల కలగానే మిగిలిపోతుందేమో అనుకుంది సంధ్య. కానీ ఆమె భర్త కూడా ప్రొఫెషనల్ డ్రైవర్ కావడంతో తన భార్య ఆసక్తిని తెలుసుకుని ఆమెనూ ఇదే దిశగా ప్రోత్సహించాడు. నా భర్త ప్రోత్సాహంతోనే తొలుత నాలో కారు నడపడం ప్రాక్టీస్ చేశా. ఆపై తనే నాకు ఓ సెకండ్‌హ్యాండ్ కారు కొని బహుమతిగా ఇచ్చాడు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది నా జీవితాన్నే మలుపు తిప్పింది. ఖాళీ దొరికితే చాలు ఈ కారులో లాంగ్‌డ్రైవ్‌కి వెళ్లేదాన్ని. ఇలా కఠినమైన రోడ్లు, మలుపులున్న చోట ఎలా వాహనం నడపాలో నేర్చుకున్నా. ఆపై ఇక్కడి ఓ ట్రైనింగ్ సెంటర్‌లో చేరి ఇందులో పూర్తి నైపుణ్యాలు గడించా. ద్విచక్ర, త్రిచక్ర నాలుగు చక్రాల వాహనాలు పర్‌ఫెక్ట్‌గా నడుపుతూ వీటిల్లో లైసెన్సులు పొందా.. అంటూ తన డ్రైవింగ్ జర్నీ గురించిచెబుతోంది సంధ్య.



**ఆ అవకాశం చేజారినా...** అయితే డ్రైవింగ్‌లో పూర్తి పట్టు సాధించాక.. ఇందులో ఉద్యోగాల వేట ప్రారంభించింది సంధ్య. ఈ క్రమంలో రెండేళ్ల క్రితమే విదేశంలో ఓ జాబ్ ఆఫర్ వచ్చిందట. అయితే వివిధ కారణాల రీత్యా దాన్ని స్వీకరించలేక పోయానంటోంది. వ్యక్తిగత కారణాల వల్ల మంచి ఉద్యోగావకాశాన్ని కోల్పోయా. అయినా నిరుత్సాహపడ కుండా ఇంతకంటే మంచి ఆఫర్ వస్తుందేమో అన్న నమ్మకంతో ముందుకు సాగా. ఈ క్రమంలో స్కూల్ బస్ డ్రైవర్‌గా చేరా. కొన్నాళ్లు గడిచాక.. ఒడిశా ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్లు కావాలన్న నోటిఫికేషన్ చూశా. వెంటనే దానిక అప్లై చేశా. నాకున్న అనుభవం, నైపుణ్యాలు చూసి వాళ్లు నన్ను ఈ ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఇటీవలే ప్రభుత్వ వాహన డ్రైవర్‌గా విధుల్లో చేరా.. అంటోన్న సంధ్య.. ఒడిశా ప్రభుత్వ శాఖలో పని చేసే తొలి మహిళా డ్రైవర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె.. ఆ రాష్ట్ర వాణిజ్య, రవాణా, గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి అయిన ఉషా పధీకి అధికారిక డ్రైవర్‌గా కొనసాగు తోంది. ఈ క్రమంలోనే ఉష.. సంధ్యను ప్రశం సిస్తూ ఆమెతో దిగిన ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేయగా.. ఈ ట్వీట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. పలువురు ఆమెను ప్రశంసిస్తున్నారు.



**ఇక్కడితో ఆగిపోను ...** జీవతంలో ఎంత సాధించినా..ఇంకా చేరుకోవాల్సి లక్ష్యాలు, గమ్యాలు బోలెడుంటాయంటోంది సంధ్య. ప్రస్తుతం ప్రభుత్వోద్యోగం సాధించినా ఇక్కడితో ఆగిపోనని చెబుతోంది. భవిష్యత్తులో భారీ వాహనాలు నడపాలన్న కోరిక ఉంది. అయితే ఇదంత సులభం కాదని నా సోదరుడు నన్ను హెచ్చరించాడు. అయినా నేను వెన్కకి తగ్గను.

# సానుకూలంగా మెలుగుతూ..

ఉద్యోగినులకు ఇంటి పనులకు బయటివి తోడై ఒత్తిడి పెరిగి పోతుంటుంది. ఇది ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భాగస్వామితో విభేదాలకి దారితీస్తుంది. అలా కాకుండా ఉండాలంటే సానుకూలంగా మెలుగుతూ సమస్యలను పరిష్కరించుకోవాలి. పనులన్నీ చకాచకా చేసేయాలన్న తొందరమాని, సులువుగా చేసుకునే మార్గాలేంటో తెలుసుకోవాలి. వాటిని ఆచరణలో పెడితే త్వరగా అలసిపోరు. ఏదైనా ప్రాధాన్యతా క్రమంలో చేస్తే సరి. ఇంటి పట్టు నుండే మహిళలు అన్ని పనులూ తామే చేసుకోవాలి అనుకుంటారు. అలాకాకుండా భర్తకి, పిల్లలకి కాస్త పనులు చెప్పండి. వారు నాకు చేతకాదు అంటే.. పనులన్నీ ఒక్కదాన్నే చేసుకోవడం కష్టం అవుతోందన్న విషయాన్ని విడమరచి చెప్పండి. వాళ్లూ అర్థం చేసుకుంటారు. మొదటిసారి కాస్త అటు ఇటుగా చేసినా క్రమంగా నేర్చుకుంటారు. ఆఫీసులో అలసిపోయి ఇంటికి వస్తే కాస్తయినా విశ్రాంతి దొరకాలి. ఎవరి పనులు వారు చేసుకోవడం అలవాటైతే..మీకు ఒత్తిడీ ఉండదు. ఇందుకోసం ఇంటిల్లిపాదికీ పని విభజన చేసేయండి తర్వాత ఎవరేం చేశారో పైపైన పరిశీలించుకుంటే సరి. ఏ పనిలోనూ ఎవరూ నిపుణులు కాదు. క్రమంగా అన్నీ వారే ఒంట పట్టించు కుంటారు.



# పేదవాడి యాపిల్

దోరదోర జామకాయలను చూడగానే చట్టుకున్న కొరుక్కుని తినేయాలని పిస్తుంది. పచ్చగా, చూడచక్కగా ఉండే వీటిలో పోషకాలూ ఎక్కువే. పేదవాడి యాపిల్‌గా పిలిచే వీటిల్లో ఉండే ఆరోగ్య ప్రయోజనాలెన్నో.. వీటిల్లో విటమిన్-సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి.. తరచూ అనారోగ్యాల బారినపడకుండా కాపాడు తుంది. అంతేకాదు ఈ విటమిన్ తెల్ల రక్తకణాల ఉత్పత్తికీ తోడ్పడుతుంది. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ బారి నుంచి శరీరాన్ని కాపాడతాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. వీటిల్లో ఉండే అధిక పొటాషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గుండెపోటుకు గురికాకుండా సాయపడుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడానికీ తోడ్పడుతుంది. జామ కాయల్లో ఉండే పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయులను నియంత్రించడానికి సాయపడతాయి. ఎక్కువగా ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాదు మలబద్ధకాన్నీ పోగొడుతుంది.పీచు ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇవి సరైన ఎంపికకాగలవు. వీటిల్లో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేస్తాయి.



గింజలు తీస్తుంది, ముక్కలు కోస్తుంది !

## గింజలు తీస్తుంది..

మామిడిపండు, పుచ్చకాయ, యాపిల్ లాంటి పండ్లు మహా రుచిగా ఉండి, ఊరిస్తుంటాయి. కానీ గింజలు తీయడం, ముక్కలు కోయడం కాస్త విసుగ్గానే ఉంటుంది. ఆ శ్రమను తగ్గించడానికి రకరకాల ఫ్రూట్ స్లైసర్లు వచ్చాయి. వీటిని కనుక కొనుక్కున్నామంటే పని చాలా సులవైపోతుంది.



# అందమంతా 'అల్లిక'లోనే..








ఇప్పటికీ చిట్టి చిట్టి క్రోషే బూటీలు, మిటెన్లు, స్వెటర్ల వంటి వాటిని బుజ్జాయిలకు వేసి మురిసిపోతుంటారు చాలామంది అమ్మలు. ఆ తరువాత వాటిని అపురూపంగా దాచుకుంటారు. కూడా. మనతో అనుబంధాన్ని పెనవేసుకుంటాయి. అందుకేనేమో... కాలం మారినా, అనేక రకాల గృహాలంకరణల రూపాల్లోకి మారి, ఇప్పటికీ ట్రెండీగా నిలుస్తున్నాయి. అందమైన కర్టెన్లు, టేబుల్ రన్నర్లు, మ్యాట్లు, కోస్టర్లు... ఇలా ఒక్కటేమిటీ కాదేదీ 'క్రోషే' కళకు అనర్హం అన్నట్లుగా భిన్న రకాల్లో అందుబాటులోకి వస్తున్నాయి. సృజనాత్మకత, వ్యక్తిగత అభిరుచుల మేళవింపుతో పాటు.. ఆధునిక హంగులూ అద్భుత వస్తువులకే ఓటేస్తున్నారు చాలామంది ఆడవాళ్లు. ఇంట్లో వాడే ప్రతి చిన్న వస్తువు ఉండటమేకాదు, అది నయనానందకరమైన భావననీ అందించాలనుకుంటున్నారు. కాబట్టే, ఆతరం, ఈతరం అనే తేడాలేకుండా ఏరికోరి క్రోషేనే ఏంచుకుంటున్నారు. అందమైన డిజైన్లు ఉన్న వస్తువులు బోలెడు దొరకొచ్చు.... కానీ, మనసు తెలుసుకుని మన కోసమే ప్రత్యేకంగా అల్లినట్లుండే వీటిని ప్రేమించనివారెవరు? రంగురంగులు పూలు, లతలు, సున్నితమైన అల్లకం... ఎవరినైనా మంత్రముగ్ధుల్ని చేయాల్సిందే.... ఏ ఆధునిక యంత్రాలకూ అందని క్లిష్టమైన అల్లికలోని సృజనాత్మక ముచ్చటగొల్పాల్సిందే. అందుకే, అల్లిన వస్తువులు ఒకటో, రెండో ఉండటం కాదు, సాధ్యమైనన్ని రూపాల్లో ఒక భాగం అయ్యేలా చూస్తున్నారు. మనమూ ప్రయత్నిద్దామా ఈ కొత్త ట్రెండ్‌ని..











# మాంగల్య ప్రదాత శ్రావణగౌరి

హైందవ సంప్రదాయంలో శ్రావణం విశేషమైన మాసం. హిందూ వివాహానంతరం మహిళలు సౌభాగ్యం, సంసార సౌఖ్యం, ఉత్తమ సంతానం కొరకు శ్రావణమాసంలో వచ్చే మంగళవారం వ్రతం చేపడతారు. భర్తకి ఆయురారోగ్యాలను ప్రసాదించ మని కోరుకుంటూ పంచవర్ష మంగళగౌరీవ్రతాన్ని ప్రారంభించి వరుసగా ఐదు సంవత్సరాలు ఈ వ్రతం ఆచరించి, ఉద్యాపన చేసుకొంటారు. ఈ శ్రావణ మంగళవారనోమును పెళ్లైన స్త్రీలు మొదటిసంవత్సరం పుట్టింటగాని అత్తింటగాని విడిగా ఉన్నా కూడా చేసుకొనవచ్చు. తల్లి ఆధ్వర్యంలో జరిపించుకోవడం చెప్పదగిన సూచన. అందుబాటులో లేనట్లు అయితే ఆ నోము వివరాలను, విశేషాలను అనుభవజ్ఞులైన పెద్ద ముత్తైదువుల సమక్షంలో చేసుకొని అవగాహన పొందవచ్చు. ముందురోజు అనగా సోమవారం శుచియై శనగలను వినాయకుని తలుచుకుంటూ నీటిలో నానబెట్టాలి. సోమవారం రాత్రి ఫలహారం చేయాలి. తమలపాకులు వక్కలు, అరటిపండ్లు వగైరా ఏర్పాటు చేసుకోవాలి. బియ్యపుపిండి రెడీ చేసుకోవాలి. పూజా విధానం, మంగళగౌరి వ్రతం కథ అష్టోత్తర నామాలతో, అలాగే తోరనరగంథి పూజ మదలైన వివరాలతో ఉన్న పుస్తకం అందుబాటులో ఉంచకోవాలి. వ్రతాన్ని ఆచరించే మహిళలు మంగళవారం ఉదయమే తలంటుకుని, శుచియైన వస్త్రధారణతో కుంకుమ, కాటుక, కాళ్ళకు పారణి అలంకరించుకుని, మంగళగౌరిని పూజకు సిద్ధం చేసుకునే స్థలంలో ఆవుపేడతో, కుదరక పోతే పసుపుచేతితో అలికి, నోము పట్టిన సంవత్సరం ఐదు, రెండవ సంవత్సరం పది ఇలా పెంచుకుంటూ ఐదవ సంవత్సరం ఇరవై ఐదు బియ్యం పిండితో పద్మాల ముగ్గులు వేసుకోవాలి. చిన్న చిన్నవి సంఖ్యలో చూసుకుని వేసుకోవాలి. వాటిపై పీఠం వేసి, గౌరీదేవిని ఇత్తడి, రాగి, వెండి లేదా పెళ్లికి ముందుగా పూజచేసిన గౌరదీదేవిని స్థాన చేయాలి.న ఈ గౌరీ దేవిని తనతోపాటు వివాహానంతరం తెచ్చుకునే సంప్రదాయం ఉంటుంది. బెల్లం, బియ్యపు పిండిని ఆవునేయితో కలిపి, జ్యోతులు వెలిగించుటకు వీలుగా కుందిలాగ పైన ముగ్గుల సంఖ్య మాదిరి ఐదు, పది, పదిహేను ఇరవై, ఇరవై ఐదు ఇలా క్రమంగా పెంచుకుంటూ తయారు చేసుకుని ఆవునేయితో దీపాలు సిద్ధం చేసుకోవాలి. పసుపు గణపతిగాని, గణపతి విగ్రహంగాని ఇత్తడి పళ్ళెంలో వియ్యంపోసి మధ్యలో విగ్రహం ఉంచి ముందుగా షోడశనామాలతో గణపతిని అర్చించి గౌరీవ్రతం తలపెట్టాను. విజయవంతంగా ఐదు సంవత్సరాలు పూర్తిచేసి, ఉద్యాపన చేయించి గౌరీదేవి అనుగ్రహం పొందేలా ఆశీర్వదించమని వేడుకుంటూ పూజచేయాలి.

- దేవులపల్లి పద్మజ

ఆధ్యాత్మికం

# అల్పాహారం తినండి

**సమయం లేదు, ఆకలి అనిపించలేదు, ఒక్కపూట తినకపోతే కెలోరీలు తగ్గుతాయి.. అల్పాహారం మానేయ దానికి ఎన్నెన్ని కారణాలు చెబుతాం! కానీ శరీరాన్ని కష్టపెడుతున్నామని తెలుసా? పైగా కోరి మరీ బరువు పెంచు ఉన్నట్లే !**

రాత్రంతా నిద్రలో విశ్రాంతి తీసుకున్నాం అనుకుంటాం కానీ.. శరీరం మాత్రం తనని తాను రిపేర్ చేసుకుంటూ ఉంటుంది. అందుకే అదీ, మెదడు తిరిగి చురుగ్గా మారాలంటే ఉదయాన్నే సరైన పోషకాహారం అందించడం తప్పనిసరి. ఉదయాన్నే బద్ధకం వదులుతుంది. చురుగ్గా పనిచేయొచ్చని టీ, కాఫీలను ఆశ్రయిస్తుంటాం కదా? ఈసారి నుంచి వేడినీటిలో నిమ్మరసాన్నో, తేనెనో కలిపి తాగండి. కావాలంటే అల్పాహారమో పండో తిన్నాక టీ, కాఫీల జోలికి వెళ్లండి. పనుల మధ్యలో తినే వీలు లేదనిపిస్తే పండ్లు, నట్స్, గుడ్డు వంటివి తిన్నా మంచిదే! ఒక పూట తినకపోతే బరువు తగ్గుతామని చాలామంది భావిస్తారట. అది బ్రేక్‌ఫాస్ట్‌కి వర్తించదు. పైగా మనసు చిరుతిళ్లు చక్కెరలు ఎక్కువగా ఉండే జంక్‌ఫుడ్‌పైకి మళ్లు తుంది. అంతేకాదు, మనసు నిండక మామూలు దానికంటే ఎక్కువగా తినేస్తామట. అదికాస్తా బరువు పెరగ దానికి కారణం అవుతుంది. త్వరగా అయిపోతుందని బ్రెడ్, జామ్, స్వీట్‌నర్స్ ఎక్కువగా ఉండే ఓట్స్, సెరెల్స్ తిన్నా హానే! త్వరగా తినేయొచ్చు అని తీసుకునే హెల్దీ, బ్రేక్‌ఫాస్ట్ బార్లూ అంత మంచివి కావట. వాటిల్లోనూ అధికమోతాదులో చక్కెరలు ఉంటాయి. కాబట్టి వాటికీ దూరంగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్ అన్నీ ఉన్నదాన్నే ఉదయం తీసుకోవాలి. సంప్రదాయ ఇడ్లీ, దోశ వంటివి తినండి. అయితే వాటికి కారుగూరలు చేర్చుకోండి, ఒక పండు, నట్స్, బ్రౌన్‌బ్రెడ్, గుడ్డు, కృత్రిమ చక్కెరలు లేని ఓట్స్, మిల్లెట్స్ వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి. అంటే తినకపోయినా, ఏదో ఒకటిలే అని కడుపులో వేసుకున్నా మనకి మనం చేటు చేసుకున్నట్టే, కాబట్టి, ఆరోగ్యాన్ని పెంచుకునేలా తినండి. రోజంతా ఉత్సాహంగా ఉండండి. సమయం సరిపోవట్లేదు అనిపిస్తే ముందురోజే కాస్త పండ్లు కూరగాయలు వగైరా సిద్ధం చేసుకుంటే సరి ఏమంటారు?



# హుమ్మస్ టిఫిన్ చట్నీ

ఇడ్లీ, దోసె, వడల్లాంటి టిఫిన్లను మనం చట్నీలో నంజుకుని తింటుంటాం కదా.. అలాగే మధ్య ప్రాచ్య దేశాలకు చెందినవాళ్లు హుమ్మస్‌ను ఎంతో ఇష్టంగా తింటుంటారు. బ్రెడ్‌నుదీంట్లో ముంచుకుని తింటే భలే ఉంటుం దంటారు. ఇంతకీ దిన్నెలా చేస్తారంటే. పెద్ద సెనగలను ఉడికించి, నీళ్ల వడకట్టి దాంట్లో నువ్వులు, వెల్లుల్లిరేకలు వేసి మెత్తగా మిక్సీ పడతారు. చివరగా కాస్త నిమ్మరసం పిండుతారు. అలాగే ఉడికించిన సెనగల్లో బీట్‌రూట్ కలిపితే గులాబీరంగు హుమ్మస్ సిద్ధమవుతుంది. దీంట్లో పాలకూరను కలిపితే పచ్చపచ్చగా, చూడముచ్చటగా ఉండి కనువిందు చేస్తుంది. రకరకాల రంగులు, రుచుల్లోని హుమ్మస్‌లు ఇప్పుడు అమెరికా సూపర్ మార్కెట్లలోనూ అందుబాటులో ఉంటున్నాయట. అయినా కమ్మగా, రుచిగా ఉండే సెనగల పచ్చడి పాశ్చాత్యుల మనసులనూ దోచేయడంలో ఆశ్చర్యం ఏముంది చెప్పండి.



# తెర

నాటి పద్ధతి..


## నేడేది?



ఒకప్పుడు హీరోయిన్లుగా ఓ వెలుగు వెలిగిన హీరోయిన్స్ ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు చాలా మంది సీనియర్ కథానాయికలు ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్టులుగా మెప్పిస్తున్నారు. అందం, అభినయంతో మెప్పించిన మీరా జాస్మిన్ టాలీవుడ్ క్రేజీ హీరోయిన్. ఆమె చాలా మంది ఫెవరెట్. తెలుగుతోపాటు తమిళంలో అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అంతేకాదు. అప్పట్లో గ్లామర్ షోలకు దూరంగా ఉంటూ నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలు ఎంచుకుంటూ ప్రేక్షకులను మెప్పించింది. కానీ ఇప్పుడు అందాలతో అదరగొడుతోంది. ఒకప్పుడు తెలుగులో ఆమె భారీగా ఫాలోయింగ్ సంపాదించుకుంది. పవన్ కళ్యాణ్ సరసన గుడుంబా శంకర్ సినిమాతో మరింత క్రేజ్ సొంతం చేసుకుంది. అంతకు ముందు రవితేజ జోడిగా భద్ర సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండిపోయింది.

తెలుగులో వరుస సినిమాల్లో నటించిన మీరా జాస్మిన్.. ఇప్పుడు సోషల్ మీడియాలో రెచ్చిపోయి అందాల గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది. అప్పట్లో సినిమాల్లో నటించే సమయంలో స్కిన్ షోకు నో చెప్పిన ఈ అమ్మడు.. ఇప్పుడు మాత్రం ఓ రేంజ్‌లో అందాలను ఆరబోస్తోంది. చాలా కాలంగా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ నిత్యం క్రేజీ ఫోటోస్ షేర్ చేస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోస్ ఆకట్టుకుంటున్నాయి. ఇటీవలే సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన మీరా జాస్మిన్ విమానం సినిమాతో రీఎంట్రీ ఇచ్చింది.

## రంగంలోకి దిగిన భయమెరగని వీరనారి



రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్టైనర్ మైసా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. భారీ బడ్జెట్ చిత్రాలతో బాలీవుడ్, టాలీవుడ్‌లలో వరుస సక్సెస్‌లు సాధిస్తున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్నా లీడ్ రోల్‌లో నటిస్తున్న ఈ సినిమాకు ఉదయం పూజా కార్యక్రమాలతో శ్రీకారం చుట్టారు. మైసాను యూనిఫార్ములా ఫిలిమ్స్ నిర్మిస్తోంది. సీతారామం, ఫౌజీ చిత్రాలకు అసోసియేట్‌గా పనిచేసిన హను రాఘవపూడి శిష్యుడు రవీంద్ర పుల్లె ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇది ఔట్ అండ్ అవుట్ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్గా తెరకెక్కనుంది. తెలంగాణలోని అదిలాబాద్ జిల్లాలో అధికంగా నివసించే ప్రముఖ ఆదివాసి జాతి గోండు తెగ నేపథ్యంలో ఈ సినిమా రూపొందనుంది. భయమెరగని ఓ వీరనారి పాత్రలో రష్మిక కనిపించనుంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ ఫోటోలు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ క్రియేట్ చేశాయి. రష్మిక లుక్ పోస్టర్‌లో స్టన్నింగ్‌గా ఉండటం విశేషం. ఈ సినిమాను మేకర్స్ తెలుగుతో పాటు పాన్ ఇండియాగా రూపొందిస్తున్నారు. కల్కి వంటి భారీ చిత్రానికి యాక్షన్ కొరియోగ్రఫీ చేసిన ఆండీ లాంగ్ ఈ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్నారు. అలాగే, సూర్య రేట్రో సినిమాకు కెమెరామెన్‌గా పనిచేసిన శ్రేయాస్ పి కృష్ణ ఈ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆదివారం ఉదయం జరిగిన పూజా కార్యక్రమానికి హను రాఘవపూడి, దగ్గుబాటి సురేశ్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేశ్ బాబు మొదటి షాట్‌కు క్లాప్ కొట్టగా, విజయ్ దేవరకొండ తదుపరి చిత్రం రౌడీ జనార్ధన్ దర్శకుడు రవి కిరణ్ కోలా కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి షాట్‌కు హను రాఘవపూడి దర్శకత్వం వహించారు. సోమవారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. అనంతరం రష్మిక అక్కడికి వచ్చిన గోండు జాతి మహిళలతో కలిసి సాంప్రదాయ నృత్యం కూడా చేశారు. ఇటీవలే ఛావా, 'కుబేర చిత్రాలతో భారీ విజయాలను సాధించిన రష్మిక, తెలుగులో అందాల రాక్షసి ఫేమ్ హీరో మరియు జాతీయ అవార్డు పొందిన చిలసౌ దర్శకుడు రాహుల్ రవీంద్రన్ డైరెక్షన్‌లో ది గర్ల్‌ఫ్రెండ్ అనే లేడీ ఓరియంటెడ్ సినిమా చేస్తున్నారు. ఈ సినిమాను అల్లు అరవింద్ గీతా ఆర్ట్స్ నిర్మిస్తోంది. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లకు రానుంది.

## పట్టాలకెక్కిన వన్ వే టికెట్



వరుణ్ సందేశ్, కుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా తెరకెక్కనున్న వన్ వే టికెట్ సినిమా పూజా కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ చిత్ర ప్రారంభోత్సవ వేడుకకు వచ్చిన ముఖ్య అతిథులు ప్రముఖ నిర్మాతలు సి. కళ్యాణ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టగా, హర్షిత్ రెడ్డి స్క్రిప్ట్ అందజేశారు. దర్శక, నిర్మాత త్రినాధరావు నక్కిన తొలి సన్నివేశానికి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమానికి టీ ఎస్ రావు అతిథిగా విచ్చేశారు. అనంతరం త్రినాధరావు నక్కిన మాట్లాడుతూ వరుణ్ సందేశ్ వైభోగం ఒకప్పుడు నేను చాలా చూశాను. ఆయనకు ఓ హిట్ అవ్వాలన్నదే నా కల. ఈ టికెట్ మూవీ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ..వరుణ్ సందేశ్ మాట్లాడుతూ వన్ వే టికెట్ టైటిల్ విన్న వెంటనే నాకు కొత్తగా అనిపించింది. నేను ఇందులో కొత్త పాత్రను పోషించబోతోన్నాను అని అన్నారు. నిర్మాత శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 'శ్రీ పద్మ ఫిల్మ్స్, రంగస్థలం మూవీ మేకర్స్ బ్యానర్లపై ఇది మా రెండో చిత్రం. అందరూ ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దర్శకుడు ఏ. పళని స్వామి మాట్లాడుతూ వన్ వే టికెట్ క్రైమ్, థ్రిల్లర్‌గా రాబోతోందన్నారు. కుష్బూ చౌదరి, మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తిక్, నటులు మనోజ్, సుధాకర్ తదితరులు మాట్లాడారు. ఈ చిత్రంలో మనోజ్ నందం, సుధాకర్ ముఖ్య పాత్రల్ని పోషించనున్నారు. ఈ మూవీకి కెమెరామెన్‌గా శ్రీనివాస్ బెజుగమ్, సంగీత దర్శకుడిగా కార్తిక్ పని చేయనున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభించారు.

## కామాఖ్య గ్రాండ్ లాంచ్



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో రూపొందనున్న థ్రిల్లింగ్ కామాఖ్య. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ శిజుగి లిగిదీ బ్యానర్ పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమా లాంచింగ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. సినిమా ప్రారంభోత్సవానికి మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. ఈ వేడుకలో మూవీ టీం అందరూ పాల్గొన్నారు. డైరెక్టర్ అభినయ కృష్ణ ఈ సినిమా కోసం మిస్టీరియస్ థ్రిల్లర్ ఎలిమెంట్స్ యూనిక్ కథని సిద్ధం చేశా రు. ఈ చిత్రంలో ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణ వ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి గ్యాని సంగీతం అందిస్తున్నారు. రమేష్ కుశేందర్ రెడ్డి డీవోపీగా వర్క్ చేస్తున్నారు. భూపతి యాద గిరి ఆర్ట్ డైరెక్టర్. ఈచిత్రానికి సంబధించిన మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో తెలియజేస్తారు. తారాగణం: సమైరా, సముద్రఖని, అభిరామి, ఆనంద్, శరణ్య ప్రదీప్,వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య.

## ఒక్క ఆంగ్ల పదం లేకుండా...యుద్ధమే రాని



డార్లింగ్ కృష్ణ, మనీషా హీరో హీరోయిన్స్‌గా శశాంక్ దర్శకత్వంలో రూపొందుతున్న మల్టీ లింగ్వల్ మూవీ బ్రాట్. డాల్ఫిన్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై మంజునాథ్ కంద్కూర్ ఈ సినిమాని నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి యుద్ధమే రాని సాంగ్‌ని రిలీజ్ చేశారు. సిద్ శ్రీరామ్ పాడిన ఈ పాటని నవరసరాయ డాక్టర్ నరేష్ వికే లాంచ్ చేశారు. అర్జున్ జన్య సంగీతం అందించిన ఈ పాటకు సనారె లిరిక్స్ రాశారు. ఈ బ్యూటీఫుల్ లవ్ సాంగ్ అందరినీ ఆకట్టుకుంది.

సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో నవరసరాయ డాక్టర్ నరేష్ వికే మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత అద్భుతమైన సినిమా బ్రాట్‌తో వస్తున్నారు. శశాంక్ చాలా ట్యాలెంటెడ్ డైరెక్టర్. మనిషా అద్భుతమైన నటి. మ్యూజికల్‌గా ఈ సినిమా సూపర్ హిట్. సనారె లిరిక్స్ చాలా అందంగా రాశారు అన్నారు. డైరెక్టర్ శశాంక్ మాట్లాడుతూ అప్పుడే తెలుగు కూడా నేర్చుకున్నాను. హైదరాబాదు నాకు ఇంకొక ఇల్లు లాంటిది. నాకు ఎప్పటినుంచో తెలుగు సినిమా చేయాలనే ఆలోచన ఉండేది. ఇప్పుడు ఆ సమయం వచ్చింది. బ్రాట్ సినిమాని ఐదు భాషల్లో రిలీజ్ చేస్తున్నాము. కంటెంట్ మీద ఉన్న నమ్మకంతోనే ఈ సినిమా రిలీజ్ చేస్తున్నాము. అందరికీ రిలేట్ అయ్యే కథ ఇది. అర్జున్ జన్య యుద్ధమేరాని పాత అద్భుతంగా కంపోజ్ చేశారు.

నిర్మాత మంజునాథ్ మాట్లాడుతూ ఈ పాట లాగే సినిమా కూడా మీ అందరికీ నచ్చుతుందన్నారు.

హీరో డార్లింగ్ కృష్ణ మాట్లాడుతూ.. చాలా బ్యూటిఫుల్ సాంగ్ ఇది. సిద్ శ్రీ రామ్ వాయిస్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఆయన ఈ సాంగ్ పాడటం చాలా ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. హీరోయిన్ మనీషా మాట్లాడుతూ.. ఇది యాక్షన్ థ్రిల్లర్ మూవీ. ఇందులోని యుద్ధమేరానే సాంగ్‌ని అర్జున్ జన్య చాలా అద్భుతంగా కంపోజ్ చేశారు. సిద్ శ్రీరామ్ వండర్ఫుల్‌గా పాడారు అన్నారు.

ఆడియోకో ఓనర్ శ్యామ్ మాట్లాడుతూ..సినిమా పాటలన్నీ చాలా అద్భుతంగా వచ్చాయన్నారు. లిరిక్ రైటర్ సనారె మాట్లాడుతూ.. సరిపోదా శనివారం, మెకానిక్ రాకీ, చావు కబురు చల్లగా లాంటి చిత్రాలకు పాటలు రాశాను. ఈ సినిమాకి పాట రాయడం అనేది చాలా చాలా ఆనందంగా ఉంది. ఒక్క ఆంగ్ల పదం లేకుండా అన్ని తెలుగు పదాలతో రాయడం అనేది మనసుకు చాలా సంతోషాన్ని ఇచ్చిందన్నారు.




## లగ్జరీ వాచ్‌ల ఫ్యాక్టరీ నేపథ్యమే..

ప్రస్తుతం సౌత్‌లో మంచి అంచనాలు సెట్ చేసుకున్న అవైటెడ్ చిత్రాల్లో సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ లో చేస్తున్న అవైటెడ్ చిత్రం కూలీ కూడా ఒకటి. అయితే ఈ సినిమాపై మాత్రం ఆడియెన్స్‌లో గట్టి అంచనాలే నెలకొన్నాయి. కేవలం టీజర్ ఇంకా పాటలతోనే సాలిడ్ హైప్‌ని సొంతం చేసుకున్న ఈ సినిమా విడుదలకి ముందే ఎలా ఉంటుంది? లోకేష్ గత సినిమాలతో లింక్ ఏమన్నా ఉందా అనే ఊహాగానాలే ఆడియెన్స్ ఎక్కువ పెట్టేసుకున్నారు. ఇలా సినిమా నేపథ్యం ఏంటి ఇతర అంశాలు మంచి సస్పెన్స్‌గా నిలవగా లేటెస్ట్‌గా లోకేష్ కనగరాజ్ అసలు కూలీ ప్లాట్ ఏంటి అనేది రివీల్ చేసేసాడు. కూలీ సినిమాలో గన్స్ ఉండవ్, డ్రగ్స్ ఉండవ్, ఎలాంటి టైం ట్రావెల్ సినిమా కూడా కాదు సినిమా మొత్తం లగ్జరీ వాచ్‌లు వాటి ఫ్యాక్టరీకి సంబంధించే ఉంటుంది అని అసలు విషయం తెలిపాడు.

## 8న బాలుగాడి లవ్ స్టోరీ




ఆకుల అఖిల్, దర్శక మీనన్, చిత్రం శ్రీను, గడ్డం నవీన్, చిట్టిబాబు, రేవతి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం బాలుగాడి లవ్ స్టోరీ. శ్రీ ఆకుల భాస్కర్ సమర్పణలో భామ క్రియేషన్స్ పతాకంపై ఆకుల మంజుల నిర్మిస్తున్న చిత్రానికి యల్. శ్రీనివాస్ తేజ్ దర్శకుడిగా పరిచయం కాబో తున్నాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న బాలుగాడి లవ్ స్టోరీ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆగస్ట్ 8న విడుదల కాబోతోంది. ఈ సినిమాను సిల్వర్ స్క్రీన్ గణేష్ భారీ రిలీజ్ చేయబోతున్నారు, బాలు గాడి లవ్ స్టోరీ సినిమా ఆద్యాంతం నేటి యూత్‌కు నచ్చేలా రొమాన్స్, యాక్షన్, సస్పెన్స్ ఇలా అన్ని ఎలిమెంట్స్ ఉండబో తున్నాయి. ఈ సినిమా పట్ల చిత్ర యూని ట్‌కు మంచి విశ్వాసం ఉంది. ఆకుల అ ఖిల్, దర్శక మీనన్, చిత్రం శ్రీను, జబర్దస్త్ గడ్డం నవీన్, జబర్దస్త్ చిట్టిబాబు, రేవతి, లక్ష్మీ, రాఘవరావు, మహేష్, సూరజ్ తదిత రులు నటిస్తున్న ఈ చిత్రానికి సమర్పణ శ్రీ ఆకుల భాస్కర్, బ్యానర్ భామ క్రియేషన్స్, రైటర్, డైరెక్టర్ యల్. శ్రీనివాస్ తేజ్, నిర్మా త ఆకుల మంజుల, డి.ఓ.పి రవి కుమార్ నీర్ల, మ్యూజిక్ డైరెక్టర్ ఘనశ్యామ్, ఎడిటర్ యాదగిరి కంజారాలలుగా వ్యవహ రిస్తు న్నారు.



## ఇన్విస్టిగేషన్ ఆఫీసర్

అరుణగిరి ఆర్ట్స్ మరియు కౌండిన్య ప్రొడక్షన్స్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ఫైట ర్ శివ. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపు కుంటోంది. కాగా ఈ చిత్రం యొక్క ఫస్ట్ లుక్ పోస్టర్ని దర్శకులు సంపత్ నంది చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ చిత్రంకి ప్రభాస్ నిమ్మల దర్శకత్వం వహిస్తున్నారు మణికంఠ, కథానాయకుడుగా ఐరా బన్సాల్ కథానాయకిగా నటించారు. ఈ చిత్రంలో ఇన్విస్టిగేషన్ ఆఫీసర్గా సునీల్ మరియు వికాస్ వశిష్ట ప్రత్యేక పాత్రలు పోషించారు. ఈ చిత్రంలో మధుసూదన్, యోగి కాత్రి, దిల్ రమేష్, లక్ష్మణ్, అభయ్, ఆనంద్ భారతి, ఘర్షణ శ్రీనివాస్ మాస్టర్ శన్విత్ నిమ్మల తదితర నటీనటులు నటించారు. ఈ చిత్రానికి దర్శకత్వం :ప్రభాస్ నిమ్మల, కెమెరా: సురేందర్ రెడ్డి, సంజీవ్ లోక్నాథ్ మ్యూజిక్: గౌతమ్ రఘురాం ,ఎడిటింగ్ విశ్వనాథ్, ఆర్ట్:నాయుడు ,లిరిక్స్: తోటమల్ల వెంకటి ,డి.ఐ. రామకృష్ణ, డాన్స్ :మనోజ్ కె ,5.1: పద్మారావు యాక్షన్: రాజేష్ లంక, తుఫాన్ ,నభ మేనేజర్: కృష్ణారెడ్డి ,రవి, మగదాసు శ్రీకాంత్.వి ఎఫ్ ఎక్స్ :శ్రీనాథ్ సప్ప, పోస్టర్స్: బాబి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రమేష్ ఎగ్గిడి, పి ఆర్ ఓ. వీరబాబు,ప్రొడ్యూసర్స్: నర్సింగ్, ఉన్నం. రమేష్,



## సినిమాను రిలీజ్ చేయడమే పెద్ద సక్సెస్ ప్రేక్షకులకు నచ్చితే అదంతా బోనస్



నిహాల్ కోధాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా చైనా పీస్. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. మేకర్స్ మేకర్స్ ఈ సినిమా టీజర్‌ని రిలీజ్ చేశారు. పీపుల్ స్టార్ సందీప్ కిషన్ ముఖ్య అతిధిగా విచ్చేసి టీజర్‌ని లాంచ్ చేశారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో పీపుల్ స్టార్ సందీప్ కిషన్ మాట్లాడుతూ..ఒక సినిమాను తీసి రిలీజ్ చేయడమే పెద్ద సక్సెస్. ప్రేక్షకులకు సినిమా నచ్చితే అదంతా బోనస్ అని భావించాలి. మన ఆలోచనల్ని దేశం మొత్తం చెప్పడానికి బెస్ట్ ప్రాసెస్ సినిమానే. ఫేమస్ అవ్వాలనుకుంటే రీల్స్ చేసి కూడా ఫేమస్ అవ్వచ్చు. ఇది ఒక స్పై ఫిల్మే కాదు స్పై కామెడీ, సీరియస్ కామెడీ కూడా ఉంది. దర్శకుడు ఈ కథని నమ్మాడు. నమ్మింది చిత్రీకరించాడు నిహాల్ సూర్య వీళ్ళందరిలోనూ ఒక నిజాయితీ ఉంది. తప్పకుండా ఆ నిజాయితీని మనందరం అప్రిషియేట్ చేయాలి. ఒక కొత్త ఫిలిం మేకర్స్ కొత్త నటించినప్పుడు ఆ సినిమాకు వెళ్లి వాళ్ళ ఆలోచనని చూడడం ఒక బ్యూటిఫుల్ ఎక్స్పీరియన్స్. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. టీజర్ చాలా బాగుంది. సినిమా కూడా చాలా బాగుంటుందని కోరుకుంటున్నా అన్నారు. డైరెక్టర్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. ఒక దేశభక్తి సినిమా తీస్తూ చైనా పీస్ అనే పేరు పెట్టడం వెరీ చాలెంజింగ్. మేము అన్ని విభాగంలోనూ జాగ్రత్తలు తీసుకుని చాలా చక్కగా ఈ సినిమాని తీర్చిదిద్దాం అన్నారు. హీరో నిహాల్ మాట్లాడుతూ.. నేను నటించినా ఒక సినిమా చూసి సందీప్ కిషన్ నా భుజాన చేయవేసి చాలా చక్కగా చేశావని మెచ్చుకున్నారు. ఆ క్షణం నేను మర్చిపోలేను. కష్టపడి సినిమాలు చేస్తే కచ్చితంగా సక్సెస్ వస్తుందనే దానికి సందీప్ కిషన్ నిదర్శనం. ఒక నమ్మకంతో మళ్లీ సినిమా ఇండస్ట్రీలోకి వచ్చాను. సినిమా చేతికి రావడానికి రెండేళ్ల పట్టింది. హీరో సూర్య శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. బాగా రీచ్ అవుతుందని నమ్మకం ఉందన్నారు. యాక్టర్ కమల్ కామరాజు మాట్లాడుతూ ఈ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి మరో మంచి దర్శకుడు దొరికాడన్నారు. హర్షిత మాట్లాడుతూ.. ఈ సినిమాలో సారా అనే క్యారెక్టర్‌ని ప్లే చేస్తున్నానని చెప్పారు. దీక్ష పంత్ పాల్గొన్నారు.



## ఇగో ఇదే మా ఊరు.. ఆరెపల్లి..

భారతదేశంలో అతిపెద్ద స్వదేశీ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అయిన స్ట్రిని5లో ఓ అచ్చమైన, స్వచ్ఛమైన తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో 'మోతెవరి లవ్ స్టోరీ' అనే సిరీస్ రాబోతోంది. అనిల్ గీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను శివ కృష్ణ బుర్రా రూపొందించారు. ఈ విలేజ్ కామెడీ, లవ్ సిరీస్ అందరినీ ఆకట్టుకునేందుకు ఆగస్ట్ 8న జీ5లో స్ట్రీమింగ్ కాబోతోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ అందరినీ మెప్పించింది. ఇక తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను ఆదివారం నాడు తరుణ్ భాస్కర్ చేతుల మీదుగా రిలీజ్ చేశారు.

'ఇగో ఇదే మా ఊరు.. ఆరె పల్లి.. ఊరుఊరుకో మోతెవరి ఉన్నట్టు.. మా ఊరికి ఓ మోతెవరి ఉన్నడు.. అంటూ ప్రియదర్శి వాయిస్ ఓవర్‌తో ప్రారంభమైన ట్రైలర్ ఆద్యంతం వినోదభరితంగా సాగింది. హీరో అనిల్ పరిచయం, హీరోయిన్ వర్షిణితో లవ్ ట్రాక్, ఊర్లోని పెద్దలు, భూ సమస్య, ప్రేమ వంటి అంశాలతో ట్రైలర్‌ను చక్కగా కట్ చేశారు. ఈ ట్రైలర్‌ను చూస్తుంటే ఈ సిరీస్‌ను ఆద్యంతం వినోద భరితంగా మలిచారని అర్థం అవుతోంది.'పర్శిగాడంటేనే పర్‌ఫెక్ట్, ఉశికే ఉడికించుడ్తే అనే డైలాగ్స్ నవ్వులు పూయించేలా ఉన్నాయి. అమ్మాయిలు భలేగా ఉంటరే.. మోసాన్ని కూడా ముద్దుగ చెప్తర్తే అంటూ సాగే డైలాగ్ ఎమోషనల్ డెప్త్‌ను కూడా చూపిస్తోంది. ఆగస్ట్ 8న ఈ సిరీస్ అందరినీ అలరించేందుకు రాబోతోంది. ఈ సిరీస్‌కు చరణ్ అర్జున్ సంగీతాన్ని అందించగా.. శ్రీకాంత్ అరుపుల కెమెరామెన్‌గా పని చేశారు. మధుర శ్రీధర్, శ్రీరామ్ శ్రీకాంత్ సంయుక్తంగా నిర్మించిన ఈ సిరీస్‌లో అనిల్ గీలా, వర్షిణి, మురళీధర్, సదానందం, సుజాత ముఖ్య పాత్రల్ని పోషించారు.

## వీరమల్లుకు అరుదైన గౌరవం

హరిహర వీరమల్లు చిత్రాన్ని ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆడిటోరియంలో శనివారం రాత్రి ఓ షో ప్రదర్శించగా అధికారులు, ఉద్యోగుల నుంచి మంచి స్పందన దక్కింది. ఆదివారం సాయంత్రం మరో షో వేశారు. సినిమాలో టికెట్ ధరలు మూలాన కొంచెం బుకింగ్స్ మీద డే 2 నుంచి ఎఫెక్ట్ పడింది. అయితే మేకర్స్ ఫైనల్‌గా నార్మల్ టికెట్ ధరలకు జూలై 28 సినిమాని అందుబాటులోకి తెచ్చేస్తున్నారు.

## ఏపీ రాజకీయ పరిణామాల చుట్టూ దేవా కట్టా

ఇక్కడ మీరు ఏ పాత్ర పోషించారో కానీ, తుక్కు రేగ్గొట్టారు తెలుగు ప్రేక్షకులు ఆగస్ట్ 7న మరోసారి మీ నట విశ్వరూపాన్ని చూడబోతున్నారు.. అంటూ సాయికుమార్‌ను ఉద్దేశించి దర్శకుడు దేవా కట్టా చేసిన ఈ ట్వీట్ నెట్టింట విపరీతంగా వైరల్ అవుతుంది. ప్రస్తుతం సోనీలివ్ ఓటీటీ కోసం దేవా కట్టా 'మయసభ సిరీస్ తెరకెక్కిస్తున్నారు. ఆగస్టు 7వ తేదీ నుంచి ఇది స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రానుంది. ఇందులో సాయికుమార్ ఓ కీలక పాత్ర పోషించ నున్నారని చెబుతూ ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రస్థానం.. ఆటోనగర్ సూర్య తర్వాత మయసభతో మూడవసారి పని చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నిండు నూరేళ్లు ఆనందంగా ఆరోగ్యంగా మీకు నచ్చిన పాత్రలు చేస్తూ లైఫ్ ఎంజాయ్ చేయాలని మీ అభిమానిగా ఆశిస్తున్నాను.. అని ట్వీట్‌లో పేర్కొన్నారు. కారులో కూర్చుని అభివాదం చేస్తున్న సాయికుమార్ పోస్టర్ ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. సాయికుమార్ పోషించిన పాత్ర ఏంటా అని ఆరా తీస్తున్నారు. అయితే ఇద్దరు స్నేహితులు.. రాజకీయ ప్రత్యర్థులుగా ఎలా మారారనే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న ఈ సిరీస్‌లో సాయికుమార్ ఎన్టీఆర్ పాత్ర పోషిస్తున్నారని తెలిసింది. ఇందులో ఆది పినిశెట్టి, చైతన్య రావు కీలక పాత్రలు పోషించనున్నారు. ఏపీ చరిత్రను మలుపు తిప్పిన రాజకీయ పరిణామాల చుట్టూ దేవా కట్టా ఈ మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. ఆగస్టు 7వ తేదీ నుంచి సోనీలివ్‌లో తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.



## ఈసారి చైతూపై కన్ను

టాలీవుడ్‌లో ఊర మాస్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆయన తొలి సినిమా భద్రతో బ్లాక్‌బస్టర్ అందుకున్న డైరెక్టర్ బోయపాటి శ్రీను అఖండ 2 తర్వాత ఏ హీరోతో సినిమా తీస్తాడన్నది చర్చనీయాంశంగా మారింది. అల్లు అర్జున్‌తో తీస్తాడని వార్తలొచ్చినా తను అట్లీ దగ్గర లాక్ అయిపోయాడు. సీనియర్ హీరోలందరూ రెండు మూడు ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. దీంతో మిడ్ రేంజ్ హీరోలపై కన్నేసినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం ప్రకారం బోయపాటి శ్రీను అక్కినేని నాగ చైతన్యతో సినిమా తీసేందుకు సన్నాహాలు చేస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. తండేల్‌తో రూ.100 కోట్ల క్లబ్‌లో చేరిన నాగచైతన్య ప్రస్తుతం విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ దండుతో ఓ మూవీలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. ఇది చైతూకి 24వ సినిమా. దీని తర్వాత తన ల్యాండ్ మార్క్ మూవీని బోయపాటి శ్రీనుతో తీసేందుకు నాగచైతన్య కూడా ఇంట్రస్ట్ చూపిస్తున్నాడపి టాక్. అన్నీ కుదిరితే 14 రీల్స్ సంస్థ నిర్మించే అవకాశాలున్నాయని టాక్ నడుస్తోంది.

# మేడారం జాతకు రూ.5 కోట్లు విడుదల

## ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం సమ్మక్కసారలమ్మకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. భక్తులు, వీఐపీల కోసం రూ.5 కోట్లతో గెస్ట్ హౌస్ నిర్మాణం చేపట్ట నున్నారు. మంత్రి సీతక్క కృషితో నిధులు విడుదలయ్యాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగుతుంది. కాకతీయ రాజుల కాలం నుంచి వస్తున్న ఈ జాతరకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అంచనా. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ములుగు జిల్లాలో ఈ జాతర జరుగుతుంది. ముఖ్యంగా.. జాతర సమయంలో భక్తులు, వీఐపీలు బస చేయడానికి వీలుగా మేడారంలో గెస్ట్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే నాలుగుసూట్ల గెస్ట్ హౌస్ నిర్మాణానికి ఆర్ అండ్‌బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ అనుమతులు ఇచ్చారు.

ఈ గెస్ట్‌హౌస్ నిర్మాణం, జాతర నిర్వహణలో సౌకర్యాలను గణనీయంగా మెరుగు పరుస్తుంది. గెస్ట్ హౌస్ నిధుల మంజూరు వెనుక మంత్రి సీతక్క కృషి ఉందని.. ఆమె ప్రయత్నాలు ఫలించాయని స్థానికంగా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుంభమేళాను తలపించే ఈ సమ్మక్కసారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు పటిష్టంగా... ప్రణాళికాబద్ధంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు.

జాతరలో తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు, విద్యుత్ శాఖ సేవలు, రోడ్ల మరమ్మతులపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేక నిధులు కేటాయించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. గత మేడారం జాతరకు సుమారు కోటి మందికి పైగా భక్తులు హాజరైనట్లు అధికారులు అంచనా వేశారు. ఇది జాతర ప్రాముఖ్య తను, దాని నిర్వహణకు అవసరమైన వనరులను తెలియజేస్తుంది. ఈ భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు తాగునీరు, పారిశుద్ధం, వైద్య సేవలు, రవాణా సౌక ర్యాలు వంటి ప్రాథమిక వసతులు కల్పించడం ఒక పెద్ద సవాలు. కొత్తగా నిర్మించనున్న గెస్ట్ హౌస్, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణాన్ని అందిస్తుంది. ఇది జాతర నిర్వహణ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, గిరిజన సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ప్రభుత్వ నిబద్ధతను చాటిచెబుతుంది. తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతల మహా జాతర తేదీలు ఇటీవల అధికారికంగా ఖరారయ్యాయి. ములుగు జిల్లా .. తాడ్వాయి మండలం, మేడారంలోని పుణ్యక్షేత్రంలో 2026 జనవరి 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు ఈ అద్భుతమైన పండుగ జరగనుందని పూజారుల సంఘం వెల్లడించింది. ఆధ్యాత్మిక తేజస్సుతో వెల్లివిరిసే ఈ ఉత్సవం, లక్షలాది మంది భక్తులను ఆకర్షించి, దైవత్వాన్ని చాటిచెబుతుంది. మేడారం జాతర సుమారు 900 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన అపురూపమైన గిరిజన పండుగ. కాకతీయ రాజుల కాలంలో అన్యాయపు పన్నుల వసూళ్లకు వ్యతిరేకంగా సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వంటి వనదేవతలు తమ ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేశారనే కథ ఈ జాతర వెనుక ఉంది. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, ప్రతి రెండేళ్లకు ఒకసారి ఈ మహా జాతరను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ జాతరను తెలంగాణ కుంభ మేళాగా అభివర్ణిస్తారు. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన పండుగలలో ఒకటిగా ఇది గుర్తింపు పొందింది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో, పెద్ద జాతర మధ్యలో అంటే, 2025 ఫిబ్రవరిలో మేడారంలో మినీ జాతరను నిర్వహించారు. ఈ మినీ జాతర కూడా భక్తులకు వన దేవతల దర్శనం కల్పించే ఒక ముఖ్యమైన అవకాశంగా మారింది. ఈ మహా వేడుకకు దేశం నలుమూలల నుంచి, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక వంటి ప్రాంతాల నుంచి కూడా కోటి మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం విస్తృతమైన ఏర్పాట్లు చేస్తుంది.

### రాష్ట్ర, దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి

# ఓ ఉన్నత శిఖరం

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై 27:** ఉత్తమ పార్లమెంటేరియన్, మాజీ కేంద్రమంత్రి, సూదిని జైపాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులు అర్పించారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో జైపాల్‌రెడ్డి ఒక ఉన్నత శిఖరం, ప్రజాస్వామ్యం, రాజకీయాల పట్ల లోతైన అవగాహన ఉన్న వ్యక్తి జైపాల్‌రెడ్డి అని అన్నారు. ప్రతి అంశంపై అద్భుతమైన వాగ్ధాటి, చతురత ఆయన సొంతమన్నారు.

విద్యార్థి నాయకుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా అనునిత్యం ప్రజల కోసమే పని చేశారు. తెలం గాణ రాష్ట్ర సాకారంలో జైపాల్‌రెడ్డి పోషించిన పాత్ర ప్రజలెప్పుడూ మరిచిపోలేరని గుర్తుచేసుకున్నారు. రాజకీయాల్లో ఎప్పుడూ విలువల విషయంలో రాజీ పడ లేదని, నిష్కళంక నేతగా, విలువలకు ప్రతీకగా జైపాల్‌రెడ్డి నిలిచారన్నారు. దక్షిణాది నుంచి తొలిసారి ఉత్తమ పార్లమెం టేరియన్ పురస్కారం అందు కున్న నేతగా జైపాల్ రెడ్డి ఘనత సాధించారన్నారు. వారి ఆశయాలను, ఆకాంక్షలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.

# కెటిఆర్ ఆరోపణలు అవాస్తవం

## జూబ్లీహిల్స్ పోలీసుల ఖండన

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** తమపై మాజీ మంత్రి, బిఆర్ఎస్ నేత కెటిఆర్ చేసిన విమర్శలను జూబ్లీహిల్స్ పోలీసులు ఖండించారు. బిఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్ భార్యపై పోలీసులు హత్యాయత్నం కేసు అక్రమంగా నమోదు చేశారని కెటిఆర్ చేసిన ఆరోపణలో ఎంతమాత్రం నిజం లేదని జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు. దీనిపై ఆదివారం నాడు జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ సహా ఇతర అధికారులు మీడియాతో మాట్లాడారు. గెల్లు శ్రీనివాస్ సతీమణి శ్వేతపై ఎవిడెన్స్ ట్యాంపర్ కేసు మాత్రమే నమోదు చేశామని, హత్యాయత్నం కేసు నమోదు చేయలేదని వారు తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీసులకు రాజకీయంతో కానీ రాజకీయ నేతలతో కానీ సంబంధం లేదని, పక్కాగా చట్ట ప్రకారం తాము విధులు నిర్వహిస్తామని వారు వెల్లడించారు. అన్ని కేసుల విచారణ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని, తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని వారు తెలిపారు. పోలీసులపై కె టిఆర్ తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదని, మాజీ మంత్రి అయిన ఆయన హోదాకు ఇది సరికాదని వారు హితవు పలికారు.

# ఫేషియల్ రికగ్నిషన్‌తో చేయూత

## పెన్షన్‌ల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త :** తెలంగాణలో చేయూత పెన్షనర్లకు గుడ్‌న్యూస్. జూలై 29 నుంచి ఫేషియల్ రికగ్నిషన్ విధానం ద్వారా పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. వేలిముద్రలు సరిగా లేకపోవడం, మోసాలను నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. తొలిదశలో పోస్టాఫీసుల ద్వారా పెన్షన్ పొందే 23 లక్షల మందికి ఇది వర్తిస్తుంది. దీనికోసం ప్రత్యేక యాప్, కొత్త స్మార్ట్‌ఫోన్లు, శిక్షణ వంటి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఫేషియల్ రికగ్నిషన్ సాధ్యం కానివారికి బయోమెట్రిక్ లేదా గ్రామ కార్యదర్శుల ద్వారా పెన్షన్ అందజేస్తారు. ఈ కొత్త విధానంతో పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణలో చేయూత పెన్షన్లు తీసుకునే వారికి గుడ్‌న్యూస్. ఇక నుంచి పెన్షన్లు తీసుకునే సమయంలో ఇబ్బందులు ఉండవు. జూలై 29 నుండి ముఖ గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) విధానం ద్వారా చేయూత పెన్షన్లను పంపిణీ చేయాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఈ వినూత్న పద్ధతి ద్వారా 44 లక్షల మంది లబ్ధిదారులకు పారదర్శకంగా పెన్షన్లు అందజేయటమ ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న బయోమెట్రిక్ విధానంలో కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా, చాలా మంది వృద్ధుల వేలిముద్రలు అదృశ్యం కావడంతో వారికి పెన్షన్లు అందడం లేదు. అంతేకాకుండా, కొంతమంది పెన్షనర్ల నిధులను ఇతరులు మోసపూరితంగా కాజేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ సమస్యలను పరిష్కరించడానికి, ప్రభుత్వం టీజీ ఆన్‌లైన్ సంస్థ సాంకేతిక సహకారంతో ముఖ గుర్తింపు విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. మొదటి దశలో, పోస్టాఫీసుల ద్వారా పెన్షన్లు పొందుతున్న 23 లక్షల మందికి మాత్రమే ఈ విధానం వర్తిస్తుంది. నగరాలు, పట్టణాల్లోని బ్యాంకు ఖాతాల ద్వారా పెన్షన్లు పొందుతున్న 21 లక్షల మందికి ప్రస్తుత విధానమే కొనసాగుతుంది. ఈ కొత్త విధానం కోసం ప్రత్యేకంగా ఒక యాప్ రూపొందించారు. పోస్టుమాస్టర్లు, పోస్టుమ్యాన్‌లు, పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు ఈ యాప్‌ను ఉపయోగించటంపై ఇప్పటికే ట్రైనింగ్ ఇచ్చారు. సుమారు రూ. 13 కోట్లతో 6,000 మంది పోస్ట్‌మ్యాన్‌లు, పోస్టుమాస్టర్లకు కొత్త స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చారు. రాష్ట్రస్థాయి అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి కాగా.. నేడు పోస్టల్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులకు శిక్షణ ఇస్తారు. అనంతరం వారు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటారు. సోమవారం పెన్షన్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుంది. మంగళవారం (జూలై 29) నుంచి ఈ కొత్త విధానాన్ని ప్రారంభించాలని అన్ని జిల్లాలకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు పోస్టాఫీసుకి వెళ్ళినప్పుడు వారి ఫోటో తీసి ఆధార్‌లో ఉన్న ఫోటోతో సరిపోల్చి యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత వారికి పెన్షన్ చెల్లిస్తారు. ఒకవేళ ఎవరైనా ఫోటోలు తీయలేని పరిస్థితిలో ఉంటే, వారికి బయోమెట్రిక్ విధానం ద్వారా పెన్షన్ ఇస్తారు. ముఖ గుర్తింపు, బయోమెట్రిక్ రెండూ పనిచేయని సందర్భాలలో గ్రామ కార్యదర్శులు వేలిముద్రలు వేసి పెన్షన్ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కొత్త విధానం వల్ల పెన్షన్ పంపిణీలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం వస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# నేడు ట్రైబల్ వెల్ఫేర్ అడ్వైజరీ కమిటీ సమావేశం

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ అడ్వైజరీ కమిటీ సమావేశం నేడు(సోమవారం) జరగనుంది. ఉదయం 11 గంటలకు మాసబ్‌ట్యాంక్‌లో గల దామోదరం సంజీవయ్య సంక్షేమ(డిఎస్ఎస్) భవన్‌లో జరగనుంది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్వర్యంలో సమావేశం జరగనుంది. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న మొదటి ఆదివాసీ సంక్షేమ సలహా కమిటీ సమావేశం. సమావేశంలో పలు అంశాలను చర్చించనున్నట్టు తెలుస్తోంది.

# జూరాలకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 12 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

## 202 టిఎంసిలకు చేరిన శ్రీశైలం డ్యాం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 27, ప్రభాతవార్త:** ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. కర్ణాటకలోకి ఆల్మట్టి, నారాయపూర్ జలాశయాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. నారాయణపూర్ జలాశయాలు నిండుకుండల్లా మారడంతో దిగువకు నీటిని విడుదల చేస్తుండడంతో జూరాలకు వరద పోటెత్తుతున్నది.



శ్రీశైలం నుంచి విడుదలవుతున్న వరద

జూరాల డ్యామ్‌కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నది. జలాశయానికి 10,8000క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదైంది. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం జూరాలలో 4.226టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. పవర్ హౌస్ కు 32719క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 81000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అదేవిధంగా బీమా లిఫ్టు -2కు 750 క్యూసెక్కులు, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750, ఆర్డీఎస్ కెనాల్ కు 150 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 550 క్యూసెక్కులు, కుడి కాలువకు 500క్యూసెక్కులు, సమాంతర కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 93962క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదయింది.

### 198 టిఎంసిలకు శ్రీశైలం డ్యాం

### ఒక గేటు ద్వారా సాగర్‌కు నీటి విడుదల

శ్రీశైలం జలాశయానికి వరద స్థిరంగా కొనసాగుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా డ్యాం జలకళను సంతరించుకున్నది. దీంతో ప్రాజెక్టు ఒకగేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలానికి జూరాల పవర్‌హౌజ్ ద్వారా 34,088క్యూసెక్కులు, స్పిల్ వే ద్వారా 31504క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 52,682 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుకుంటున్నది. డ్యాం నుంచి 1,18,274 క్యూసెక్కులు దిగువకు విడుదలవుతున్నాయి. డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకుగానూ 882.825అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 198.8120 టీఎంసీలకు చేరింది. పవర్‌హౌజ్‌కు 66,417క్యూసెక్కులు విడుదల చేయగా కుడి,ఎడమ జల విద్యుత్ కేంద్రాల వద్ద విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది.

# ఎప్‌సెట్-2025 సెకండ్ ఫేజ్.. అందుబాటులో 30,941 సీట్లు

## రెండు రోజుల్లో సీట్ల కేటాయింపు

## మొదటి విడతలో 59,980 మంది చేరిక

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. కౌన్సెలింగ్‌లో భాగంగా ఇప్పటికే మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి కాగా.. రెండో విడత సీట్ల కేటాయింపుకి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది.

రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 25 నుంచి స్లాట్‌బుకింగ్‌కి అవకాశం కల్పించారు. 26న సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగించారు. శనివారం, ఆదివారం వెబ్ ఆప్షన్లకి అవకాశం కల్పించారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చిన వారికి ఈ నెల 30 సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. అయితే మొదటి విడత కౌన్సెలింగ్‌కి రెండో విడత కౌన్సెలింగ్‌కి మధ్యలో అదనంగా కొన్ని ప్రైవేటు కాలేజీలకు అదనపు సీట్లను కేటాయించారు. దీంతో మొదటి విడతలో కంటే రెండో విడతలో సీట్లు పెరిగాయి. దీంతో రెండో విడతలో 30,941 సీట్లు అందుబాటులో ఉన్నట్టు కౌన్సెలింగ్ అధికారులు ప్రకటించారు.

మొదటి విడతలో మొత్తం ఇంజనీరింగ్ సీట్లు 1,07,444 సీట్లు అందుబాటులో ఉండగా.. అదనపు సీట్లతో కలిపి రెండో విడతకి 1,16,877కి పెరిగాయి. దీంతో కన్వీనర్ కోటా సీట్ల సంఖ్య 83,054 నుంచి 90,921కి పెరిగాయి.

మొదటి విడత సీట్ల కేటాయింపులో భాగంగా 77,561 సీట్ల కేటాయింపు చేయగా.. అందులో 59,980 మంది కాలేజీల్లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు. దీంతో మొదటి విడతలో ప్రకటించిన సీట్లు, రెండో విడతలో అదనంగా పెరిగిన సీట్లతో కలిపి రెండో విడతలో 30,941 సీట్లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు రెండో విడతకి వెబ్ ఆప్షన్లు ఇవ్వగా.. ఈ నెల 30న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు.

# బ్యాంకుల నిర్వచనం మారింది

## టెక్నాలజీని మిళితం చేస్తూ మార్పునకు అనుగుణంగా సేవలు

## దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార బ్యాంకుల పాత్ర కీలకం

## ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** ఒకప్పుడు బ్యాంకులంటే కేవలం డబ్బుల డిపాజిట్, విత్‌డ్రా మాత్రమే అనుకునేవారు.. కానీ ఇప్పుడు ఆ నిర్వచనం మారిందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఖాతా దారుల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా టెక్నాలజీని మిళితం చేస్తూ మార్పులను అందిపుచ్చుకుంటూ వివిధ రకాల సేవలను బ్యాంకులు అందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆదివారం అగ్రసేన్‌బ్యాంక్ అమీర్ పేట్ బ్రాంచ్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'దేశ ఆర్థిక వ్యవస్థలో సహకార బ్యాంకుల పాత్ర కీలకం అన్నారు. ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు ఆర్థిక సేవలను అందించడంలో ఇవి ముందున్నాయని, ఆర్‌బిఐ వార్షిక నివేదిక 2024 ప్రకారం దేశవ్యాప్తంగా 8.5 కోట్ల మందికి పైగా ప్రజలు వీటి సేవలను వినియోగించుకుంటున్నారని పేర్కొన్నారు. మొత్తం డిపాజిట్లు, రుణాలు రూ. 5.5 లక్షల కోట్ల మార్కును దాటాయని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

**క్రెడిట్, డిపాజిట్ నిష్పత్తి 66.7 శాతం..**

తెలంగాణలో 48 అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులు 321 శాఖల ద్వారా అర్బన్, సెమీ - అర్బన్ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నాయని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో వీటి బిజినెస్ టర్నోవర్ రూ.17వేల కోట్లు. క్రెడిట్, డిపాజిట్ నిష్పత్తి 66.7 శాతం. కూకట్ పల్లి, మలక్ పేట్, అమీర్ పేట్ తదితర ప్రాంతాల్లో క్రియాశీలకంగా ఉన్నాయన్నారు.

**తెలంగాణ మోడల్ పాథ్..**

సహకార బ్యాంకులు లాభాపేక్షతో కాకుండా, ఖాతా దారుల ప్రయోజనాల కోసం కమ్యూనిటీ ఆధారిత సేవలను అందిస్తున్నాయని తెలిపారు. కేర్(కమ్యూనిటీ ఫోకస్డ్, అఫర్డబుల్ యాక్సె సిబుల్ క్రెడిట్, రిలేషన్‌షిప్ బేస్డ్ బ్యాంకింగ్, ఎంపవరింగ్ లోకల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) మోడల్‌లో పని చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగ బ్యాంకుల అభివృద్ధికి పాథ్ పిఎటిహెచ్ (పాలసీ సపోర్ట్, యాక్సెస్ టూ డిజిటల్ టూల్స్, ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్, హైబ్రిడ్ ఫైనాన్స్ ఎకోసిస్టమ్స్) మోడల్‌ను అనుసరిస్తుంది. యువత, వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు, మహిళా స్వయం సహాయక బృందాలకు రుణ అనుసంధానాలు, గ్రీన్ లోన్స్ వంటి పథకాలను ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రెసిడెంట్ అనిరుధ్ గుప్తా, టిబారుమల్ జ్యూవెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ రాంభరోసే గుప్తా, సోమాని ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి అశోక్ కుమార్ సోమాని, అగ్రసేన్ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్ కుమార్ ఖేడియా, సీనియర్ వైస్ ఛైర్మన్ నవీన్ కుమార్ అగర్వాల్, వైస్ ఛైర్మన్ సురేష్ కుమార్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

# బిసి బిల్లుపై బిజెపి జాతీయ నాయకత్వం మౌనం

## తెలంగాణలో మాత్రం మద్దతు

## మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** బిజెపి జాతీయ నాయకత్వం బిసి బిల్లుపై మౌనంగా ఉంటే తెలంగాణలో బిజెపి అదే బిల్లుకు మద్దతు ఇస్తుందని ఆ పార్టీ ద్వంద్వవిధానంను మాజీ పిసిసి ప్రసిడెంట్ వి.హనుమంతరావు ఒక పత్రికా ప్రకటనలో ధ్వజమెత్తారు. బిసిలకు తెలంగాణ జనాభాకు అనుగుణంగా 42శాతం రిజర్వేషన్ అమలు చేయడానికి ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని చేధించి అమలు చేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జ్యోతిరావ్‌బా పూలే, సావిత్రిభా పూలే వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి చదువు బోధించు అనే సూత్రంతో కృషిచేశారని అదే స్ఫూర్తితో కాంగ్రెస్ కులవివక్షలేని సమాజాన్ని రూపొందించేందుకు కృషిచేస్తుందని అన్నారు. మేం ఎంతో మాకు అంత అని భారత్‌జోడో యాత్రలో రాహుల్ గాంధీ ప్రమాణం చేశాడని దానికి అనుగుణంగా మా పోరాటం ఉంటుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రిజర్వేషన్ శాస్త్రీయంగా చట్టపరంగా ఏలాంటి చిక్కులు తలెత్తంగా బిసి గణన చేశారని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాహుల్‌గాంధీ 21వ శతాబ్దం పూలే అని అభివర్ణించారు. రాహుల్‌గాంధీ వెనుకబడిన తరగతుల ఆర్థిక అభ్యున్నతికి సామాజిక సమానత్వంకు పాటుపడుతున్నారని అన్నారు.





# బాబును బస్టాండ్‌లో వదిలేసిన మహిళ ప్రియుడితో జంప్

## సిసి కెమెరాల ఫుటేజీ ద్వారా వారిద్దరి గుర్తింపు

## బాలుడిని కాపాడిన నల్గొండ టూటౌన్ పోలీసులు

**నల్లగొండ, జూలై 27, ప్రభాతవార్త:** తల్లి తన రెండు సంవత్సరాల బాలుడిని వదిలేయగా తక్షణమే స్పందించి సీసీ కెమెరాలు, ఫొటో ద్వారా గుర్తించి సురక్షి తంగా రక్షి ంచి తల్లిదండ్రులకు అప్పగించిన నల్గొండ టూటౌన్ పోలీసులు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నారు. నల్లగొండ బస్టాండ్‌లో ఏడుస్తూ ఒంటరిగా ఉన్న 15 నెలల బాలుడిని గుర్తించిన ఆర్టీసీ సిబ్బంది తక్షణమే నల్లగొండ టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే టూటౌన్ ఎస్ఐ ఎర్ర సైదులు సైదులు తమ సిబ్బం దిని అప్రమత్తం చేసి ఘటనాస్థలానికి చేరుకుని తగిన ఆధారాలతో విచారణ ప్రారంభించారు. సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించి బాలుడిని బస్టాండ్‌లో వదిలి తల్లి వేరే వ్యక్తితో బైక్‌పై వెళ్లినట్లు గుర్తించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ ఇంస్టాగ్రామ్‌లో నల్గొండలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన ఓ వ్యక్తికి పరిచయమై తన 15 నెలల బాలు డిని నిర్దాక్షిణ్యంగా బస్టాండ్‌లో వదిలేసి అతనితో కారులో వెళ్లి నల్లగొండ పోలీస్‌స్టేషన్ పరిధి లోని ఒక రూమ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించి మహిళను, ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే తల్లిదండ్రులను గుర్తించి పిలి పించగా, వారితో సుదీర్ఘ కౌన్సిలింగ్ నిర్వహించి, చట్టబద్ధంగా బాలుడిని తిరిగి బాలుడి తండ్రికి అప్పగించారు. ఈ ఘటనపై నల్గొండ జిల్లా పోలీసులు, ప్రజలు, శిశు సంక్షేమ సంస్థలు ప్రశంసల జల్లు కురిపిస్తున్నాయి.

# కిచెన్‌లో నిఘా నేత్రాలు.. ఫుడ్ పాయిజన్‌కు చెక్

## కమిటీలు, సేఫ్టీ అధికారుల తనిఖీలు

## త్వరలో మార్గదర్శకాలు విడుదల

## సంక్షేమ గురుకులాలపై సర్కార్ దృష్టి



**హైదరాబాద్, జూలై 27, ప్రభాతవార్త:** తెలంగాణలోని సంక్షేమ గురుకులాల్లో తరచూ ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో సర్కార్ అప్రమత్తమైంది. ఫుడ్ పాయిజనింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగం గా రాష్ట్రవ్యాప్తంగా అన్ని సంక్షేమ గురు కులాల కిచెన్‌లలో ఇక నుంచి అత్యాధుని కమైన సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చినట్లు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురు కులాల్లో ఈ కెమె రాలను ఫిట్ చేయనున్నారు. ఇప్పటికే గురు కులాల సెఫ్టీలో భాగంగా ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, నేరుగా కిచెన్ లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని ప్రభుత్వం ఒక నిర్ణయా నికి వచ్చింది. దీంతోపాటు అడిషనల్ కలెక్టర్లు, స్థానిక నేతలు, అధికారులతో కమిటీలు వేయనుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలోనే కలెక్టర్లకు జారీచేయనున్నది. వాన కాలం సీజన్ షురూ కాగానే రెగ్యులర్‌గా గురు కులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తు న్నాయి. దీంతో ఫుడ్ పాయిజన్ ఘటనలను సీరియస్‌గా తీసుకున్న సర్కార్ స్పష్టమైన యాక్షన్ ప్లాన్, సెక్యూరిటీ మెజర్స్‌తో ముందు కెళ్లాలని భావిస్తోంది. కాగా ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏ గురుకులాల్లోని కిచెన్ లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. అయితే ఈ దఫా తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిందేనని ప్రభుత్వం ఆదేశాలు న్నాయి. ఈ కెమెరాలు ఏర్పాటు వెనక బలమైన కారణం ఉన్నదనే విషయాన్ని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రత్యేక రిపోర్టు కూడా ఉన్నట్లు పేర్కొం టున్నారు. గత కొన్ని రోజుల నుంచి వరుసగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయి. గత ఏడాదిలోనూ ఎక్కువగానే సంభవించాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఘటనలపై వివిధ రూపాల్లో రహస్య విచారణ చేయించినట్లు తెలియవచ్చింది. ఈ విచారణ తర్వాత ఫుడ్ పాయిజన్ సంఘటనల్లో కుట్ర కోణం దాగినట్లు ప్రాథమికంగా ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇలాంటివి పునరావృతం కాకుండా, ఒక వేళ చేసిన స్పష్టమైన ఆధారాలను పసిగట్టేందుకు సంక్షేమ గురుకులాల కిచెన్లలోనూ సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు సంక్షేమ శాఖల అధికారుల ద్వారా వెల్లడవుతోంది. ఈ సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించనున్నారు. అక్కడ్నుంచి ప్రత్యేక టీమ్ సంక్షేమ గురుకులాలను మానిటరింగ్ చేయనున్నాయి. దీనితో పాటు, ఇక ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు కూడా రహస్య తనిఖీలు చేయనున్నారు. ఎప్పటికప్పుడు శాంపిల్స్ సేకరించి టెస్టులు నిర్వహించనున్నారు. నిరక్ష ్యం వహించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకునేలా యాక్షన్ ప్లాన్ కూడా రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.



## ఎస్పోర్ట్స్ చెస్ వరల్డ్ కప్‌లో.. ఫైనల్‌కు నిహాల్ అర్హత

### ప్రజ్ఞానంద ఓటమి

**న్యూఢిల్లీ:** ఈస్పోర్ట్స్ ప్రపంచ కప్-2025లో భారత చెస్ క్రీడాకారుడు నిహాల్ సరిన్ ఫైనల్‌కు అర్హత సాధించాడు. సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగే ఈ వరల్డ్ కప్‌లో త్రిస్సూర్‌కు చెందిన 21 ఏళ్ల నిహాల్ లాస్ట్ ఛాన్స్ క్వాలిఫయర్స్ నుండి ప్రధాన ఈవెంట్‌కు చేరుకున్న ఏకైక భారతీయుడుగా నిలిచాడు. ఫైనల్‌కు అర్హత సాధించిన ఇతరులలో అనిష్ గిరి, లెవాన్ అరోనియన్ మరియు జావోఖిర్ సిందరోవ్ ఉన్నారు. లాస్ట్ ఛాన్స్ క్వాలిఫయర్స్‌లో పాల్గొన్న మరో భారతీయుడు ప్రజ్ఞానంద రమేష్‌బాబు ఈ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాడు. స్పీడ్ చెస్ సామర్థ్యాలకు పేరుగాంచిన నిహాల్, ఆన్‌లైన్ చెస్ ప్రపంచంలో అత్యంత భయపడే ఆటగాళ్లలో ఒకరని నిరూపించుకున్నాడు. అంతకు ముందు తన గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన తర్వాత లాస్ట్ ఛాన్స్ క్వాలిఫయర్స్‌లో విజేతల బ్రాకెట్‌కు అర్హత సాధించిన నిహాల్, తన ప్రయోజనాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. తన మొదటి మ్యాచ్‌లో డెనిస్ లాజావిక్‌పై విజయంతో తన ఆటను ప్రారంభించిన అతను, రెండవ మ్యాచ్‌లో అనిష్‌ను ఓడించాడు. ఆ తర్వాత భారత ఆటగాడు ఆండ్రీ ఎసిపెంకోపై విజయం సాధించి విజేతల బ్రాకెట్ సెమీఫైనల్స్‌కు అర్హత సాధించి ఎస్పోర్ట్స్ ప్రపంచ కప్ ఫైనల్స్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకున్నాడు. ఇప్పటికే నేరుగా ఈ ఈవెంట్‌కు ఎరిగైసి అర్జున్ అర్హత సాధించగా, ఇప్పుడు నిహాల్ ఈస్పోర్ట్స్ ప్రపంచ కప్ ఫైనల్స్‌లో పోటీలో ఉన్న రెండవ భారతీయుడు అవుతాడు.




## ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు.. అంకితకు చారిత్రాత్మక రజతం

### పురుషుల జట్టుకు మరో కాంస్యం.. 12 పతకాలతో ముగించిన భారత్

**న్యూఢిల్లీ:** ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు చివరి రోజు అంకిత చారిత్రాత్మక రజతం గెలుచుకోగా, పురుషుల 4+100 మీటర్ల జట్టు మరో కాంస్యం గెలుచుకుంది. దీంతో 2025 యూనివర్సిటీ గేమ్స్‌ను భారతదేశం 12 పతకాలతో ముగించినట్లయింది. వీటిలో 2 బంగారు, 5 రజత, మరియు 5 కాంస్య పతకాలు ఉన్నాయి. ఆదివారం జర్మనీలోని బోచుమ్‌లో జరిగిన ఎఫ్ఐఎస్‌యు వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్ 2025లో భారత అథ్లెటిక్స్ బృందం తమ అద్భుతమైన ప్రదర్శనను కొనసాగించింది.

భారత పతకాల సంఖ్యకు మరో మూడు పతకాలు జోడించింది. పోటీ చివరి రోజున మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో ఒలింపియన్ అంకిత ధ్యాని రజత పతకాన్ని గెలుచుకోగా, భారత మహిళల 20 కిలోమీటర్ల రేస్‌వాక్ జట్టు కాంస్య పతకాన్ని గెలుచుకుంది. తరువాత, అనిమేష్ కుజుర్, మణికంఠ హోబ్లిధర్, లాలు ప్రసాద్ భోయ్ మరియు మృత్యుం దొండపాటిలతో కూడిన భారత పురుషుల 4+100 మీటర్ల రిలే జట్టు అద్భుతమైన రేసులో దూసుకెళ్లి భారతదేశం యొక్క మొట్టమొదటి రిలే కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఆ జట్టు 38.885 సెకన్లలో ఆస్ట్రేలియాను కేవలం ఒక మార్జిన్ (0.005) తేడాతో ఓడించి ఈవెంట్ నుండి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. అదే సమయంలో, దక్షిణ కొరియా మరియు దక్షిణాఫ్రికా వరుసగా స్వర్ణ మరియు రజత పతకాలను గెలుచుకున్నాయి. అలాగే అంకిత 4వ స్థానం నుండి చివరి ల్యాప్‌లో వెనుకబడి వచ్చి 9:31.99 సెకన్ల అద్భుతమైన సమయాన్ని నమోదు చేసింది, ఆమె మునుపటి 7 సెకన్ల భారీ తేడాతో మెరుగుపరిచి భారతదేశం యొక్క మొట్టమొదటి స్టీపుల్‌చేజ్ పతకాన్ని గెలుచుకుంది. మరోవైపు, సెజల్ సింగ్, మాన్సి నేగి మరియు మునితా పరాజపతి త్రయం కాంస్య పతకాన్ని గెలుచుకోవడంతో భారత మహిళల 20 కి.మీ రేస్‌వాక్ జట్టు వరుసగా రెండో యూనివర్సిటీ గేమ్స్ పతకాన్ని గెలుచుకుంది.

## ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ మీట్.. జావెలిన్‌లో దీపికకు టైటిల్

### పురుషుల టైటిల్ దీపాంషు కైవసం




**న్యూఢిల్లీ:** ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ మీట్-2025 మహిళ జావెలిన్‌లో భారత్ అథ్లెట్ దీపికి, పురుషుల జావెలిన్‌లో దీపాంషు శర్మ టైటిళ్లను కైవసం చేసుకున్నారు. మహిళల జావెలిన్‌లో దీపిక 56.41 మీటర్ల కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం పంజాబ్‌లోని సంగ్రూర్‌లో జరిగిన అండర్ 20 మహిళల జావెలిన్ త్రోలో భారత జావెలిన్ త్రోయర్ దీపిక ఐదు నెలల విరామం తర్వాత పోటీ రంగంలోకి అద్భుతంగా తిరిగి వచ్చింది, తన సొంత అండర్ 20 మహిళల జావెలిన్ త్రో జాతీయ రికార్డును బద్దలు కొట్టింది. 19 ఏళ్ల దీపిక భారతదేశ అండర్ 20 జాతీయ రికార్డును ఒక మీటర్ కంటే ఎక్కువ మెరుగుపరిచేందుకు తన మొదటి ప్రయత్నంలోనే 56.41 మీటర్లు విసిరి రికార్డు సృష్టించిన ఈ పోటీని ప్రారంభించి విజయాన్ని ధృవీకరించింది. వీటిలో 54 మీటర్లకు పైగా మూడు త్రోలు ఉన్నాయి. ఇది ఆమెను సీనియర్ సర్క్యూట్‌లో భారతదేశంలోని టాప్ 10 ఆల్‌టైమ్ బెస్ట్ త్రోయర్‌ల జాబితాలోకి తీసుకువెళుతుంది. కాగా పురుషుల జావెలిన్ త్రో టైటిల్‌ను 19 ఏళ్ల యువకుడు దీపాంషు శర్మ గెలుచుకున్నాడు, అతను 35 మంది పురుష జావెలిన్ త్రోయర్లతో కూడిన మైదానంలో 76.03 మీటర్ల కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనతో అగ్రస్థానంలో నిలిచాడు. మరోవైపు, అనుభవజ్ఞుడైన ఒలింపియన్ సర్వేష్ కుషారే 2.26 మీటర్ల ఎత్తుతో పురుషుల హైజంప్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు, ఫెడరేషన్ కప్ నుండి అతని సీజన్ అత్యుత్తమ రికార్డును సమం చేశాడు. టోక్యో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడానికి ప్రయత్నిస్తున్న సర్వేష్ తన ప్రదర్శనతో అద్భుత పరిచాడు. ఇది అతనికి కొన్ని కీలకమైన ర్యాంకింగ్ పాయింట్లను సంపాదించిపెడుతుంది.



పాకిస్థాన్, వెస్టిండీస్ కన్నా వెనుకంజ

127 టెస్ట్‌ల్లో 2 మ్యాచ్‌ల్లోనే విజయం

## టీమిండియా ఫెల్యూర్!

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో టెస్ట్ మ్యాచ్‌లు అంటే ఓపిక, పట్టుదల, వ్యూహాలకు నిదర్శనంగా చెబుతుంటారు. అయితే, కొన్నిసార్లు మ్యాచ్ గమనం ఊహించని మలుపులు తిరుగుతుంది. ముఖ్యంగా తొలి ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థికి భారీ ఆధిక్యం దక్కినప్పుడు ఆ మ్యాచ్ గెలవడం అత్యంత కష్టమైన పనుల్లో ఒకటి. ఈ విషయంలో టీమిండియా రికార్డు చూస్తే, అది అంత మెరుగ్గా లేదని తెలుస్తోంది. అటువంటి సమయంలో టీమిండియా అసాధారణ రికార్డును సాధించడానికి, కీలక సమయాల్లో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మరింత పటిష్టంగా రాణించడం అవసరం. తొలి ఇన్నింగ్స్‌లో భారీ లోటును అధిగమించి గెలవడానికి అసాధారణమైన పోరాటం, పట్టుదల అవసరం. అయితే గత కొన్నేళ్లుగా, తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగుల కంటే ఎక్కువ ఆధిక్యాన్ని ప్రత్యర్థులకు సమర్పించుకున్న తర్వాత టీమిండియా ఆడిన మొత్తం 127 టెస్టుల్లో కేవలం 2 సార్లు మాత్రమే విజయం సాధించిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ గణాంకాలు భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒక బలహీనతను స్పష్టంగా సూచిస్తున్నాయి. ముఖ్యంగా నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్య ఛేదనలో మెరుగైన ప్రదర్శన కనబరచడంపై దృష్టి సారించాలి. టీమిండియా సాధించిన ఆ రెండు అద్భుత విజయాలు భారత్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచాయి. 2021లో బ్రిస్బేన్ టెస్ట్ (ఆస్ట్రేలియాపై) భారత క్రికెట్ చరిత్రలో అత్యంత గొప్ప విజయాల్లో ఒకటి. అనేక మంది కీలక ఆటగాళ్లు గాయాలపాలై, ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగిన భారత్, ఆస్ట్రేలియాకు తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యాన్ని అప్పగించినా, నాలుగో ఇన్నింగ్స్‌లో 300+ పరుగుల లక్ష్యాన్ని ఛేదించి చరిత్ర సృష్టించింది. ఇది యువ ఆటగాళ్ల తెగువ, గొప్ప జట్టు స్ఫూర్తికి నిదర్శనం. అలాగే స్వదేశంలో ఇంగ్లాండ్‌తో 2024లో జరిగిన రాంచీ టెస్ట్‌లో కూడా టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో వెనుకబడినా, చివరికి పుంజుకుని విజయం సాధించింది.

ఈ విజయం, ఛేజింగ్‌లో టీమిండియా ఎదుర్కొంటున్న సవాళ్ల మధ్య లభించిన ఒక అరుదైన అవకాశం. ఇక ఛేజింగ్‌లో టీమిండియా ఎదుర్కొంటున్న సవాళ్లు చూస్తే గత 12 ఏళ్లలో టెస్టుల్లో 150 పరుగుల కంటే ఎక్కువ లక్ష్యాలను ఛేదిస్తూ కేవలం రెండు సార్లు మాత్రమే విజయం సాధించింది. 26 టెస్టుల్లో ఇలాంటి పరిస్థితి ఎదురవ్వగా, 17 మ్యాచ్‌ల్లో ఓటమి పాలై, 7 డ్రా అయ్యాయి. ఈ గణాంకాలు ఛేజింగ్‌లో టీమిండియాకు ఉన్న బలహీనతను స్పష్టం చేస్తున్నాయి. అయితే పాకిస్థాన్, వెస్టిండీస్ వంటి జట్లు కూడా ఈ విషయంలో భారత్ కంటే మెరుగ్గా ఉన్నాయి.

## పాకిస్థాన్ హ్యాట్రిక్

### వెస్టిండీస్‌పై 49 రన్స్ తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్-2025 టోర్నీలో పాకిస్థాన్ హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. ఈ టోర్నీలో భాగంగా లీడ్స్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో 49 పరుగుల తేడాతే పాకిస్థాన్ గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 200 పరుగులు చేసింది. పాక్ ఓపెనర్ కమ్రాన్ అక్మల్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. 43 ఏళ్ల అక్మల్ విండీస్ బౌలర్లను ఉతికారేశాడు.

లీడ్స్ మైదానంలో బౌండరీల వర్షం కురిపించాడు. 62 బంతులు ఎదుర్కొన్న అక్మల్ 13 ఫోర్లు, 5 సిక్స్‌లతో 113 పరుగులు చేశాడు. అతడితో పాటు, హాఫీజ్ 23



పరుగులతోరాణించాడు. విండీస్ బౌలర్లలో మహ్మద్, పొలార్డ్, బ్రావో, నర్స్ తలా వికెట్ సాధించారు. ఇక లక్ష్య చేధనలో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 151 పరుగులకే పరిమితమైంది. విండీస్ టాపర్డర్ మొత్తం విఫలమైంది. క్రిస్ గేల్ (5), స్మిత్ (3), సిమ్మన్స్ (0) పరుగులతో విఫలమయ్యారు. అయిత మిడిలార్డర్‌లో వాల్టన్ (42), పెర్కిన్స్ (30) పోరాడినప్పటికీ విండీస్‌కు ఓటమి తప్పలేదు. పాకిస్థాన్ బౌలర్లలో రీస్ 3 వికెట్లు పడగొట్టగా, తన్వీర్, యమీన్ తలా 2 వికెట్లు దక్కించుకున్నారు. కాగా ఈ టోర్నమెంట్‌లో ఇప్పటి వరకూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించిన పాకిస్థాన్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.